PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu


సంపుటి : 45 సంచిక : 116 | విజయవాడ, గురువారం 27 నవంబర్ 2025 | 8 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Thursday 27 November 2025 | Rs

సిరామిక్ టైల్స్ పరిశ్రమలో ప్రమాదం

- ఇద్దరు కార్మికుల దుర్మరణం
- పలువురికి తీవ్ర గాయాలు

2





సంక్షోభాలను అధిగమిస్తేనే విజయాలు

- విద్యార్థుల్లో ఆలోచనా శక్తి పెరగాలి
- ప్రతి పౌరుడూ విలువలు కాపాడాలి
- మాక్ అసెంబ్లీలో సిఎం చంద్రబాబు

2

విద్యార్థుల కోసం రూపొందించిన రాజ్యాంగం పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు, ఎపి శాసనసభాపతి అయ్యన్నపాత్రుడు, విద్యా శాఖ మంత్రి నారా లోకేష్, సిఎస్ విజయానంద్, వేదికపై మాక్ అసెంబ్లీ స్పీకర్ స్వాతి

ఆడుకుందామంటే ఆటస్థలాల్లేవు అధ్యక్షా !

- మాక్ అసెంబ్లీలో విద్యార్థులు
- ప్రతిధ్వనించిన ప్రజాసమస్యలు
- ప్రస్తుత చట్ట సభల తీరుపై విమర్శలు కూడా
- సోషల్ మీడియా నియంత్రణ బిల్లుకు ఆమోదం
- ఆద్యంతం అలరించిన కార్యక్రమం



ఆంధ్రప్రదేశ్ పాఠశాల శాసనసభ (మాక్ అసెంబ్లీ)లో స్పీకర్ పోడియం వద్ద ఆందోళన చేస్తున్న ప్రతిపక్ష సభ్యులు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

'సెల్‌ఫోన్లకు, సోషల్‌మీడియాకు అతుక్కుపోతున్నారని విద్యార్థులను అంటున్నారు అధ్యక్షా... ఆడుకుందామంటే ఆటస్థలాలు లేవు అధ్యక్షా'... నేటి విద్యావ్యవస్థ దుస్థితికి అద్దం పట్టేలా ఉన్న ఈ ప్రశ్నను అడిగింది ఏ చట్టసభ సభ్యులో అనుకుంటే పొరపాటు! ఆ సభలకు అద్దం పట్టేలా బుధవారం నిర్వహించిన ఒక మాక్ అసెంబ్లీలో విద్యార్థులు సంధించిన ప్రశ్న ఇది! రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా అసెంబ్లీ ఆవరణలో పాఠశాల విద్యార్థులతో 'ఆంధ్రప్రదేశ్ పాఠశాల శాసనసభ' పేరుతో విద్యాశాఖ ఈ కార్యక్రమాన్ని నిర్వహించింది. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, విద్యాశాఖ మంత్రి లోకేష్‌లతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు ఈ కార్యక్రమాన్ని ప్రత్యక్షంగా తిలకించారు. వారి సమక్షంలోనే చట్టసభల ప్రతినిధుల పాత్రలను పోషిస్తున్న విద్యార్థుల నుండి దూసుకొచ్చిన ఈ ప్రశ్న ఆలోచన రేకెత్తించింది. ఇదొక్కటే కాదు... చట్టసభల్లో ఇటీవల కాలంలో కరువైపోయిన అనేక అంశాలు ఈ కార్యక్రమంలో కనిపించాయి. స్పీకర్ ఎన్నిక జరిగిన తరువాత ముఖ్యమంత్రి, ప్రతిపక్షనేతలు ఇద్దరు కలిసి అభినందించడం, పోడియంపైకి తీసుకువెళ్లడం మిగతా 2లో

మళ్లీ తెరపైకి ఎన్‌జెఎసి

- కొలీజియం స్థానంలో పునరుద్ధరణకు పిటిషన్



న్యూఢిల్లీ : రాజ్యాంగ కోర్టులకు జ్యుడీషియల్ నియా మకాలు జరిపే కొలీజియం వ్యవస్థకు ముగింపు పలికి జాతీయ జ్యుడీషియల్ నియామకాల కమిషన్ (ఎన్‌జెఎసి)ను పునరుద్ధరించాలనే పిటిషన్‌ను పరిశీలిస్తామని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ బుధవారం తెలిపారు. ఎన్‌జెఎసిని సుప్రీంకోర్టు కొట్టివేయడం చాలా పెద్ద తప్పని పిటిషన్ వ్యాఖ్యానించింది. ఈ పిటిషన్ భారత ప్రధాన న్యాయమూర్తిని, సుప్రీం కోర్టు కొలీజియాన్ని, కేంద్ర ప్రభుత్వాన్ని, కొన్ని రాజకీయ పార్టీలను ప్రతివాదులుగా చేర్చింది. లీడ్ పిటిషనర్ అయిన న్యాయవాది మాథ్యూస్ జె.నెడుంపరా 76వ రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా ఈ పిటిషన్ గురించి మౌఖికంగా ప్రస్తావించారు. ప్రజల ఇష్టాన్ని నలుగురు న్యాయమూర్తుల అభిప్రాయం ద్వారా భర్తీ చేయడానికి ఉద్దేశించారని పేర్కొంటూ ఎన్‌జెఎసిను 2015లో సుప్రీం కోర్టు కొట్టివేసింది. 2015లో ఇచ్చిన తీర్పును రద్దు చేసినట్లుగా ప్రకటించాలని తాజా పిటిషన్ కోరింది. "కొలీజియం ఉనికిలోకి వచ్చినప్పటి నుండి అత్యున్నత న్యాయవ్యవస్థకు జరిగే నియామకాలు 'ఒక మిస్టరీలో చుట్టబడి' వుంటు న్నాయి. ఎక్కడా కూడా ఎలాంటి పారదర్శకత వుండడం లేదు. జ్యుడీషియరీలో కూడా దీనిపై అసంతృప్తి వ్యక్తమైంది. ప్రజల అభీష్టానికి ప్రాతినిధ్యం వహించే పార్లమెంట్ తన రాజ్యాంగ అధికారాల ప్రక్రియలో భాగంగా 99వ రాజ్యాంగ సవరణ చట్టాన్ని, ఎన్‌జెఎసి చట్టాన్ని తీసుకువచ్చింది. అయితే, ఆ చట్టాలను ఈ కోర్టే కొట్టివేసింది. పార్లమెంట్‌ను కేవలం ఒక ట్రిబ్యునల్ స్థాయికి దిగజార్చింది." అని పిటిషన్ పేర్కొంది.



విజయవాడలో ర్యాలీ నిర్వహిస్తున్న రైతు, కార్మిక సంఘాల నేతలు

లేబర్‌కోడ్‌లు రద్దు చేయండి

- అన్నదాతలకిచ్చిన హామీలను అమలు చేయండి
- రైతు, కార్మిక సంఘాలు డిమాండ్
- విజయవాడలో నిరసన ప్రదర్శన

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కార్పొరేట్లకు అనుకూలంగా కేంద్ర ప్రభుత్వం ఏకపక్షంగా రూపొందించిన లేబర్‌కోడ్‌లను తక్షణమే రద్దుచేయాలని, అన్నదాతలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని వివిధ రైతు, కార్మిక సంఘాలు డిమాండ్ చేశాయి. రైతాంగ చారిత్రాత్మక పోరాటానికి ఐదు సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా బుధవారం సంయుక్త కిసాన్ మోర్చా, కేంద్ర కార్మిక సంఘాల పిలుపు మేరకు దేశ వ్యాప్తంగా నిర్వహిస్తున్న నిరసనల్లో భాగంగా విజయవాడలోని ఐలమ్మ విగ్రహం నుంచి ధర్నా చౌక్ వరకూ నిరసన ప్రదర్శన జరిగింది. అనంతరం ధర్నా చౌక్ వద్ద నిర్వహించిన బహిరంగ సభలో వివిధ సంఘాల నేతలు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమలులోకి తీసుకువచ్చిన లేబర్‌కోడ్‌లను తక్షణమే రద్దు చేయాలన్నారు. రైతు సంఘాల సమన్వయ సమితి కన్వీనర్, మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు మాట్లాడుతూ, పార్లమెంట్ ఆమోదించిన బిల్లులను రద్దు చేయించిన ఘనత ఒక్క రైతు ఉద్యమానికే దక్కిందని పేర్కొన్నారు. ఏడాదికి ఐదు లక్షల మందికిపైగా రైతాంగం ఆత్మహత్యలు చేసుకుంటున్నారని, ఇందుకు కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న విధానాలే కారణమని తెలిపారు. ఢిల్లీలో రైతులు చేపట్టిన సుదీర్ఘ పోరాటానికి ఐదేళ్లు పూర్తయినట్లు చెప్పారు. రాజ్యాంగ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని, రాజ్యాంగంలో పొందుపరిచిన హక్కులను, చట్టాలను కాపాడాలని కోరుతూ ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు.

ఏడాది పాటు సాగిన రైతాంగ పోరాటం ఫలితంగా 4 నల్లచట్టాలను రద్దు చేసిన విషయాన్ని గుర్తుచేశారు. గతంలో జమిందార్లకు వ్యతిరేకంగా రైతాంగం చేసిన పోరాట ఫలితంగా భూ పంపిణీ జరిగితే, నేటి ప్రభుత్వాలు రైతుల భూములను గుంజుకుని కార్పొరేట్ సంస్థలకు కట్టబెడుతున్నాయన్నారు. సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నరసింగరావు మాట్లాడుతూ, లేబర్ కోడ్‌లపై నోటిఫికేషన్ ఇవ్వడాన్ని తీవ్రంగా ఖండించారు. ఎన్నికల అనంతరం ప్రజా వ్యతిరేక విధానాలు అవలంభించడం బిజెపికి పరిపాటైందన్నారు. కార్మిక హక్కులు, చట్టాలు ఎవరి దయాదాక్షిణ్యాలు, బిక్ష కాదని పేర్కొన్నారు. ఎన్నో ఏళ్ల పోరాటాల ఫలితంగా సాధించుకున్నట్లు తెలిపారు. ప్రభుత్వాలు ఇప్పుడు యాజమాన్యాల అనుకూలమైన చట్టాలు చేశాయని, మరోసారి కార్మికవర్గం ఉద్యమాలు చేసి కార్మికుల అనుకూల చట్టాలను అమల్లోకి తెచ్చుకోవాలని పిలుపునిచ్చారు. రైతులు, కార్మికులు సంయుక్తంగా అలుపెరుగని మిగతా 7లో

మ్యాగ్నెట్ తయారీ పథకానికి రూ.7,280 కోట్లు

- పూణే మెట్రో రైలు రెండో దశకు రూ.9,858 కోట్లు
- కేంద్ర మంత్రి వర్గ నిర్ణయాలు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

రేర్ ఎర్త్ మ్యాగ్నెట్ ప్రొడక్షన్ (ఆర్‌ఈఎంపి)కు రూ.7,280 కోట్లు కేటాయిస్తూ కేంద్ర మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. బుధవారం నాడిక్కడ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అధ్యక్షతన కేంద్ర మంత్రివర్గం సమావేశమైంది. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ మంత్రివర్గ నిర్ణయాలను వెల్లడించారు. పుణే నగరంలో మెట్రో రైలు (రెండో దశ) పొడిగింపునకు రూ.9,858 కోట్లు కేటాయించినట్లు వివరించారు. మహారాష్ట్ర, గుజరాత్ రాష్ట్రాల్లో దేవభూమి ద్వారక – కర్నాలస్ రైల్వే లైన్ డబ్లింగ్ పనులకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందన్నారు. అందుకు రూ.1,457 కోట్లు కేటాయించినట్లు చెప్పారు. బద్లాపూర్ – కర్జాత్ థర్డ్, ఫోర్త్ రైల్వే పనులకు సైతం అనుమతి ఇచ్చినట్లు చెప్పారు. ఈ ప్రాజెక్టులన్నీ సకాలంలో పూర్తవుతాయని విశ్వాసం వ్యక్తం చేశారు. ముంబాయి సమీపంలోని బద్లాపూర్ – కర్జాత్ లైన్, గుజరాత్‌లోని ద్వారకా లైన్‌లకు ఆమోదం తెలిపింది. ఈ ప్రాజెక్టులు ద్వారా లక్షలాది మంది ప్రయాణికులకు ప్రత్యక్ష ప్రయోజనం చేకూరుతుందన్నారు. అలాగే ప్రయాణ సమయం గణనీయంగా తగ్గుతుందని చెప్పారు. పుణే మెట్రోకు కేంద్రం రూ. 9,858 కోట్లు గ్రాంట్‌ను అందించనుందన్నారు. దీనిద్వారా 32 కిలోమీటర్ల మేర కొత్త లైన్ వేసేందుకు వీలు కలుగుతుందని పేర్కొన్నారు. ఈ మార్గం ఖరడి నుంచి ఖడక్వాస్లా వరకు, నల్ స్టాప్ నుంచి మాణిక్ బాగ్ వరకు ఈ మెట్రొ రైలు నడవనుందన్నారు. ట్రాఫిక్ జామ్‌తో నిత్య ఇబ్బందులు ఎదుర్కొంటున్న పుణే వాసులకు ఇది పెద్ద ఉపశమనం కలిగిస్తుందని మంత్రి అశ్వినీ వైష్ణవ్ ఆశాభావం వ్యక్తం చేశారు. శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానాన్ని దిగుమతి చేసుకోవడాన్ని తగ్గించి.. స్వదేశంలోనే దీనిని అభివృద్ధి చేసుకునే దిశగా కేంద్రం అడుగులు వేస్తోంది. దాంతో రేర్ ఎర్త్ మ్యాగ్నెట్ ప్రొడక్షన్ (ఆర్‌ఈఎంపి) పథకానికి కేంద్రం శ్రీకారం చుట్టింది. ఈ పథకానికి బడ్జెట్‌లో రూ. 7,280 కోట్లు కేటాయించింది. భారత్‌లో హైటెక్ మాగ్నెట్లను తయారు చేయడమే దీని లక్ష్యం. ఈ మాగ్నెట్లను ఎలక్ట్రిక్ వాహనాలు, మొబైల్ ఫోన్లలో ఉపయోగిస్తారు.

మరో అల్పపీడనం

- విపత్తుల నిర్వహణ సంస్థ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

మలక్కా జలసంధి ప్రాంతాల్లో తీవ్ర వాయుగుండం కొనసాగుతోందని విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. ఇది పశ్చిమ వాయువ్య దిశగా నెమ్మదిగా కదులుతూ తుపానుగా బలపడే అవకాశం ఉందని బుధవారం ఒక ప్రకటనలో పేర్కొంది. అలాగే నైరుతి బంగాళాఖాతం, దక్షిణ శ్రీలంక, హిందూ మహాసముద్రం మీదగా అల్పపీడనం కొనసాగుతోందని తెలిపింది. ఇది రాబోయే 12 గంటల్లో ఉత్తర వాయువ్య దిశగా కదులుతూ తీవ్ర అల్పపీడనంగా మారే అవకాశం ఉందని వెల్లడించింది. వీటి ప్రభావంతో ఈ నెల 29 నుంచి డిసెంబరు 2వ తేదీ వరకూ కోస్తాంధ్ర, రాయలసీమలో అక్కడక్కడా మోస్తరు వర్షాలు పడే అవకాశం ఉందని తెలిపింది. రైతులు అప్రమత్తమై వ్యవసాయ పనుల్లో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించింది. తదుపరి 24 గంటల్లో వాయుగుండంగా బలపడే అవకాశం ఉన్నట్లు తెలిపింది. మత్స్యకారులు గురువారం నుంచి సముద్రంలో వేటకు వెళ్లరాదని హెచ్చరించింది. వేటకు వెళ్లిన మత్స్యకారులు వెంటనే తిరిగి రావాలని సూచించింది.

సోషలిజంతోనే సమానత్వం

- ఐక్యతతోనే సాధించగలం
- సదస్సులో బివి రాఘవులు



అనంతపురంలో నిర్వహించిన రెడ్ వాలంటీర్ల కవాతులో బివి రాఘవులు, రాంభూపాల్ తదితరులు

ప్రజాశక్తి- అనంతపురం ప్రతినిధి

తారతమ్యాల్లేని సమసమాజ నిర్మాణం సోషలిజంతోనే సాధ్యమని సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బివి.రాఘవులు పేర్కొన్నారు. 'సోషలిజం ఔన్నత్యం – సామ్రాజ్యవాద ప్రమాదం' అనే అంశంపై సిపిఎం నగర కమిటీ ఆధ్వర్యంలో అనంతపురంలోని లలిత కళాపరిషత్ హాలులో బుధవారం సదస్సు జరిగింది. దీనికి ముందు నగరంలోని ఆర్ట్స్ కళాశాల మైదానం నుంచి టవర్ క్లాక్ మీదుగా సప్తగిరి సర్కిల్ వరకు రెడ్‌షర్టు వలంటీర్ల ప్రదర్శన నిర్వహించారు. సిపిఎం నాయకులు, కార్యకర్తలు, అభిమానులు వందలాది మంది ఎర్ర రంగు దుస్తులతో మార్చ్‌ఫాస్టు చేశారు. జిందాబాద్ సిపిఎం అంటూ సాగిన ఈ ప్రదర్శన అందరినీ ఆకర్షించింది. అనంతరం సిపిఎం నగర కార్యదర్శి వి.రామిరెడ్డి అధ్యక్షతన జరిగిన సదస్సులో బివి.రాఘవులు ప్రసంగించారు.

1917లో రష్యాలో జార్ చక్రవర్తిని పదవీచ్యుతిని చేసి కార్మికులు, కర్షకులు రాజ్యాధికారం చేపట్టారని, అప్పటి నుంచి 50 ఏళ్లపాటు రష్యాలో సోషలిస్టు ప్రభుత్వం ప్రజలకు విద్య, వైద్యం, ఉపాధి, ఇలా అన్ని రంగాల్లో సమానత్వం సాధించిందని గుర్తు చేశారు. ప్రపంచం మొత్తం సోషలిజం వైపు చూస్తున్న తరుణంలో పెట్టుబడిదారీ వ్యవస్థ కుట్రలు పన్ని ఆ ప్రభుత్వాన్ని కూల్చివేసిందని వివరించారు. ప్రస్తుతం చైనా, క్యూబా తదితర దేశాలు పెట్టుబడిదారీ వ్యవస్థకు ప్రత్యామ్నాయంగా నిలుస్తున్నాయన్నారు. సోషలిజంలో దేశాభివృద్ధి ఏ రకంగా ఉంటుందన్నది గతంలో రష్యా చాటిందని, ఇప్పుడు చైనా దీన్ని చాటుతోందని పేర్కొన్నారు. పెట్టుబడిదారీ వ్యవస్థ ఎప్పుడూ ధనిక, పేదల మధ్య తారతమ్యాలను పెంచుతుందని వివరించారు. అగ్రగామి దేశంగా ఉన్న అమెరికాలోనూ ఈ తారతమ్యాలు స్పష్టంగా కనిపిస్తున్నాయన్నారు. తినడానికి తిండి, మిగతా 7లో

వెస్ట్ బ్యాంక్‌లో ఇజ్రాయిల్ కొత్త ఆపరేషన్ !

- ఐదు పట్టణాల దిగ్బంధనం, 30కిపైగా కుటుంబాల తరిమివేత

జెరూసలేం : ఆక్రమిత వెస్ట్ బ్యాంక్‌లోని ఉత్తర ప్రాంతంలో ఇజ్రాయిల్ ఆర్మీ నూతన ఆపరేషన్ చేపట్టింది. టుబాస్ ప్రాంతాన్ని దిగ్బంధనం చేసిన ఇజ్రాయిల్ ఆర్మీ పదుల సంఖ్యలో కుటుంబాలను అక్కడ నుండి తరిమివేసింది. ఈ విషయాన్ని ఇజ్రాయిల్ మిలటరీ, అంతర్గత భద్రతా సర్వీసు విభాగం ఒక సంయుక్త ప్రకటనలో తెలిపాయి. పాలస్తీనా శరణార్థ శిబిరాలను లక్ష్యంగా చేసుకుని ఈ ఏడాది జనవరిలో ప్రారంభించిన ఆపరేషన్‌లో భాగం కాదని, ఇది కొత్త ఆపరేషన్ అని ప్రకటన పేర్కొంది. జోర్డాన్ లోయకు సమీపంలో 'కొత్త వాస్తవితలను' విధించడమే ఈ కొత్త దాడి లక్ష్యమని టుబాస్ గరవ్నర్ అహ్మద్ అసద్ పేర్కొన్నారు. దాదాపు 30కుటుంబాలను ఇళ్ళనుండి వెళ్లగొట్టారని గవర్నర్ అసద్ తెలిపారు. అనేక భవనాలను బలగాలు తమ అదుపులోకి తీసుకున్నాయన్నారు. ఆర్మీ చుట్టుముట్టిన ప్రాంతంలో మొత్తంగా ఐదు పట్టణాలు వున్నాయి, అందులో 50వేల మందికి పైగా పాలస్తీనియన్లు నివసిస్తున్నారు. అలాగే, టుబాస్ గవర్నరేట్ ప్రాంతాలను ఇజ్రాయిల్ చాలావరకు మూసివేసింది. ఉత్తర జోర్డాన్ లోయలోకి భారీగా బలగాలను మోహరించింది. ఆక్రమిత వెస్ట్ బ్యాంక్‌లోని మిగిలినప్రాంతాలతో సంబంధం లేకుండా టుబాస్‌ను వేరు చేసి దిగ్బంధించింది. బుధవారం తెల్లవారే సరికల్లా ప్రతి మలుపులోనూ మిలటరీ బుల్డోజర్లు వచ్చి నేలను తవ్వి పెట్టాయని ప్రజలు మీడియాకు తెలిపారు. అక్కడున్న పాలస్తీనియన్లను బెదిరించడా నికి ఇజ్రాయిలీ అపాచి హెలికాప్టర్లు ఖాళీ పొలాలపై రౌండ్లు వేస్తూ కాల్పులు జరిపాయి. ఆ తర్వాత టుబాస్ నగరంలో ఇంటింటికి సైనికుల సోదాలు మొదలయ్యాయి. టుబాస్‌కు చుట్టుపక్కల గల నాలుగు పట్టణాల్లో కూడా ఇదే పరిస్థితి నెలకొంది. ఇంకా ప్రతిఘటిస్తున్న ఫైటర్లను లక్ష్యంగా చేసుకునే తాము కొత్తగా మిలటరీ ఆపరేషన్ చేపట్టినట్లు ఆర్మీ ప్రకటించింది. వెస్ట్ బ్యాంక్‌ను సమారియాగా ఇజ్రాయిల్ వ్యవహరిస్తుంది. ఉత్తర సమారియా ప్రాంతంలో తీవ్రవాద కార్యకలాపాలను ఎదుర్కొనేం దుకే 'కౌంటర్ టెర్రరిజం' ఆపరేషన్‌లో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపింది.

హమాస్ ఖండన

తాజా దాడులను హమాస్ తీవ్రంగా ఖండించింది. యూదు ఆర్మీ నేరపూరిత చర్య అని విమర్శించింది. తాజా దిగ్బంధనాలు, కర్ఫ్యూ, దాడులు ఇవన్నీ చూస్తుంటే పద్ధతి ప్రకారం జరుగుతున్న నేరాలుగా తెలుస్తోందని విమర్శించింది.

15మంది మృతదేహాల అప్పగింత

ఇదిలావుండగా, కాల్పుల విరమణ ఒపందంలో భాగంగా ఇజ్రాయిల్ మరో 15మంది పాలస్తీనియన్ల మృతదేహాలను హమాస్‌కు బుధవారం అప్పగించింది. దీంతో ఇప్పటివరకు మొత్తంగా 345 పాలస్తీనియన్ల మృతదేహాలను ఇజ్రాయిల్ వెనక్కి పంపినట్లైంది. అయితే వీటిలో కేవలం 99 మృతదేహాలను మాత్రమే గుర్తించినట్లు గాజా ఆరోగ్య శాఖ అధికారులు తెలిపారు. డిఎన్ఎ పరీక్షా కేంద్రాలు గాజాలో లేనందువల్ల గుర్తించడమనే ప్రక్రియ చాలా సంక్లిష్టంగా మారిందని చెప్పారు. తాజా అప్పగింతతో మొదటి దశ కాల్పుల విరమణ ఒప్పందం కింద అంగీకరించిన అంశాలు పూర్తయ్యాయి. ఇక రెండో దశపై చర్చలు జరగాల్సి వుంది.

రెండో దశపై చర్చలు

రెండో దశ కాల్పుల విరమణపై చర్చలు జరిపేందుకు కైరోలో బుధవారం టర్కీ, కతార్, ఈజిప్ట్ అధికారులు సమావేశమయ్యారు. గాజా పాలన కోసం అంతర్జాతీయ సంస్థను ఏర్పాటు చేయడం, అక్కడి పునర్నిర్మాణ కార్యకలాపాలను పర్య వేక్షించడం, అంతర్జాతీయ స్థిరీకరణ బలగాలను మోహరించడం వంటివి రెండో దశ ఒప్పందంలో వున్నాయి.

అయితే ఇందులోని ప్రతీ అంశంపై, వాటి అమలుకు కాలపరిమితిపై అనేకానేక ప్రశ్నలు వున్నాయి. వాటన్నింటికీ సమాధానాలు రావాల్సి వుంది. ఈలోగా దాదాపు పాలస్తీనియన్లందరూ నిర్వాసితులై మానవతా సాయంపై ఆధారపడి వున్నారు. గాజాలో దాదాపు సగానికిపైగా ప్రాంతంపై హమాస్‌కు గట్టి పట్టు వుంది. ఈ ప్రాంత పునర్నిర్మాణ పనులు ఇంకా మొదలే కాలేదు.

వెయ్యి పాయింట్లకు సెన్సెక్స్

ముంబయి : వరుసగా మూడు సెషన్లలో నష్టాలను చవి చూసిన దలాల్ స్ట్రీట్‌లో బుధవారం కొనుగోళ్ల ఉత్సాహం కనబడింది. అంతర్జాతీయ మార్కెట్లు సానుకూలంగా ట్రేడింగ్ కావడంతో పాటుగా అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లను తగ్గించనుందనే అంచనాలు ఇన్వెస్టర్లలో విశ్వాసాన్ని నింపాయి. ఈ నేపథ్యంలోనే బిఎస్ఇ సెన్సెక్స్ 1022.50 పాయింట్లు లేదా 1.21 శాతం లాభంతో 85,609.51కు చేరింది. ఎన్ఎస్ఇ నిఫ్టీ 320.50 పాయింట్లు లేదా 1.24 శాతం లాభంతో 26,205.30 వద్ద ముగిసింది. వీటితో చాలా రోజులుగా ఆటుపోట్లతో నిరుత్సాహంలో ట్రేడింగ్ అవుతున్న మార్కెట్లకు ఉపశమనం లభించింది. ఒక్క పూటలోనే బిఎస్ఇ మార్కెట్ కాపిటలైజేషన్ రూ.6 లక్షల కోట్లు పెరిగి రూ.475 లక్షల కోట్లకు చేరింది. గతేడాది సెప్టెంబర్ 27న సెన్సెక్స్ 85,978 వద్ద, నిఫ్టీ 26,277 వద్ద ఆల్‌టైమ్ గరిష్టాలను తాకాయి. రెండు సూచీలూ కాస్త దూరంలో నిలిచాయి. వచ్చే నెల డిసెంబర్‌లో యుఎస్ ఫెడ్ వడ్డీ రేట్లను తగ్గించనుందనే అంచనాలు పెరిగాయి. రష్యా. ఉక్రెయిన్ మధ్య ఆందోళనలు ముగింపు దశకు చేరుకోవడమూ ఇన్వెస్టర్లలో విశ్వాసాన్ని పెంచాయి. సెన్సెక్స్ 30 సూచీలో భారతీ ఎయిర్‌టెల్, ఏషియన్ పెయింట్స్ మినహా మిగిలిన అన్ని కంపెనీల షేర్లు లాభాల్లో ముగిశాయి. బజాజ్ ఫిన్‌సర్వ్, బజాజ్ ఫైనాన్స్, టాటా స్టీల్, రిలయన్స్, సన్‌ఫార్మా షేర్లు అధికంగా లాభపడిన వాటిలో ముందు వరుసలో ఉన్నాయి.



అరటి పంటకు జరిగిన నష్టాన్ని వైఎస్ జగన్‌కు వివరిస్తున్నా మహిళా రైతు

అరటికి గిట్టుబాటు ధర కల్పించాలి

- రైతులను ఆదుకోవడంలో కూటమి ప్రభుత్వం విఫలం
- మాజీ సిఎం జగన్‌మోహన్‌రెడ్డి

ప్రజాశక్తి- పులివెందుల టౌన్

అరటి పంట చెట్టు మీదనే మాగి కాయలు కుళ్లిపోతున్నాయని మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. కూటమి ప్రభుత్వంలో ఏ పంటకూ గిట్టుబాటు ధర లేదని, రైతులను ఆదుకునే నాథుడే కరువయ్యాడని విమర్శించారు. రైతుల బతుకులు బస్టాండ్ చేశారని, ఇన్‌పుట్ సబ్సిడీ లేదని, ఉచిత పంటల బీమా లేదని అన్నారు. ప్రభుత్వం తీరు మారకపోతే రైతులతో కలిసి ఉద్యమిస్తామని హెచ్చరించారు. బుధవారం ఆయన వైఎస్ఆర్ కడప జిల్లా పులివెందుల పట్టణ పరిధిలోని బ్రాహ్మణపల్లి గ్రామంలో అరటి పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులను అడిగి పంట నష్టం వివరాలు తెలుసుకున్నారు. అనంతరం మీడియాతో జగన్ మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వ హయాంలో 2024లో 600 మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో ఇంటిగ్రేటెడ్ కోల్డ్ స్టోరేజీని ఏర్పాటు చేశామని, విద్యుత్ బిల్లు ఎక్కువ వస్తుందనే పేరుతో ప్రస్తుత ప్రభుత్వం దీనిని ఆచరణలోకి మిగతా 7లో

సంక్షోభాలను అధిగమిస్తేనే విజయాలు

- విద్యార్థుల్లో ఆలోచనా శక్తి పెరగాలి
- ప్రతి పౌరుడూ విలువలు కాపాడాలి
- మాక్ అసెంబ్లీలో సిఎం చంద్రబాబు

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

సంక్షోభాలను అధిగమించగలిగితే విజయావకాశాలు పెరుగుతాయని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సూచించారు. విద్యార్థులు కూడా మంచి, చెడుపై ఆలోచించే శక్తిని పెంపొందించుకోవాలన్నారు. సంవిధాన్ దివస్-రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా అసెంబ్లీ ప్రాంగణంలో ఏపి పాఠశాల శాసనసభ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన విద్యార్థులతో నిర్వహించిన మాక్ డ్రిల్‌ను పరిశీలించారు. విద్యార్థులు తీరును పరిశీలించిన ఆయన వారిని అభినందించారు. తడబాటు లేకుండా మాట్లాడిన తీరు అద్భుతంగా ఉందని ప్రశంసించారు. ఏ పనైనా శ్రద్ధగా చేస్తే మెరుగైన ఫలితాలు వస్తాయని, తాను కూడా చిన్నప్పట్నుంచి అదే అలవరచుకున్నానని వివరించారు. తనను లెక్చరర్ కావాలని తాను చదివిన విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ సూచిస్తే రాజకీయాల్లోకి వెళ్తానని చెప్పిన విషయాన్ని గుర్తు చేసుకున్నారు. క్రమశిక్షణతోనే 30 ఏళ్లకే మంత్రిని, 45 ఏళ్లకే ముఖ్యమంత్రిగా ఎదిగానని చెప్పారు. భారత రాజ్యాంగం ఎంతో గొప్పదని, ప్రజలకు లభించిన ఆయుధం రాజ్యాంగమని వ్యాఖ్యానించారు. ఓటు వజ్రాయుధం వంటిదని, దానిని అంతా ఉపయోగించుకోవాలని హితవు పలికారు. ఇప్పుడు మాక్ డ్రిల్‌లో పాల్గొన్న విద్యార్థులందరికీ వచ్చే ఎన్నికల నాటికి ఓటుహక్కు వస్తుందని, దానిని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ మాక్ డ్రిల్‌లో పాల్గొన్న వారిలో ఎక్కువ మంది మహిళలు ఉండటం సంతోషంగా ఉందని, చట్టసభల్లో కూడా 33 శాతం మంది మహిళలకు రిజర్వేషన్ కల్పించిన దేశం ఒక్క భారతేనని గుర్తుచేశారు.

సాధారణ వ్యక్తులే గొప్పోళ్లు

దేశంలో సాధారణ కుటుంబాల నుంచి వచ్చిన వాళ్లే ఇప్పుడు గొప్ప స్థానాల్లో ఉన్నారని చంద్రబాబు అన్నారు. చాయ్‌వాలా స్థాయి నుంచి నరేంద్ర మోడీ దేశానికి ప్రధాని అయ్యారని, సాధారణ కుటుంబం నుంచి వచ్చిన అబ్దుల్ కలామ్ రాష్ట్రపతిగా ఎదిగారని, గిరిజన మహిళ ద్రౌపది ముర్ము రాష్ట్రపతి అయ్యారని, తాను కూడా సాధారణ కుటుంబం నుంచే నాలుగు సార్లు ముఖ్యమంత్రి అయ్యానని గుర్తు చేశారు. అందుకే ఇప్పుడున్న వారంతా ఆ స్థాయికి ఎదిగేలా ప్రయత్నించాలన్నారు. రాజ్యాంగం కొన్ని హక్కులు, బాధ్యతలను ఇచ్చిందని, అయితే కొంతమంది బాధ్యతలను విస్మరించి కేవలం హక్కుల కోసమే పోరాడుతారని పేర్కొన్నారు. ఇది సరికాదని తెలిపారు.

మహిళల్లో ధైర్యం పెరగాలి

గతంలో మహిళలపై చిన్నచూపు ఉండేదని, ఇప్పుడు రోజులు మారుతున్నాయని సిఎం చంద్రబాబు అన్నారు. మహిళలకు న్యాయం చేసేందుకు ఆస్తిలో సమాన హక్కు ఇచ్చింది ఎన్‌టిఆర్ అని, తాను కూడా డ్వాక్రా ద్వారా ఆర్థికంగా మహిళలు ఎదిగేందుకు చర్యలు తీసుకున్నానని అన్నారు.

మహిళలపై ఇటీవల కాలంలో సామాజిక మాధ్యమాల్లో ఇష్టానుసారంగా పోస్టులు పెడుతూ వ్యక్తిత్వ హననానికి పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిని అడ్డుకునేందుకు మహిళలు ధైర్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. గాజులు తొడుక్కున్నారా, ఆడపిల్లల ఏడవద్దు వంటి మాటలు ఇకపై వినపడకూడదన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు అసెంబ్లీ నిర్వహణపై మాక్ డ్రిల్ నిర్వహించారు. శాసనసభలో ఎలా వ్యవహరించాలన్నదానిపై విద్యార్థులు ప్రదర్శించిన విధానం ఆకట్టుకుంది. విలువలతో కూడిన మాటలతో ఆకట్టుకున్నారు. ఈ మాక్ డ్రిల్‌ను ముఖ్యమంత్రితోపాటు శాసనసభ స్పీకరు, మంత్రులు, సీనియర్ అధికారులు పరిశీలించారు. చక్కగా రాణించిన విద్యార్థులను వారు అభినందించారు.



మాక్ అసెంబ్లీలో మాట్లాడుతున్న చంద్రబాబు నాయుడు

సిరామిక్ టైల్స్ పరిశ్రమలో ప్రమాదం

- ఇద్దరు కార్మికుల దుర్మరణం
- పలువురికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి - శ్రీకాళహస్తి (తిరుపతి జిల్లా)

తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి రూరల్ మండలం గోవిందరావు పల్లి వద్ద ఉన్న సుధా సోమెనీ సిరామిక్ టైల్స్ పరిశ్రమలో బుధవారం భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. గ్యాస్ ట్యాంకర్ పేలి పరిశ్రమలో పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. పేలుడు ధాటికి ఇద్దరు కార్మికులు మృత్యువాత పడ్డారు. ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను సమీపంలో ఉన్న వెంకటగిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతి చెందిన వారిలో చీరాలకు చెందిన గుండిపాటి పోతురాజు (29), ఒడిశాకు చెందిన పాండే (25)ఉన్నారు. గ్యాస్ ట్యాంకర్లను పరిశ్రమ పైభాగంలో కాకుండా కింది భాగంలో అమర్చడం వల్లనే భారీ ప్రమాదం చోటు చేసుకుందని అక్కడ పనిచేస్తున్న కార్మికులు అభిప్రాయపడ్డారు. పరిశ్రమలో మొత్తం 450 మంది కార్మికులు పనిచేస్తుండగా పెద్ద ఎత్తున పేలుడు సంభవించింది. దీంతో కార్మికులు బయటకు పరుగులు తీసి ప్రాణాలు దక్కించుకున్నారు. శ్రీకాళహస్తి, వెంకటగిరి ప్రాంతానికి చెందిన అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేసే ప్రయత్నం చేశారు. శ్రీకాళహస్తి రూరల్ పోలీసులు కేసును దర్యాప్తు చేస్తున్నారు.

మృతుల కుటుంబాలకు రూ.కోటి చెల్లించాలి : సిఐటియు

అగ్ని ప్రమాదంలో ఇద్దరు కార్మికులు మరణించడం బాధాకరమని సిఐటియు తిరుపతి జిల్లా ప్రధాన కార్యదర్శి టి.సుబ్రమణ్యం పేర్కొన్నారు. మృతుల కుటుంబాలకు ఒక్కొక్కరికి కోటి రూపాయల చొప్పున నష్టపరిహారం చెల్లించాలని, క్షతగాత్రులకు రూ.25 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కలెక్టర్ జోక్యం చేసుకుని విచారణ చేపట్టి, బాధ్యులపై తగు చర్యలు తీసుకోవాలని కోరారు.




ఆస్పత్రి బ్లాక్‌ను పరిశీలిస్తున్న వి.శ్రీనివాసరావు, తదితరులు

పిడుగురాళ్ల మెడికల్ కాలేజీని పూర్తి చేయండి

- నిర్మాణ పనులను పరిశీలించిన సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

ప్రజాశక్తి-పిడుగురాళ్ల (పల్నాడు జిల్లా)

పల్నాడు జిల్లా పిడుగురాళ్ల మండలం కామేపల్లిలోని మెడికల్ కాలేజీ పిపిపిలో లేదని, అయినా కాలేజీని పూర్తిచేయడం లేదని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల ఈ కాలేజీ ఒక విద్యా సంవత్సరాన్ని కోల్పోయిందని తెలిపారు. వెంటనే కాలేజీని పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. బుధవారం ఈ కాలేజీని శ్రీనివాసరావు పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల ఈ సంవత్సరం రాష్ట్రానికి దక్కాల్సిన వంద మెడికల్ సీట్లు దక్కలేదన్నారు. ఇప్పటికే ప్రారంభమై విద్యార్థులతో కళకళలాడాల్సిన పిడుగురాళ్ల మెడికల్ కాలేజీ ఏడాదిన్నరగా ఎడారిగా మారిపోయిందని ఆవేదన వెలిబుచ్చారు. 800 పడకల సామర్థ్యమున్న ఈ వైద్యశాల నిర్మాణం పూర్తయిందని, సౌకర్యాలు సమకూరుంటే ఇప్పటికే వైద్య సేవలు అందుబాటులోకి వచ్చేవని తెలిపారు. గతంలో 500 మంది కార్మికులు పనిచేస్తే ఇప్పుడు 100 నుంచి 150 మందే పనిచేస్తున్నారని తెలిపారు. మెడికల్ కళాశాల ప్రైవేటీకరణను రాష్ట్ర ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారని వివరించారు. సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయ్‌కుమార్ మాట్లాడుతూ... పల్నాడు ప్రాంత ప్రజల చిరకాల కల ఈ ప్రభుత్వ మెడికల్ కళాశాల అని అన్నారు. పల్నాడు ప్రాంతం వెనకబడిన ప్రాంతమని, మెడికల్ కళాశాల పూర్తయితే వైద్య విద్యతో పాటు మెరుగైన వైద్యం కూడా స్థానికులకు అందుబాటులోకి వస్తుందని తెలిపారు. కాలేజీని పరిశీలించిన వారిలో సిపిఎం సీనియర్ నాయకులు గద్దె చలమయ్య, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎ.లక్ష్మీశ్వర్‌రెడ్డి, నాయకులు జి.ఉమశ్రీ, టి.శ్రీనివాసరావు, బి.వెంకటేశ్వర్లు, ఎస్.వెంకటకృష్ణ, ఎం.నాగేశ్వరరావు, షేక్.బాష ఉన్నారు.



రాజ్యాంగ పీఠిక పఠనం చేస్తున్న కెవిపిఎస్, దళిత, గిరిజన, ప్రజా సంఘాల నేతలు

రాజ్యాంగ పరిరక్షణ కోసం పీఠిక పఠనం

ప్రజాశక్తి - విజయవాడ : భారత రాజ్యాంగాన్ని పరిరక్షించాలని, నాలుగు లేబర్ కోడ్లను వ్యతిరేకిస్తూ బుధవారం విజయవాడలోని అంబేద్కర్ స్మృతి వనం వద్ద రాజ్యాంగ పీఠిక పఠనం చేశారు. కెవిపిఎస్, పలు దళిత, గిరిజన ప్రజా సంఘాల ఆధ్వర్యాన ఈ కార్యక్రమం చేపట్టారు. కెవిపిఎస్ రాష్ట్ర కార్యదర్శి అండ్ర మాల్యాద్రి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు ఎవి.నాగేశ్వరావు... రాజ్యాంగ పీఠికను చదివి, ప్రతిజ్ఞ చేయించారు. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు దడాల సుబ్బారావు, డప్పు కళాకారుల సంఘం రాష్ట్ర కార్యదర్శి గుండెమెడ క్రాంతి కుమార్, ఆలిండియా దళిత, గిరిజన, బలహీన మైనారిటీ సంఘాల అధ్యక్షులు బందెల కిరణ్ రాజ్, జైభీమ్ భారత్ పార్టీ మహిళా నాయకులు గ్రేస్ మేరీ, కెవిపిఎస్ నాయకులు చింతల శ్రీనివాస్, కొసనం వర్ధన్, వరప్రసాద్ మాట్లాడారు. విదేశాల నుండి వ్యవసాయ రంగ ఉత్పత్తులు దిగుమతి చేసుకుంటూ ఆ రంగాన్ని దెబ్బతీస్తున్నారని విమర్శించారు.

దళిత, గిరిజన హక్కులు, రక్షణ కోసం ఉన్న చట్టాలను పరిరక్షించుకునేందుకు, రిజర్వేషన్లు లేకుండా చేసే దుర్మార్గపు చర్యలకు వ్యతిరేకంగా ఐక్య ఉద్యమాలు చేయాలని నేతలు పిలుపునిచ్చారు.

ఐపిఎస్ అధికారి సునీల్‌కుమార్‌కు నోటీసులు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

మాజీ ఎంపి, ప్రస్తుత ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ స్పీకర్ కనుమూరు రఘురామకృష్ణమరాజుపై గతంలో థర్డ్ డిగ్రీ ప్రయోగించిన కేసులో నిందితుడిగా ఉన్న సీనియర్ ఐపిఎస్ అధికారి పి.వి.సునీల్‌కుమార్‌కు సిఐడి అధికారులు బుధవారం నోటీసులు జారీ చేశారు. డిసెంబర్ నాలుగన విచారణకు హాజరుకావాలని నోటీసులో పేర్కొన్నారు. ఈ మేరకు సునీల్‌కుమార్‌కు వ్యక్తిగతంగా సిఐడి అధికారులు నోటీసులు ఇచ్చినట్టు తెలిసింది. 2021లో నర్సాపురం ఎంపిగా ఉన్న రఘురామకృష్ణమ రాజును కస్టోడియల్ టార్చర్ చేశారని గత ఏడాది గుంటూరు నగరంపాలెం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా మాజీ సిఎం జగన్‌తో సహా ఐదుగురు నిందితులపై కేసు నమోదైయింది. వీరిలో సునీల్‌కుమార్‌కు కూడా నిందితుడుగా ఆరోపణలు ఎదుర్కొంటూ సస్పెన్షన్‌కు గురయ్యారు.

5 బిసి సంక్షేమ కార్పొరేషన్లకు ఛైర్మన్ల నియామకం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం 5 బిసి సంక్షేమ కార్పొరేషన్లకు ఛైర్మన్లను నియమిస్తూ నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు బిసి సంక్షేమశాఖ ఎక్స్ అఫిషియో కార్యదర్శి ఎస్ సత్యనారాయణ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఎపి భట్రాజ సంక్షేమ, అభివృద్ధి కార్పొరేష న్‌కు ఛైర్మన్‌గా సరికొండ వెంకటేశ్వరరాజు, పెరిక సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్‌గా వనపర్తి వీరభద్రరరావు, షేక్ సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్‌గా షేక్ ముక్తార్, కుర్నికరికాల భక్తుల వెల్ఫేర్ సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్‌గా కె మునిప్ప, రెడ్డిక సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్‌గా కొండా శంకర్‌రెడ్డిని నియమించినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. వీరు ఈ పదవిలో రెండేళ్లపాటు కొనసాగుతారని స్పష్టం చేశారు.

వైసిపి పాలనలో రైతుల కంట కన్నీరు

- మంత్రి అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

గత ప్రభుత్వ పాలనలో పంటల బీమా సక్రమంగా అమలు చేయకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారని వ్యవసాయశాఖ మంత్రి కె అచ్చెన్నాయుడు తెలిపారు. మాజీ సిఎం జగన్ అబద్ధాలు పక్కనపెట్టి ఆత్మపరిశీలన చేసుకోవాలని బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గత వైసిపి పాలనలో రైతులు కన్నీళ్లు పెట్టుకున్నారని తెలిపారు. రాజకీయ ప్రయోజనాల కోసం అబద్ధాలు ప్రచారం చేయకుండా, నిజాలు అర్థం చేసుకొని మాట్లాడాలని కోరారు. కూటమి ప్రభుత్వం రైతులను కాపాడుకునేందుకు వారికి గిట్టుబాటు ధరలు అందించేందుకు చర్యలు తీసుకుంటుందన్నారు. రైతు సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమన్నారు. పంటల బీమా సమర్థవంతంగా అమలు, పర్యవేక్షణ కోసం వ్యవసాయ, ఆర్థిక, పౌరసరఫరాల శాఖ మంత్రులతో కేబినెట్ సబ్ కమిటీ ఏర్పాటు చేసి, కమిటీ సిఫార్సుల మేరకు ఇ-క్రాప్ ఆధారంగా పంటల బీమాను అమలు చేయడంతోపాటు స్వచ్ఛంద నమోదు విధానాన్ని తిరిగి ప్రవేశపెట్టిందని తెలిపారు. రైతులు ఖరీఫ్‌కు 2 శాతం, రబికి 1.5 శాతం, వాణిజ్య, ఉద్యాన పంటలకు 5 శాతం చెల్లిస్తే మిగతా ప్రీమియాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమానంగా భరిస్తాయన్నారు. మామిడి పంటను వాతావరణ ఆధారిత బీమా పథకంలో చేర్చామన్నారు.

రోడ్డు ప్రమాదాలపై థర్డ్ పార్టీ ఆడిటింగ్

- నిబంధనల మేరకు స్పీడ్ గవర్నర్లు
- రహదారి భద్రతా కౌన్సిల్ సమావేశంలో సిఎం చంద్రబాబు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలో జరిగే ప్రతి రోడ్డు ప్రమాదంపై థర్డ్ పార్టీ ద్వారా ఆడిటింగ్ నిర్వహించాలని అధికారులను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశించారు. రోడ్డు ప్రమాదానికి కారణం వాహనమా?, డ్రైవరా?, లేక రోడ్డు ఇంజినీరింగ్ లోపమా? వివిధ అంశాలను గుర్తించేలా ఈ ఆడిటింగ్ జరగాల్సి ఉందని అన్నారు. సచివాలయంలో సిఎం అధ్యక్షతన రోడ్ సేఫ్టీ కౌన్సిల్ సమావేశం బుధవారం జరిగింది. రాష్ట్ర రహదారి భద్రతా నిధి, రహదారులపై బ్లాక్ స్పాట్లను సరిదిద్దడం, ప్రమాదాలను నివారించేలా క్రాష్ బారియర్లు, డ్రైవర్లకు శిక్షణ కార్యక్రమాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి మూడు నెలలకోసారి రోడ్ సేఫ్టీ కౌన్సిల్ సమావేశాన్ని ఏర్పాటుచేయాలని అధికారులను ఆదేశించారు. ఈ ఏడాదిలో 15,462 రహదారి ప్రమాదాలు జరగ్గా, అందులో 6,433 మంది మృతి చెందడం ఆందోళనకరమన్నారు. ఇందులో మూడో వంతు ప్రమాదాలు ద్విచక్ర వాహనాల వల్ల జరిగినవేనని, 53 శాతం మేర ప్రమాదాలు కార్లు, ద్విచక్ర వాహనాలు, సెల్ఫ్ యాక్సిడెంట్లు ఉన్నాయన్నారు. రహదారి ప్రమాదాల్లో రాష్ట్రం 8వ స్థానంలో ఉండటంపై ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. నెల్లూరు, తిరుపతి, పల్నాడు, అన్నమయ్య, కాకినాడ జిల్లాల్లో రోడ్డు ప్రమాదాల్లో మరణించిన వారి సంఖ్య ఎక్కువ ఉండటంపై కారణాలను ఆరా తీయాలని ఆదేశించారు. వాస్తవానికి ఓవర్ స్పీడ్ కారణంగా 79 శాతం, రాంగ్ సైడ్ డ్రైవింగ్ కారణంగా 3 శాతం, మద్యం, మొబైల్ ఫోన్లు కారణంగా ఒక శాతం రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నట్లు ముఖ్యమంత్రికి అధికారులు వివరించారు. జాతీయ రహదారులపై 42 శాతం ప్రమాదాలు చోటుచేసుకుంటుంటే రాష్ట్ర రహదారులపై 21 శాతం మేర ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు.

అతి వేగాన్ని నియంత్రించేందుకు వీలుగా ట్రాన్స్‌పోర్టు వాహనాల్లో స్పీడ్ గవర్నర్లను నిబంధనల మేరకు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అలాగే రవాణేతర వాహనాలకు వీటిని ఏర్పాటుచేసే అంశంపై ఆలోచన చేయాలన్నారు. వాహనాల వేగాన్ని ఎప్పటికప్పుడు గుర్తించేందుకు జాతీయ రహదారులు, రాష్ట్ర రహదారులపై ఇరువైపులా ప్రతి అర కిలోమీటరు పరిధిని కవర్ చేసేలా సిసి కెమెరాలను ఏర్పాటుచేయాలని జాతీయ రహదారులు, ఆర్‌అండ్‌బి అధికారులకు ఆదేశాలిచ్చారు. వీటిని ఆర్‌టిజిఎస్‌తో అనుసంధానించడంతో పాటు వెహికల్ ట్రాకింగ్ కోసం ఓ ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసుకోవాలని రవాణాశాఖకు సూచనలిచ్చారు.

సుప్రీంకోర్టు మార్గ నిర్దేశాల మేరకు అన్ని చర్యలూ చేపట్టాలని ముఖ్యమంత్రి సూచించారు. డ్రైవర్ల శిక్షణకు ఆధునిక డ్రైవింగ్ శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు. దర్శి, ఆదోని డ్రైవింగ్ శిక్షణ కేంద్రాలను త్వరగా పూర్తి చేయాలన్నారు. జాతీయ రహదారులపై ఉన్న 680 బ్లాక్ స్పాట్‌లను సరిదిద్దాలని ఆయన ఆదేశించారు.

అనధికారికంగా వాహనాల్లో మార్పులు చేస్తే కఠిన చర్యలు

అనధికారికంగా వాహనాల్లో మార్పులు, చేర్పులు చేస్తే కఠినంగా వ్యవహరించాలని అధికారులకు సిఎం చంద్రబాబు ఆదేశించారు. బస్సు బిల్డింగ్ కోడ్ ప్రకారం అనధికార ఆల్ట్రేషన్ ఉండేందుకు వీల్లేదన్నారు. ఈ సమస్యను అధిగమించేందుకు ఉన్న ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించాలన్నారు. అనధికారికంగా మార్చేసిన స్లీపర్ బస్సుల కారణంగా ప్రమాదాల తీవ్రత మరింత పెరుగుతోందని, నాగాలాండ్ వంటి ఈశాన్య రాష్ట్రాలో రిజిస్ట్రేషన్లు చేయించడానికి కారణాలపై అధ్యయనం చేయాలన్నారు. అందుకనుగుణంగా రాష్ట్ర రెవెన్యూ దెబ్బతినకుండా రాష్ట్రంలోనూ మార్పులు చేర్పులపై ఆలోచన చేయాలన్నారు. స్లీపర్ బస్సులు, వివిధ రాష్ట్రాల్లో వాహన పర్మిట్లపై కేంద్రానికి లేఖ రాయాలని ఆయన అధికారులకు సూచించారు. డ్రైవింగ్ నిబంధనలను ఉల్లంఘించిన వారి విషయంలో జరిమానాల కంటే ముందు హెచ్చరికలు జారీ చేయాలన్నారు. ఈ సమావేశంలో రవాణాశాఖ మంత్రి రామ్‌ప్రసాద్‌రెడ్డి, డిజిపి హరీష్‌కుమార్ గుప్తా, సేఫ్టీ అథారిటీ, రవాణాశాఖ, జాతీయ రహదారులు, పురపాలకశాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

సుబ్బరావమ్మ, లక్ష్మయ్యకు మాతృవియోగం

- అనారోగ్యంతో మృతిచెందిన కొమ్మాలపాటి రామనాథం
- పలువురు నాయకుల సంతాపం

ప్రజాశక్తి-నాగులుప్పలపాడు (ప్రకాశం జిల్లా)



అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి కారుసాల సుబ్బరావమ్మ, ప్రజాశక్తి బుక్‌హౌస్ మేనేజర్ కొమ్మాలపాటి లక్ష్మయ్యకు మాతృవియోగం కలిగింది. అనారోగ్యంతో గత మూడు రోజులుగా కోమాలో ఉన్న వారి మాతృమూర్తి కొమ్మాలపాటి రామనాథం (85) బుధవారం పరిస్థితి విషమించి ఆమె స్వగ్రామం ప్రకాశం జిల్లా నాగుల్పులపాడు మండలం ఒమ్మెవరంలో కన్నుమూశారు. రామనాథం భర్త కొమ్మాలపాటి కృష్ణయ్య పదేళ్ల క్రితం చనిపోయారు. వీరికి ఇద్దరు కుమారులు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. రామనాథం అంత్యక్రియలు గురువారం ఉదయం ఎనిమిది గంటలకు ఒమ్మెవరంలో నిర్వహించనున్నట్లు కుటుంబసభ్యులు తెలిపారు. రామనాథం గతంలో కమ్యూనిస్టు ఉద్యమాల్లో చురుకైన పాత్ర పోషించారు. కుమార్తె సుబ్బరావమ్మ, అల్లుడు కారుసాల శ్రీనివాసరావు, ఆమె కుమారుడు లక్ష్మయ్య సిపిఎంలో హోల్‌టైమర్లగా ఉన్నారు. కోడలు అంజన ప్రజాశక్తి ఎడిటోరియల్ బోర్డు సభ్యునిగా పనిచేస్తున్నారు. రామనాథం కోమాలో ఉన్నప్పుడు ఒమ్మెవరం గ్రామానికి పలువురు నాయకులు వచ్చి చూశారు. కుటుంబసభ్యులకు ధైర్యం చెప్పారు. వారిలో సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు, అధ్యక్షులు ఎవి.నాగేశ్వరరావు, కోశాధికారి కెఆర్‌ఆర్ మూర్తి, సిపిఎం సీనియర్ నాయకులు వై.సిద్ధయ్య, పూనాటి ఆంజనేయులు, అంగన్‌వాడీ వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు జి బేబి, ఉపాధ్యక్షులు చంద్రావతి, కె.బేబిరాణి తదితరులు ఉన్నారు. మాజీ ఎమ్మెల్సీ లక్ష్మణరావు, ప్రజాశక్తి ఎడిటర్ బి.తులసీదాస్, చీఫ్ జనరల్ మేనేజర్ వై.అచ్యుతరావు సంతాపం తెలిపారు. రామనాథం భౌతికకాయాన్ని సందర్శించిన వారిలో ప్రజానాట్యమండలి రాష్ట్ర కార్యదర్శి అనిల్, సిపిఎం నాయకులు గంగయ్య, కొండారెడ్డి, కల్పన తదితరులు ఉన్నారు. కుటుంబసభ్యులకు సానుభూతి తెలిపారు.

కృష్ణా నదీ జలాలపై హక్కును వదులుకోం

- వాటాల కేటాయింపుపై పున:సమీక్షకు ఒప్పుకునేది లేదు
- జలవనరుల శాఖ అధికారులకు సిఎం దిశా నిర్దేశం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

కృష్ణా నదీ జలాలపై రాష్ట్రానికి ఉన్న హక్కులను ఎట్టి పరిస్థితుల్లోనూ వదులుకునే ప్రసక్తే లేదని సిఎం చంద్రబాబు స్పష్టం చేశారు. ఈ విషయంపై బలమైన వాదనలు వినిపించాలని అధికారులకు ఆయన దిశా నిర్దేశం చేశారు. రాష్ట్రానికి చేసిన నీటి కేటాయింపుల్లో ఎలాంటి మార్పులు చేసేందుకూ వీలు లేదని, చట్టపరంగా రాష్ట్రానికి దక్కిన వాటాను యథాతథంగా కొనసాగించాల్సిందేనని తేల్చి చెప్పారు. సచివాలయంలో బుధవారం జలవనరులశాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు, కృష్ణా జలాల్లో మొత్తం 811 టిఎంసిల వాటా కలిగి ఉండగా, రాష్ట్ర విభజన అనంతరం కృష్ణా నదీ జల వివాదాల ట్రిబ్యునల్-1 ఆంధ్రప్రదేశ్‌కు 512 టిఎంసిలు, తెలంగాణకు 299 టిఎంసిల చొప్పున జలాలు కేటాయించిందన్నారు. కృష్ణా జలాల కేటాయింపులను పున:సమీక్షించాలనడం సరికాదని సిఎం పేర్కొన్నారు. ప్రతియేటా వేలాది టిఎంసిల జలాలు సముద్రంలో కలుస్తున్నందున వరద జలాల వినియోగంలో పొరుగు రాష్ట్రాలతో సామరస్య పూర్వకంగా వ్యవహరించాలని అధికారులకు ఆయన సూచించారు. రాష్ట్రాన్ని కరువు రహితం చేసేలా అన్ని జిల్లాలకూ నీటి భద్రత కలిగించేలా సమర్థనీటి నిర్వహణ చర్యలు చేపట్టాలని అధికారులను ఆయన ఆదేశించారు. రాష్ట్రంలో ప్రస్తుతం రిజర్వాయర్లలో నెలకొన్న నీటి నిల్వల వివరాల గురించి అధికారులను అడిగి సిఎం తెలుసుకున్నారు. అలాగే పోలవరం ప్రాజెక్టు పురోగతిపై సమీక్షించారు. డయాఫ్రమ్ వాల్ పనులు 73 శాతం మేర పూర్తికాగా, వచ్చే ఏడాది ఫిబ్రవరి కల్లా నిర్మాణం పూర్తి చేస్తామని అధికారులు తెలిపారు. పోలవరం ఎడమ కాలువ త్వరితగతిన పూర్తి చేయడానికి అవసరమైన భూసేకరణ తక్షణం చేపట్టాలని, ఆర్‌ఆర్ ప్యాకేజీని నిర్వాసితులకు వేగంగా అందించాలని సిఎం చంద్రబాబు సూచించారు.

రామ్‌లాల్‌తో లోకేష్ భేటీ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్‌ఎస్‌ఎస్) అఖిల భారతీయ సంపర్క్ ప్రముఖ్ రామ్‌లాల్‌జీతో ఐటి శాఖ మంత్రి నారా లోకేష్ బుధవారం మర్యాదపూర్వకంగా ఉండవల్లిలో భేటీ అయ్యారు. ఆర్‌ఎస్‌ఎస్ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా దేశ వ్యాప్తంగా వివిధ రంగాల ప్రముఖులతో ఆయన భేటీ అవుతున్నారు. ఈ సందర్భంగా బాలల రాజ్యాంగ పుస్తకాన్ని ఆయనకు లోకేష్ బహూకరించారు.

ఆడుకుందామంటే ఆటస్థలాల్లేవు అధ్యక్షా !

మొదటిపేజీ తరువాయి

అటువంటి సంఘటనల్లో మచ్చుకు ఒకటి! దీనిని విద్యార్థులు చేస్తున్నప్పుడు చంద్రబాబు,లోకేష్‌లు ఒకరినొకరు చూసి నవ్వుకోవడం కనిపించింది. అదే విధంగా చట్టసభల్లో చోటుచేసుకున్న సంఘటనలపై సున్నితమైన విమర్శలు కనిపించాయి. ప్రతిపక్షనేత మాట్లాడటానికి లేచి నిలబడగానే మైక్ కట్‌కావడం దీనికో నిదర్శనం! ఒక్కసారిగా మాటలు వినిపించకపోవడంతో కార్యక్రమానికి హాజరైన వారు 'ఏం జరిగిందో' అని ఆందోళన పడ్డారు. అయితే, కార్యక్రమంలో భాగంగానే మైక్ కట్ చేశారని తెలియడంతో నవ్వుకున్నారు. సభల్లో చోటుచేసుకుంటున్న కొన్ని ఘాటైన విమర్శలను, కొందరు సభ్యుల వ్యవహార శైలిని విద్యార్థులు ప్రదర్శించారు. సోషల్ మీడియా నియంత్రణకు బిల్లును ఆమోదించారు. మొత్తం మీద మాక్ అసెంబ్లీ ఆద్యంతం అలరించింది. సామాన్యుడిని కూడా ఆలోచింపచేసే విధంగా విద్యార్థులు చక్కగా వారి వారి పాత్రల్లో అలరించారు. అధికార పక్షం నుంచి సమాధానాలు రాబట్టడం, ప్రభుత్వంలోని లోపాలను సునిశితంగా ప్రస్తావిస్తూ, సమస్యలకు పరిష్కారమార్గాలను చూపించిన వైనం రాజకీయాల్లో తలలు పండిన వారిని సైతం కట్టిపడివేసింది. అంతే కాకుండా బిల్లులు ఎలా పాస్ చేస్తారు? పాస్ చేసిన బిల్లులు ఎలా ఆమోదం పొందుతాయి? ప్రతిపక్షం ఎలా వ్యవహరిస్తుంది? అధికార పక్షం ఆ సమయంలో ఎలా వ్యవహరించాలి? అనే అంశాలను కూడా చూపించారు. ఈ కార్యక్రమంలో పాల్గొనడానికి 175 నియోజవర్గాల నుంచి 175మంది విద్యార్థులను ఎంపిక చేశారు. మాక్ అసెంబ్లీలో ముఖ్యమంత్రిగా ఎం.లీలా గౌతమ్, ప్రతిపక్షనేతగా సౌమ్య, డిప్యూటీ సిఎంగా కోడి యోగి, విద్యాశాఖ మంత్రిగా చిన్మయి, స్పీకర్‌గా స్వాతి వ్యవహించారు. ఆంధ్రప్రదేశ్ విద్యార్ది పరిరక్షణ చట్టం -2025 బిల్లుపై ప్రతిపక్షం అభ్యంతరం వ్యక్తం చేసింది. సమయంలో ప్రతిపక్షసభ్యులు స్పీకర్ వెల్‌లోకి ప్రవేశించడంతో మార్షల్స్ రంగ ప్రవేశం చేసి ప్రతిపక్ష సభ్యులను సభ బయటకు తీసుకెళ్లడం అచ్చం నిజమైన శాసనసభను మరిపించింది.

కుడి, ఎడమలు ఉండవు...!

మాక్ అసెంబ్లీ ప్రారంభం కాగానే ప్రొటెం స్పీకర్ ఎన్నిక జరిగింది. అనంతరం సభలోకి ప్రొటెం స్పీకర్ రాగానే సభ్యులందరూ లేచి నిలబడ్డారు.జాతీయ గీతంతో సభను ప్రారంభించిన విద్యార్థులు స్పీకర్ పదవికి నామినేషన్లను ఆహ్వానించారు. కోడూరు ఎమ్మెల్యే కె.లోకేశ్వరరెడ్డి, కుమారి స్వాతిని స్పీకర్‌గా ప్రతిపాదించగా, ఎమ్మెల్యే బి.అనిల్‌కుమార్ ప్రతిపాదనను బలపరిచారు. స్వాతి స్పీకర్‌గా ఎన్నికైనట్లు ప్రొటెం స్పీకర్ ప్రకటించారు. అనంతరం ముఖ్యమంత్రి, ప్రతిపక్షనేత స్పీకర్‌ను చాంబర్‌పైకి తీసుకెళ్లారు. అనంతరం సిఎం మాట్లాడుతూ అధికార,ప్రతిపక్షానికి స్పీకర్ త్రాసులాంటి వారని, సభను సజావుగా నడపడంలో తమనుంచి పూర్తి సహకారం ఉంటుందని తెలిపారు. ప్రతిపక్షనేత మాట్లాడుతూప్రభుత్వానికి మెజారిటీ ఉందని మా గొంతునొక్కాలని చూస్తే మీరే ప్రతిపక్ష గొంతుకను కాపాడతారని ఆశిస్తున్నానని పేర్కొన్నారు. అనంతరం స్పీకర్‌గా ఎన్నికైన స్వాతి మాట్లాడుతూ ఈ కుర్చీకి కుడి, ఎడమలు ఉండవని, రాజ్యాంగం, సభా నియమాలు మాత్రమే ఉంటాయని, ప్రతిపక్షానికి తగిన సమయం ఇస్తామని సభా గౌరవాన్ని కాపాడటం అందరి బాధ్యత అని స్పష్టం చేశారు. అనంతరం శాసనసభలో ప్రశ్నోత్తరాల కార్యక్రమాన్ని ప్రారంభించారు. మాక్ అసెంబ్లీ ముగిసిన అనంతరం పిల్లల కోసం రూపొందించిన భారత రాజ్యాంగం పుస్తకాన్ని సిఎం చంద్రబాబునాయుడు ఆవిష్కరించారు. అనంతరం ప్రతిజ్ఞ నిర్వహించారు. స్పీకర్, సిఎం మంత్రులు, ఎమ్మెల్యేలు అధికారులు గ్రూప్ ఫోట్ సెషన్స్‌లో పాల్గొన్నారు. అనంతరం శాసనమండలిహాల్‌ను విద్యార్థులకు విద్యాశాఖ మంత్రి లోకేష్ చూపించడంతో పాటు వారితో కలిసి మధ్యాహ్నం భోజనం చేశారు. ఈ సందర్భంగా స్పీకర్ అయ్యన్నపాత్రుడు, సిఎం చంద్రబాబునాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, సిఎస్ విజయానంద్ రాజ్యాంగ పరికరక్షణపై ప్రసంగించారు.

మూడు రోజులు టోకెన్లతోనే దర్శనం

- విఐపి బ్రేక్ దర్శనాలు రద్దు
- వైకుంఠ ఏకాదశి ఏర్పాట్లపై బిఆర్‌నాయుడు సమీక్ష

ప్రజాశక్తి - తిరుమల

పది రోజుల వైకుంఠ ద్వార దర్శనాలలో మూడు రోజులు మినహా, ఏడు రోజులు టోకెన్లు లేకుండా దర్శనాలకు రావచ్చని టిటిడి ఛైర్మన్ బిఆర్ నాయుడు వెల్లడించారు. వైకుంఠ ద్వార దర్శనాల ఏర్పాట్లపై తిరుమలలోని ఛైర్మన్ క్యాంపు కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. ఏడు రోజులు సామాన్య భక్తుల కోసం అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. డిసెంబర్ 30 నుంచి జనవరి 8వ తేదీ వరకు వైకుంఠ ద్వార దర్శనం జరగనుంది. 182 గంటల్లో 164 గంటలు సామాన్య భక్తులకు దర్శనం చేయిస్తాం అన్నారురు. జనవరి 2 తేదీన నుంచి 8వ తేదీ వరకు ప్రత్యేక ప్రవేశ దర్శనం రోజుకు 15 వేలు చొప్పున జారీ చేస్తామన్నారు. రోజుకు 1000 టికెట్ల శ్రీవాణి ట్రస్టు దర్శన టికెట్లు జారీ చేస్తామన్నారు. డిసెంబర్ 5న ఉదయం పది గంటలకు శ్రీవాణి దర్శన కోటా, అదేరోజు మధ్యాహ్నం మూడు గంటలకు 300 దర్శన కోటా విడుదల చేస్తామన్నారు. పది రోజులు ప్రత్యేకదర్శనాలు, విఐపి బ్రేక్ దర్శనాలు, చంటిపిల్లల దర్శనాలనున రద్దు చేసినట్లు చెప్పారు.

నవంబరు 27వ తేదీ నుంచి డిసెంబరు 1వ తేదీ వరకు మొదటి మూడు రోజులకు దర్శన టోకెన్లు బుకింగ్ చేసుకునే వెసులుబాటు ఉందన్నారు. తిరుపతి, తిరుమల, రేణిగుంట,చంద్రగిరి స్థానికులకు రోజుకు ఐదు వేల టోకెన్లు జారీ చేయనున్నట్లు తెలిపారు. డిసెంబర్ 10 వ తేదీ స్థానికుల దర్శన కోటా విడుదల చేస్తామన్నారు. సామాన్య భక్తులకు ఎక్కడా, ఎలాంటి ఇబ్బంది కలగకుండా పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. టిటిడి సూచనలు పాటించి, ప్రశాంతంగా వైకుంఠ ద్వార దర్శనం చేసుకోవాలని యాత్రికులకు విజ్ఞప్తి చేశారు.



విశాఖలో నిరసన ప్రదర్శనలో పాల్గొన్న అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులు, కార్మికులు



కర్నూలు రైల్వే స్టేషన్ ఎదుట ఆందోళన చేస్తున్న కార్మిక సంఘాల నాయకులు

కార్పొరేట్ల కోసమే లేబర్ కోడ్‌లు

- కార్మికుల హక్కులు కాలరాస్తున్న కేంద్రం
- లేబర్ కోడ్స్‌కు వ్యతిరేకంగా రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు, ప్రతుల దహనం

ప్రజాశక్తి- యంత్రాంగం

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కార్పొరేట్లకు లబ్ధి చేకూర్చేందుకు అత్యంత దుర్మార్గంగా కార్మిక చట్టాలను రద్దు చేసి లేబర్‌కోడ్లను తీసుకొస్తోందని సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యులు బివి.రాఘవులు అన్నారు. లేబర్ కోడ్స్‌ను వ్యతిరేకిస్తూ బుధవారం రాష్ట్రవ్యాప్తంగా కార్మిక, రైతు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఆందోళనలు, నిరసనలు జరిగాయి. కేంద్రం తీసుకొస్తున్న లేబర్‌కోడ్స్ వల్ల ఆధునిక బానిసత్వం రానుందని, వెంటనే వెనక్కి తీసుకోవాలని కార్మిక సంఘాలు డిమాండ్ చేశాయి. లేబర్ కోడ్స్ నోటిఫికేషన్ పత్రాలను దహనం చేశాయి.

శ్రీ సత్యసాయి జిల్లా కదిరిలో బివి. రాఘవులతో పాటు సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.రాంభూపాల్ హాజరయ్యారు. కదిరి ఆర్‌అండ్‌బి అతిథి గృహం నుంచి కాలేజీ సర్కిల్ మీదుగా అంబేద్కర్ సర్కిల్ వరకు నిరసన ప్రదర్శన నిర్వహించారు. రాజ్యాంగ దినోత్సవం పురస్కరించుకుని అంబేద్కర్ విగ్రహానికి పూల మాలలు వేశారు. అనంతరం సభనుద్దేశించి రాఘవులు మాట్లాడుతూ... నాలుగు లేబర్‌కోడ్లు అమల్లోకి వస్తే కార్మికుల జీతభత్యాలు, ఉద్యోగ భద్రత, రక్షణ, ఆరోగ్యం వంటి వాటిపై తీవ్ర ప్రభావం చూపుతాయని వివరించారు. పోరాడి సాధించుకున్న కార్మికుల హక్కులను కేంద్ర ప్రభుత్వం కాలరాస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్మికుల శ్రమను కార్పొరేట్లకు దోచి పెట్టేలా కేంద్రం నిర్ణయాలు చేస్తోందన్నారు. లేబర్‌కోడ్లను కార్మికులందరూ ముక్తకంఠంతో ఎదిరించి అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.రాంభూపాల్ మాట్లాడుతూ... కార్మిక వ్యతిరేక నిర్ణయాలను కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్నా రాష్ట్ర ప్రభుత్వం ప్రశ్నించకపోవడం సిగ్గుచేటన్నారు. కార్మికులకు అన్యాయం చేసేలా లేబర్‌కోడ్లను తీసుకుని వస్తే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు.

నెల్లూరులో గాంధీ బొమ్మ నుంచి విఆర్‌సి సెంటర్ మీదుగా కలెక్టరేట్ వరకు నిరసన నిర్వహించారు. సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.అజయ్‌కుమార్ మాట్లాడుతూ... సంస్కరణల పేరుతో 29 చట్టాలన్నింటినీ నాలుగు లేబర్ కోడ్స్‌గా మార్పు చేసి కార్పొరేట్ శక్తులకు, పెట్టుబడిదారులకు లాభం చేకూరేందుకు అనువుగా కేంద్రం నిర్ణయం తీసుకుందని విమర్శించారు. తిరుపతి కలెక్టరేట్ వద్ద సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు కందారపు మురళి మాట్లాడుతూ... మహిళా కార్మికులకు ఏ మాత్రం శ్రేయస్కరం కాని ఈ లేబర్‌కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం డిప్యూటీ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. చిత్తూరులో గాంధీ విగ్రహం వద్ద ధర్నా చేశారు.

విశాఖ ఆర్‌టిసి కాంప్లెక్స్ వద్దనున్న లలిత జ్యూయలర్స్ నుంచి ఆశీలు మెట్ట మీదుగా జివిఎంసి గాంధీ విగ్రహం వరకూ భారీ కార్మిక ప్రదర్శన నిర్వహించారు. అనంతరం అక్కడి మెయిన్ రోడ్డులో మానవహారంగా ఏర్పడ్డారు. ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షులు రావులపల్లి రవీంద్రనాథ్, ఐఎఫ్‌టియు రాష్ట్ర కార్యదర్శి ఎం.వెంకటేశ్వర్లు, సిఎఫ్‌టియుఐ జాతీయ అధ్యక్షులు ఎన్.కనకారావు, ఎపిఎఫ్‌టియు నాయకురాలు మహిత తదితరులు ప్రసంగించారు. అఖిలపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యంలో పోర్టు చైర్మన్ కార్యాలయం వద్ద, హెచ్‌పిసిఎల్ లేబర్ గేటు, భెల్ మెయిన్ గేటు వద్ద నిరసనలు చేపట్టారు. ఇన్స్యూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యాన గాజువాకలో ఎల్‌ఐసి ఉద్యోగులు, ఉక్కు అఖిలపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యాన స్టీల్‌ప్లాంట్ అడ్మిన్ బిల్డింగ్ వద్ద ఉక్కు కార్మికులు ఆందోళనలు నిర్వహించారు. అనకాపల్లి ఆర్‌డిఒ కార్యాలయం వద్ద ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. అల్లూరి జిల్లా రంపచోడవరంలో నిరసన ర్యాలీ, మానవహారం నిర్వహించారు. అరకులోయలోని తహశీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు.

ఒంగోలులో బైక్ ర్యాలీ, నిరసన ప్రదర్శన నిర్వహించారు. కడప, అన్నమయ్య జిల్లాల్లో లేబర్ కోడ్స్ నోటిఫికేషన్ పత్రాలను దహనం చేశారు. కర్నూలులో ఐదు రోడ్ల కూడలి నుంచి రైల్వే స్టేషన్ వరకూ ర్యాలీ నిర్వహించారు. నంద్యాలలో కోవెలకుంట్ల జంక్షన్ నుంచి ర్యాలీ చేపట్టి కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపి డిఆర్‌ఓకు వినతిపత్రం అందజేశారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో శ్యామలా సెంటర్ నుంచి కోటిపల్లి బస్టాండ్ వరకూ నిరసన ప్రదర్శన నిర్వహించారు. కాకినాడ హెడ్ పోస్టాఫీసు వద్ద ధర్నా చేశారు. డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలో కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపారు. విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టరేట్‌ల వద్ద పెద్దఎత్తున ధర్నా చేశారు. శ్రీకాకుళం కలెక్టరేట్ ఎదుట లేబర్ కోడ్స్ నోటిఫికేషన్ ప్రతులను దగ్ధం చేశారు. పైడిభీమవరం పారిశ్రామిక ప్రాంతంలో కార్మికులు నిరసన తెలిపారు. ఏలూరులో కలెక్టరేట్ ఎదుట, పశ్చిమగోదావరి జిల్లా భీమవరం అంబేద్కర్ చౌక్ సెంటర్‌లో నిరసన తెలిపారు. గుంటూరు, పల్నాడు జిల్లాల కలెక్టరేట్ల వద్ద ఆందోళనకు దిగారు.

పత్తి, అరటి, మొక్కజొన్న రైతులను ఆదుకోవాలి : సిపిఎం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పత్తి, అరటి, మొక్కజొన్న పంటలకు గిట్టుబాటు ధర కల్పించి రైతులను ఆదుకోవాలని సిపిఎం రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు కె లోకనాథం అధ్యక్షతన రాష్ట్ర కమిటీ సమావేశం బుధవారం విజయవాడలో నిర్వహించారు. ఈ సమావేశంలో పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు, రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు పాల్గొన్నారు. కౌలు రైతులకు గుర్తింపు కార్డులు లేకపోయినా ఇ-క్రాప్‌కు అదనపు ఆప్షన్ కల్పించి సాగుదారుల పేరుతో పంటలను కొనుగోలు చేయాలని, వారి ఖాతాల్లోనే నగదు జమ చేయాలని రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. రాష్ట్రంలో 13 లక్షల ఎకరాల్లో పత్తి సాగైందని, ఇందులో ఒక్క కర్నూలు జిల్లాలోనే సుమారు 6 లక్షల ఎకరాలు సాగైందని తెలిపింది. పత్తి కొనుగోలు విషయంలో కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సిసిఐ) కొనుగోలు కేంద్రాలు ప్రారంభించడంలోనే అలసత్వం వహించిందని వెల్లడించింది. సెప్టెంబరు మొదటి వారంలో ప్రారంభించాల్సిన పత్తి కొనుగోలు కేంద్రాలు అక్టోబరు చివరిలో ప్రారంభించారని తెలిపింది. కొనుగోలు కేంద్రాలకు తెచ్చిన పత్తిని తేమ శాతం పేరుతో కొనుగోలు చేయకుండా తిరస్కరిస్తున్నారని, దీంతో రైతులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారని పేర్కొంది. కపాస్ యాప్‌ను రద్దు చేసి, ఇ-క్రాప్ ఆధారంగా, నిబంధనలు సడలించి ప్రభుత్వం ప్రకటించిన క్వింటాలుకు రూ.8,110 చెల్లించి సిసిఐ పత్తిని కొనుగోలు చేయాలని, కొనుగోలు కేంద్రాల్లో తూకాల్లో జరుగుతున్న మోసాలను అరికట్టాలని కోరింది. అరటి పంటకు గతేడాది నవంబరు నెలలో టన్నుకు రూ.22 వేల వరకూ ధర లభించిందని తెలిపింది. ఈ ఏడాది టన్ను కేవలం రూ.2 వేల నుంచి రూ.3 వేలు మాత్రమే ధర పలుకుతుందని వెల్లడించింది. అనంతపురం, నంద్యాల, కడప జిల్లాల్లో అరటి సాగు చేసిన రైతులు రూ.వేల కోట్లు పెట్టుబడులు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేసింది. గిట్టుబాటు ధరలు లేకపోవడంతో చాలా ప్రాంతాల్లో అరటి తోటలను రైతులు ట్రాక్టర్లతో దున్నేస్తున్నారని తెలిపింది. తక్షణమే ప్రభుత్వం జోక్యం చేసుకుని మార్కెట్ సౌకర్యం కల్పించాలని, టన్నుకు కనీసం రూ.15 వేలు ధర ఇచ్చి మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేసి అరటి రైతులను ఆదుకోవాలని కోరింది. గతేడాది మిర్చి, పొగాకు తదితర పంటలకు సరైన గిట్టుబాటు ధర లేకపోవడంతో ఈ ఏడాది మొక్కజొన్న విస్తీర్ణం పెరిగిందని తెలిపింది. నంద్యాల, కర్నూలు, అనంతపురం, సత్యసాయి, వైఎస్ఆర్ కడప, విజయనగరం జిల్లాల్లో మొక్కజొన్న పండించిన రైతులు ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర అమలుకాక ప్రైవేటు వ్యాపారుల దోపిడీకి గురవుతున్నారని పేర్కొంది. తక్షణమే ప్రభుత్వం మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని కోరింది. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర క్వింటాలుకు రూ.2,400 చెల్లించి కొనుగోలు చేసి మొక్కజొన్న రైతులను ఆదుకోవాలని సిపిఎం రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు తెరవకపోవడంతో ఇప్పటికే మధ్య దళారులు రైతుల వద్ద సగానికిపైగా పంటను కొనుగోలు చేశారని తెలిపింది. దళారులు మళ్లీ మద్దతు ధరకు కొనుగోలు కేంద్రాల్లో అమ్మే అవకాశం ఉందని పేర్కొంది. దీనిని నివారించి రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేసింది.

అప్పుల బాధతో కౌలు రైతు ఆత్మహత్య

ప్రజాశక్తి - ఉరవకొండ (అనంతపురం జిల్లా)


నారాయణస్వామి (ఫైల్)

వ్యవసాయంలో సరైన దిగుబడి రాక అప్పుల ఊబిలో కూరుకుపోయి కౌలు రైతు ఆత్మహత్య చేసుకున్న సంఘటన అనంతపురం జిల్లా ఉరవకొండ మండలం పెద్దముస్టురులో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పెద్దముష్టూరు గ్రామానికి చెందిన తలారి నారాయణ స్వామి(45) పది ఎకరాలు కౌలుకు తీసుకుని జీవనం సాగిస్తున్నారు. పంటల సాగు నిమిత్తం రూ.పది లక్షల వరకు అప్పులు చేశారు. పంటలు చేతికందకపోవడంతో చేసిన అప్పులు తీర్చడం కష్టమైంది. దీంతో తీవ్ర మనస్తాపానికి గురై బుధవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. మృతునికి భార్య వన్నమ్మ, కుమార్తె, కుమారుడు ఉన్నారు.

కొబ్బరి రైతుల సమస్యలు పరిష్కరిస్తా...

- సంక్రాంతి తర్వాత యాక్షన్ ప్లాన్
- డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్

ప్రజాశక్తి - రాజోలు (డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా)



కొబ్బరి రైతుల సమావేశంలో మాట్లాడుతున్న డిసిఎం పవన్ కళ్యాణ్

కొబ్బరి రైతుల సమస్యలను పరిష్కరిస్తామని, సంక్రాంతి తరువాత నుంచి యాక్షన్‌ప్లాన్‌ను అమలు చేస్తామని డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ అన్నారు. డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రాజోలు మండలంలో ఆయన బుధవారం పర్యటించారు. కేశవదాసుపాలెం వద్ద శంకరగుప్తం, కేశనపల్లి డ్రెయిన్ నుంచి సముద్రపు నీరు పోటెత్తడం వల్ల పాడైన కొబ్బరి మొక్కలను ఆయన పరిశీలించారు. మోడుబారిన కొబ్బరి చెట్ల వివరాలు అధికారులను అడిగి తెలుసుకున్నారు. శంకరగుప్తం డ్రెయిన్ సమస్యపై కలెక్టర్, ఇరిగేషన్, ఉద్యాన శాఖ అధికారులను ఆరా తీశారు. కొబ్బరి తోటలకు తిరిగి పునరుజ్జీవం పోసే అంశంపై శాస్త్రవేత్తలతో చర్చించారు. అనంతరం పంటలు నష్టపోయిన 13 గ్రామాల ప్రజలతో ముఖాముఖీ సమావేశం నిర్వహించారు. రైతుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పవన్‌కల్యాణ్ మాట్లాడుతూ తాను గతంలో పర్యటించినప్పుడు శంకరగుప్తం డ్రెయిన్ సమస్య ఇంత తీవ్రంగా లేదని తెలిపారు. ఈ డ్రెయిన్ మరమ్మతులు చేపట్టేందుకు రూ.20.62 కోట్లు అవసరం ఉందన్నారు. ఈ డ్రెయిన్ ఆక్రమణలకు గురికావడం, కొన్ని చోట్ల అక్రమంగా గట్లు వేయడం వల్ల సముద్రం పోటెత్తినప్పుడు నీరు పంట పొలాల్లోకి చొచ్చు వస్తున్నట్టు గుర్తించామని తెలిపారు. కోనసీమ ప్రాంతంలో డ్రెయిన్లపై నీటిపారుదల శాఖ నిపుణులు బిసి రోశయ్య ఇచ్చిన రిపోర్టును పరిశీలించి దాన్ని అమలు చేయడానికి ప్రణాళికలు రూపొందిస్తామన్నారు. రెండు వారాల్లో ఈ రిపోర్టుపై నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. డిసెంబర్ 2వ వారంలో ఈ సమస్యపై అధికారులు, రైతులతో మరో సమావేశం నిర్వహిస్తామన్నారు. కోనసీమలో కోకోనట్ బోర్డు ఏర్పాటు అంశాన్ని కేంద్రం దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. అనంతరం ప్రతి ఒక్కరికీ రాజ్యాంగ ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అమలాపురం ఎంపి జి హరీష్‌మాథూర్, రాజోలు ఎమ్మెల్యే దేవవరప్రసాద్, ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖరం, డిసిసిబి చైర్మన్ తుమ్మల రామస్వామి, కలెక్టర్ డాక్టర్ మహేష్ కుమార్, ఎస్‌పి రాహుల్ మీనా తదితరులు పాల్గొన్నారు.

గోవా అంతర్జాతీయ చలన చిత్రోత్సవంలో ప్రత్యేక ఆకర్షణగా రాష్ట్ర శకటం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

గోవా అంతర్జాతీయ చలన చిత్రోత్సవం-2025ను నవంబరు 20 నుంచి 28 వరకు నిర్వహిస్తున్నారని, ఇందులో రాష్ట్రం తరపున ప్రదర్శించిన శకటం ప్రత్యేక ఆకర్షణగా నిలిచిందని రాష్ట్ర చలన చిత్ర టివి, నాటకరంగ అభివృద్ధి సంస్థ ఎమ్‌డి కెఎస్ విశ్వనాథన్ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.

అమాంతం పెరిగిన అమెరికా బడ్జెట్ లోటు

- అక్టోబర్‌లో 284 బిలియన్ డాలర్ల లోటు
- ప్రభుత్వ షెట్‌డౌన్ ప్రభావం



వాషింగ్టన్ : అమెరికా ఆర్థిక వ్యవస్థ తీవ్ర ఒత్తిడికి గురి అవుతోంది. ఈ ఏడాది అక్టోబర్‌లో యుఎస్ ప్రభుత్వ బడ్జెట్ లోటు 284 బిలియన్ డాలర్లకు (దాదాపు రూ.23 లక్షల కోట్లు) చేరినట్లు ఆ దేశ ఆర్థిక శాఖ మంగళవారం తెలిపింది. ఇటీవల జరిగిన ఫెడరల్ ప్రభుత్వ షట్‌డౌన్ కారణంగా ఈ నివేదిక విడుదల ఆలస్యమయ్యిందని పేర్కొంది.

నవంబర్ నెలలో చెల్లించవలసిన కొన్ని చెల్లింపులు అక్టోబర్ గణాంకాలకు మారడం, రికార్డు స్థాయి కస్టమ్స్ డ్యూటీ రాబడిలో తగ్గుదల వంటి అంశాలు లోటును పెంచాయి. యుఎస్‌లో 43 రోజుల పాటు అనేక ఫెడరల్ ఏజెన్సీలు మూతపడటం వలన ఈ ఆర్థిక సంవత్సరం 2026 మొదటి నెల బడ్జెట్ ఫలితాలు ఆలస్యమయ్యాయని ఆర్థిక శాఖ అధికారి ఒకరు తెలిపారు. షట్‌డౌన్ సమయంలో ప్రభుత్వ ఉద్యోగుల జీతాలు వంటి కొన్ని చెల్లింపులు కూడా ఆలస్యమయ్యాయని పేర్కొన్నారు.

గతేడాది 2024 అక్టోబర్‌లోని 257 బిలియన్ డాలర్ల లోటుతో పోలిస్తే ప్రస్తుత లోటు 27 బిలియన్ డాలర్లు లేదా 10 శాతం అధికంగా పెరిగింది. నవంబర్ నెల సైనిక, ఆరోగ్య సంరక్షణ కార్యక్రమాల ప్రయోజనాలకు సంబంధించిన సుమారు 105 బిలియన్ డాలర్ల చెల్లింపులు అక్టోబర్‌కు బదలాయించడం దీనికి ప్రధాన కారణమని ఆర్థిక శాఖ వర్గాలు తెలిపాయి. అక్టోబర్‌లో అమెరికా ట్రెజరీ వడ్డీ ఖర్చులు 104 బిలియన్ డాలర్లకు పెరిగాయి. ఇది గతేడాది కంటే 27 శాతం ఎక్కువ కావడం గమనార్హం. అధిక రుణ భారం, వడ్డీ రేట్ల పెరుగుదల దీనికి ప్రధాన కారణమని ఆర్థిక శాఖ వర్గాలు తెలిపాయి.

టిటిడికి రూ.9 కోట్లు విరాళం

ప్రజాశక్తి - తిరుమల


దాతలను అభినందిస్తున్న టిటిడి చైర్మన్ బిఆర్ నాయుడు


తిరుమలలోని యాత్రికుల వసతి సముదాయాల ఆధునీకరణకు టిటిడికి అమెరికాకు చెందిన ప్రవాస భారతీయుడు మంతెన రామలింగరాజు బుధవారం రూ.9 కోట్లు విరాళంగా అందించారు. ఈ సందర్భంగా టిటిడి చైర్మన్ తిరుమలలోని పద్మావతి అతిథి గృహంలో మీడియా సమావేశం నిర్వహించి దాతను అభినందించారు. తన కుమార్తె మంతెన నేత్ర, అల్లుడు వంశీ గాదిరాజుల పేరు మీదుగా రామరాజు ఈ విరాళం అందించారని, 2012 లోనూ రూ.16.06 కోట్లు విరాళంగా ఇచ్చారని చెప్పారు. తిరుమలలో యాత్రికుల మౌలిక సదుపాయాల కల్పనలో తన వంతు సహకారం అందించేందుకు ముందుకు వచ్చిన ఆయనకు చైర్మన్ అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో విజయ నగరం ఎంపి కలిశెట్టి అప్పల నాయుడు, టిటిడి అదనపు ఇఒ సిహెచ్ వెంకయ్య చౌదరి పాల్గొన్నారు.

పసిడి తనఖా అప్పుల్లో భారీ పెరుగుదల : సిఆర్ఐఎఫ్


న్యూఢిల్లీ : భారత్‌లో రిటైల్ రుణాల వృద్ధి కంటే బంగారం తనఖా అప్పుల్లో ఎక్కువ పెరుగుదల చోటు చేసుకుంటుందని సిఆర్ఐఎఫ్ తన 'హౌ ఇండియా లెండ్స్' రిపోర్ట్‌లో పేర్కొంది. ఆర్థిక సంవత్సరం 2025-26 సెప్టెంబర్‌తో ముగిసిన ద్వితీయ త్రైమాసికంలో బంగారం రుణాల జారీలో ఏకంగా 56 శాతం పెరుగుదల చోటు చేసుకుంది. ఏడాదికేడాదితో పోల్చితే స్థూల రిటైల్ రుణాలు 30 శాతం పెరగ్గా.. బంగారం అప్పులు అంతకుమించి పెరగడం గమనార్హం. సెప్టెంబర్ త్రైమాసికంలో పసిడి రుణాలు రూ.2,237.8 కోట్లతో 27 శాతం వాటాను కలిగి ఉన్నాయి. ఆ తర్వాత విలువ పరంగా వ్యక్తిగత రుణాలు 35.4 శాతం పెరిగాయి. ఆటో, నివాస రుణాల్లో వరుసగా 13.6 శాతం, 14.3 శాతం పెరుగుదల నమోదయ్యింది. గృహ, ఆటో, గోల్డ్ రుణాలకు మెరుగైన డిమాండ్ ఉందని, క్రెడిట్ కార్డుల అప్పులు పెరుగుతున్నాయని సిఆర్ఐఎఫ్ హై మార్క్ చైర్మన్ సచిన్ సేథ్ పేర్కొన్నారు.

తొలి అటానమస్ యాంటీ డ్రోన్ గస్తీ వాహనం ఆవిష్కరణ

ప్రజాశక్తి - హైదరాబాద్



ప్రపంచంలోనే తొలి అటానమస్ యాంటీ డ్రోన్ గస్తీ వాహనాన్ని ఇంద్రజాల్ డ్రోన్ డిఫెన్స్ ఇండియా ఆవిష్కరించింది. దీనిని బుధవారం హైదరాబాద్‌లో రిటైర్డ్ లెఫ్టినెంట్ జనరల్ దేవేంద్ర ప్రతాప్ పాండే విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. "భవిష్యత్‌లో దేశాల మధ్య యుద్ధాలు.. కేవలం ఆయుధాలతో మాత్రమే ఉండవు. దేశంలోకి శత్రు దేశాలు పలుమార్లు పంపిన డ్రోన్లను మన బలగాలు నిర్వీర్యం చేస్తున్నాయి. ఇంద్రజాల్ రేంజర్ అనే వాహనం అలాంటి అనుమానాస్పద డ్రోన్లను కూల్చుతుంది. ఇది చాలా కీలకమైన ముందడుగు." అని పేర్కొన్నారు. ఇంద్రజాల్ డ్రోన్ డిఫెన్స్ ఇండియా సిఇఒ కిరణ్ రాజు మాట్లాడుతూ.. 26/11 దాడిలో ప్రాణాలు కోల్పోయిన వారికి నివాళులు అర్పించేందుకే ఈ రోజున దీనిని ఆవిష్కరించామన్నారు. భారత్‌కు ఇతర దేశాలతో భూ సరిహద్దు 15 వేల కిలోమీటర్లు ఉంది. డ్రగ్ ట్రాఫికింగ్ పెద్ద సమస్యగా మారింది. ఆ సమస్య నుంచి పుట్టిందే ఇంద్రజాల్ రేంజర్ వాహనమన్నారు. ఈ వాహనం 10 కిలోమీటర్ల రేడియస్‌లో పని చేస్తుందన్నారు.


సాయి కుమార్ (ఫైల్)


నవీన్ (ఫైల్)

తమిళనాడులో రోడ్డు ప్రమాదం

- ఇద్దరు సిక్కోలు వాసులు మృతి

ప్రజాశక్తి - పలాస

తమిళనాడు రాష్ట్రంలోని రామేశ్వరం సమీపంలో లారీని కారు ఢీకొన్న ఘటనలో ఇద్దరు సిక్కోలు వాసులు మృతి చెందారు. మరో నలుగురు గాయపడ్డారు. మృతుల బంధువులు తెలిపిన వివరాల ప్రకారం... శ్రీకాకుళం జిల్లా పలాస మండలం పెదంచల, వీరరామచంద్రాపురానికి చెందిన ఆరుగురు అయ్యప్ప మాల ధరించి కారులో శబరిమల దర్శనానికి ఐదు రోజుల కిందట వెళ్లారు. తిరుగు ప్రయాణంలో ఆలయాలను దర్శించుకుంటూ వస్తున్నారు. రామేశ్వరంలో దర్శనం అనంతరం కారులో తిరిగి వస్తుండగా బుధవారం వేకువజామున పొగమంచు కారణంగా ముందు వెళ్తున్న లారీని ఢీకొట్టింది. దీంతో కారు డ్రైవర్ పైడి సాయికుమార్ (24), ఇల్లాకుల నవీన్ (23) మృతి చెందారు. గుంట రాజు, పైడి తారకేశ్వరరావు, పైడి గణపతి, తమ్మినాన గణేష్‌కు గాయాలయ్యాయి. క్షతగాత్రులను రామచంద్రాపురంలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

హెచ్‌పిలో 6 వేల ఉద్యోగులపై వేటు

శాన్‌ఫ్రాన్సిస్కో : టెక్ రంగంలో ఉద్యోగాలు గాల్లో దీపంలా మారాయి. తాజాగా ప్రముఖ పిసి, ప్రింటర్ తయారీ సంస్థ హెచ్‌పి వచ్చే రెండు, మూడేళ్లలో 6,000 మంది ఉద్యోగులను తొలగించేందుకు ప్రణాళికలు చేస్తున్నట్లు స్పష్టం చేసింది. కంపెనీ కార్యకలాపాలను క్రమబద్ధీకరించడంతో పాటు ప్రొడక్ట్ డెవలప్‌మెంట్‌లో కృత్రిమ మేధ (ఎఐ) వినియోగాన్ని పెంచే క్రమంలో ఉద్వాసనలు చేపడుతోన్నట్లు వెల్లడించింది. 2028 నాటికి తమ కంపెనీల్లో ఉద్యోగుల సంఖ్యను 4000 నుంచి 6000 మేర తగ్గించేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్లు పేర్కొంది. సంస్థలో మొత్తం ఉద్యోగుల్లో ఇది 10 శాతానికి సమానం కావడం ఆందోళనకరం. 2024 అక్టోబరు నాటికి హెచ్‌పికి ప్రపంచవ్యాప్తంగా దాదాపు 58వేల మంది ఉద్యోగులున్నారు. ఉన్న ఉద్యోగులను తీసివేయడంతో.. కొత్త ఉద్యోగాల భర్తీపైనా నీలినీడలు కమ్ముకున్నాయని స్పష్టమవుతోంది. ప్రొడక్ట్ డెవలప్‌మెంట్, ఇంటర్నల్ ఆపరేషన్స్, కస్టమర్ సపోర్ట్ వంటి విభాగాల్లో ఈ కోతలు ఉండనున్నట్లు కంపెనీ సిఇఒ ఎన్రిక్ లారెస్ వెల్లడించారు. గతేడాది ఆర్థిక మాంద్యం భయాలతో వేలాదిమందిని తొలగించిన ఐటి కంపెనీలు.. ఇటీవల ఎఐని అందిపుచ్చుకునే క్రమంలో భారీగా పొదుపు చర్యలకు పాల్పడుతున్నాయి.

ప్రైవేటు బస్సు ఆపరేటర్ల దోపిడీని అరికట్టాలి

- ముఖ్యమంత్రికి సిపిఐ లేఖ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రానున్న క్రిస్మస్, సంక్రాంతి పండగల సందర్భంగా ప్రైవేటు బస్సు ఆపరేటర్ల దోపిడీని అరికట్టేందుకు తగిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి జి ఈశ్వరయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు బుధవారం ఆయన లేఖ రాశారు. ప్రైవేటు బస్సు యాజమాన్యాల దోపిడీ నానాటికీ పెరిగిపోతుందని లేఖలో పేర్కొన్నారు. ప్రైవేటు ట్రావెల్స్ ఆపరేటర్లు డిమాండ్ ఆధారంగా టిక్కెట్ల ధరలు పెంచేస్తున్నారని తెలిపారు. క్రిస్మస్, సంక్రాంతి పండగల నేపథ్యంలో ప్రైవేటు ఆపరేటర్లు 3 వంతులకుపైగా వసూలు చేస్తున్నట్లు చెప్పారు. రద్దీ కాలంలో హైదరాబాద్ నుంచి విశాఖపట్నం, బెంగళూరుకు దాదాపు రూ.7 వేలు, విజయవాడకు రూ.3 వేల నుంచి రూ.6 వేలు వసూలు చేస్తున్నారని చెప్పారు. కడప నుంచి విజయవాడకు సాధారణ రోజుల్లో రూ.1,900 వసూలు చేస్తుంటే, రద్దీ, పండగ సమయాల్లో రూ.3 వేలు వసూలు చేస్తున్నారని తెలిపారు. రవాణా శాఖ అనుమతులు లేకున్నా.. ఇష్టానుసారంగా అధిక ఛార్జీలు వసూలు చేస్తున్నారని చెప్పారు. బస్సుల ఫిట్నెస్, భద్రతా ప్రమాణాలు లేకున్నప్పటికీ రవాణా శాఖ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. ఇతర రాష్ట్రాల్లో బస్సులను రిజిస్ట్రేషన్ చేయించి రాష్ట్రంలో నడుపుతూ ఖజానాకు గండికొడుతున్నారని తెలిపారు.

సంపాదకీయం


హానికరం

అయోధ్య రామమందిరం ధ్వజారోహణ కార్యక్రమంలో ప్రధాన మంత్రి నరేంద్రమోడీ పాల్గొనడం మరోసారి మన దేశ సెక్యులర్ వ్యవస్థపై చర్చకు దారి తీసింది. రామమందిర నిర్మాణం, ప్రాణ ప్రతిష్ట, ఇప్పుడు ధ్వజారోహణం ఈ మూడు ఘట్టాల్లోనూ ప్రధాని అత్యంత కీలక పాత్ర పోషించడం ద్వారా ఒక నిర్దిష్ట మతాన్ని ప్రోత్సహించి కీలక సంకేతం ఇచ్చారు. ఇది రాజ్యాంగంలో నిర్దేశించిన ప్రమాణాలను తుంగలో తొక్కడమే! కేంద్ర ప్రభుత్వమే నవంబర్ 26వ తేదీని రాజ్యాంగ దివాస్ పేరుతో అట్టహాసంగా నిర్వహిసున్న నేపథ్యంలో దానికి సరిగ్గా ఒక్కరోజు ముందు ఈ కార్యక్రమం జరగడం యాదృచ్ఛికం కాదు. ధ్వజారోహణ కార్యక్రమంలో దేశ ప్రజలను నిట్టనిలువునా చీల్చే ఆర్‌ఎస్‌ఎస్ భావజాలాన్ని తన గొంతుతో వినిపించిన నరేంద్రమోడీ, ఆ తరువాత 24 గంటలు గడవక ముందే రాజ్యాంగ ఘనతను కీర్తించడానికి సిద్ధపడిపోవడం విడ్డూరం! 'శతాబ్దాల గాయాలు .. నొప్పులు ఇప్పుడే మానుతున్నాయి.' అంటూ ధ్వజారోహణ కార్యక్రమంలో మంగళవారం నాడు విద్వేష ప్రసంగం చేసిన ఆయనే, తనలాంటి వాడు ప్రధాని కావడానికి భారత రాజ్యాంగమే కారణమని బుధవారం ప్రకటించారు. అయితే, తన ప్రభుత్వ హయాంలో జరుగుతున్న ఆ రాజ్యాంగ విలువల విధ్వంసంపై మాత్రం ప్రధాని పెదవి విప్పలేదు. ధ్వజారోహణ కార్యక్రమం అన్నది ఒక మతానికి చెందిన ఆధ్యాత్మిక, సంప్రదాయ కార్యక్రమం అన్నది ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. అటువంటి కార్యక్రమంలో దేశ ప్రధాన కార్యనిర్వాహకుడు భాగం కావడం, వేదికపై ప్రధానకర్తగా నిలవడం రాజ్యాంగం నిర్దేశించిన సూత్రాలను ఉల్లంఘించడమే! ఇది రాజ్యాంగబద్ధమైన ప్రధాని పదవి వ్యక్తిగత విశ్వాసాలకు, నమ్మకాలకు, ఆచారాలకు అతీతమన్న భావనను తుంగలో తొక్కడమే!

ఈ కార్యక్రమం నిర్వహించిన తీరు, ప్రభుత్వ యంత్రాంగం వ్యవహరించిన తీరును చూస్తే ఇది అధికారిక కార్యక్రమమేనన్న భావన కలుగుతుంది. కేంద్ర మంత్రిత్వ శాఖలు సోషల్ మీడియా ద్వారా కార్యక్రమాన్ని ప్రచారం చేశాయి. ప్రభుత్వ ప్రసార సంస్థలతో పాటు బిజెపి కనుసన్నలలో నడిచే మీడియా ధ్వజారోహణను గంటల తరబడి ప్రత్యక్ష ప్రసారం చేసింది. అనేక రాష్ట్ర ప్రభుత్వాలు సైతం ఇదే విధంగా స్పందించాయి. ఈ తతంగమంతా చూస్తే అయోధ్యలో జరుగుతున్న కార్యక్రమాలను దేశవ్యాప్త సాంస్కృతిక చిహ్నాలుగా మలచాలనే ప్రయత్నం ఒక పథకం ప్రకారం జరుగుతోందని స్పష్టమౌతోంది. నిజానికి బాబ్రీ మసీదు విధ్వంసాన్ని చట్ట వ్యతిరేక చర్యగా 1992లో అత్యున్నత న్యాయస్థానం సైతం పేర్కొని ఉండటం ఈ సందర్భంగా ప్రస్తావనార్హం. చారిత్రకంగా, రాజకీయంగా, సామాజికంగా అత్యంత వివాదాస్పదమైన ప్రాంతంలో జరుగుతున్న ఒక మత సంబంధిత కార్యక్రమంలో పాల్గొనడం ద్వారా, ఆర్‌ఎస్‌ఎస్ నిత్యమూ జపించే మెజారిటేరియన్ రాజకీయాలు, హిందూ రాష్ట్ర నినాదాలకు అధికార ముద్ర వేయడమే! మన దేశంలో ఇప్పటికే స్థిరపడిన మత సమానత్వ విశ్వాసాన్ని ఈ చర్యలు తీవ్రంగా గండికొడుతున్నాయి. మైనార్టీల భద్రతపైనా, మనుగడ పైనా అనేక సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఈ పరిస్థితి గతంలో ఎన్నడూ లేదు.

రాజ్యాంగంలోని 14, 15, 25, 28 అధికరణాలు రాజ్యం అన్ని మతాల పట్ల సమాన దూరంలో ఉండాలని, ప్రభుత్వ పదవిని మతపరమైన కార్యక్రమాల ప్రచారం కోసం వినియోగించుకోకూడదని స్పష్టం చేస్తున్నాయి. అయోధ్యలో జరుగుతున్న కార్యక్రమాలు ఈ భావనను తీవ్రంగా దెబ్బతీస్తున్నాయి. రాజ్యాంగ ప్రవేశికలో పేర్కొన్న 'సెక్యులర్' అన్న పదాన్ని తొలగించాలని ఆర్‌ఎస్‌ఎస్, దాని అనుబంధ సంస్థలు ఒకవైపు డిమాండ్ చేస్తుండగా, ప్రధాని దానిని మరింత బలహీనపరిచే చర్యలను స్వయంగా చేపట్టడం దేశ ఐక్యతకు భంగకరం. ఈ తరహా చర్యలు ప్రజలను చీల్చి, ప్రజాస్వామ్యాన్ని మరింతగా బలహీనపరుస్తాయి. ఈ అంశాలను దృష్టిలో ఉంచుకుంటే అయోధ్యలో జరిగిన ధ్వజారోహణ కేవలం ఆధ్యాత్మిక కార్యక్రమం కాదని, ఒక పథకం ప్రకారం రాజ్యాంగబద్ధమైన దేశ లౌకిక, ప్రజాతంత్ర విలువలపై జరిగిన దాడి అని అర్థమవుతోంది. కాబట్టి రాజ్యాంగ విలువల పరిరక్షణ కోసం కృషి చేయడమే నిజమైన దేశ భక్తుల ప్రస్తుత కర్తవ్యం!

మహనీయుల మాట



ప్రకృతిని నిర్లక్ష్యం చేయడమంటే...
మనిషి నేల విడిచి సాము చేయడమే.
- జీన్ జాక్ రూసో,
తత్వవేత్త, స్విట్జర్లాండ్.

నీతి ఆయోగ్ విశాఖ ఆర్థిక ప్రణాళిక - అదో కార్పొరేట్ వ్యూహం

సందర్భం



ఇటీవల విశాఖలో నిర్వహించిన పెట్టుబడుల భాగస్వామ్య సమ్మిట్‌లో నీతి ఆయోగ్ తయారు చేసిన విశాఖపట్నం ప్రాంతీయ ఆర్థిక అభివృద్ధి ప్రణాళికను ముఖ్యమంత్రి చంద్రబాబు విడుదల చేశారు. ఈ ప్రణాళికతో వచ్చే ఏడేళ్లలో విశాఖ రీజియన్ అద్భుతమైన ఆర్థిక ప్రగతి సాధిస్తుందని ప్రకటించారు. విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం, మన్యం, అనకాపల్లి, అల్లూరి, తూర్పు గోదావరి, కోనసీమ, కాకినాడ మొత్తం 9 జిల్లాలను కలిపి విశాఖ ఆర్థికాభివృద్ధి రీజియన్‌గా పేర్కొన్నారు.

కేంద్ర బీజేపీ ప్రభుత్వం 2047 నాటికి దేశ ఆర్థిక వ్యవస్థను 30 ట్రిలియన్ డాలర్లుగా మార్చాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా ఆంధ్ర రాష్ట్రం 2032 నాటికి 430 బిలియన్ డాలర్లు, 2047కి 2.4 ట్రిలియన్ డాలర్లు రాష్ట్ర స్థూల ఉత్పత్తి సాధన లక్ష్యంగా పెట్టింది. ఈ జీడీపీ లక్ష్యాలను సాధించటానికి పైలెట్ ప్రాజెక్టులుగా విశాఖపట్నం, ముంబై, వారణాసి, సూరత్ నగరాలను గ్రోత్ హబ్‌లుగా నిర్ణయించి, ఆ నగరాల చుట్టూ ఉన్న కొన్ని జిల్లాలను కలుపుకొని ప్రాంతీయ ఆర్థిక అభివృద్ధి ప్రణాళికలను నీతి ఆయోగ్ తయారు చేసింది.



డా. బి.గంగారావు

ప్రస్తుతం 52 బిలియన్ డాలర్లు విలువ గల స్థూల ఉత్పత్తికి ప్రాతినిధ్యం వహిస్తున్న ఈ విశాఖ రీజియన్‌ను 2032 నాటికి 135 బిలియన్ డాలర్లకు, 2047కి 800 బిలియన్ డాలర్లకు పెంచాలనే లక్ష్యం పెట్టుకున్నారు. ఈ స్థూల ఉత్పత్తికి మానిఫాక్చరింగ్‌లో స్టీల్, పెట్రో కెమికల్; ఓడల నిర్మాణం, పోర్టులు, ఫార్మా, పర్యాటకం, హెల్త్ కేర్, ఐటీ, వ్యవసాయం... వ్యూహాత్మక శోధక శక్తులుగా ఉంటాయని పేర్కొన్నారు. వచ్చే ఏడేళ్లలో 115 బిలియన్ డాలర్లు పెట్టుబడి వస్తుందని, 24 లక్షల ఉద్యోగాలు లభిస్తాయని, మొత్తం ఈ పెట్టుబడిలో 90 శాతం ప్రైవేట్ రంగం నుంచి వస్తుందని తెలిపారు. మూడు ప్రైవేట్ ఉక్కు కంపెనీలతో స్టీల్ హబ్‌ను ఏర్పాటు చేయాలని, అనకాపల్లి వద్ద 500 ఎకరాల్లో అల్యూమినియం పార్కును, ఎలక్ట్రానిక్ పార్క్‌ను కూడా ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. దేశంలో ఒడిషా తరువాత ఎక్కువ బాక్సైట్ నిక్షేపాలు ఉన్న ప్రాంతం అరకు ఈ రీజియన్‌లోనే ఉంది. సుమారు 620 మిలియన్ టన్నుల బాక్సైట్ నిక్షేపాలు ఉన్నాయి. ఈ ప్రాంతం 5వ షెడ్యూల్లో ఉన్నా ఎలాగైనా బాక్సైట్‌తో పాటు ఇతర అరుదైన ఖనిజ వనరులను పెట్టుబడిదారుల వశం చేయటానికి కుట్ర పన్నారు. అనకాపల్లి, శ్రీకాకుళం జిల్లాల్లో లైఫ్ సైన్స్, బల్క్ డ్రగ్, ఫార్మాహబ్, మెడ్‌టెక్‌ల పేర మరికొన్ని ప్రత్యేక పారిశ్రామిక కేంద్రాలను నెలకొల్పబోతున్నారు. మూలపేట, కాకినాడ, నక్కపల్లి వద్ద కొత్త పోర్టుల నిర్మాణం, మరికొన్ని పునరుత్పాదక హైడ్రోజన్ ప్రాజెక్టులు చేపట్టనున్నారు.

ఇప్పటికే నక్కపల్లి వద్ద బల్క్ డ్రగ్ పార్కుకు, శ్రీకాకుళం జిల్లాలో కార్గో ఎయిర్ పోర్ట్‌కు, అల్లూరి, మన్యం జిల్లాల్లో హైడ్రో పవర్ ప్రాజెక్టులకు వ్యతిరేకంగా ప్రజలు పెద్దఎత్తున పోరాటం చేస్తున్నా- ప్రభుత్వం వాటిని మరింత విస్తరించాలని భావిస్తోంది. శ్రీకాకుళం, విశాఖ తీర ప్రాంతంలో సుమారు 3 వేల ఎకరాల పరిధిలో బీచ్ శాండ్ మైనింగ్‌కు అదానీ సంస్థకి గతంలో వైసీపీ ప్రభుత్వం ఇచ్చిన అనుమతులను కూటమి ప్రభుత్వం ఇటీవల ఖరారు చేసింది. ఇప్పుడు మొత్తం సముద్ర తీరంలో బీచ్ శాండ్‌లోని విలువైన టైటానియం డి ఆక్సైడ్, ఇల్మినైట్ వంటి ధాతువులను ఎగుమతులు చేసుకోవటానికి బడా కార్పొరేట్లకు అనుమతులు ఇవ్వాలని నిర్ణయించారు.

ఐటీ, స్టార్టప్ కంపెనీలు, డేటా సెంటర్స్, ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ వంటి వాటిలోకి 20 బిలియన్ డాలర్ల పెట్టుబడి వస్తుందని, దీనివల్ల ప్రస్తుత 50 వేల నుంచి 4.75 లక్షలకు ఉద్యోగాలు పెరుగుతాయని, 5 వేల స్టార్టప్ కంపెనీలు వస్తాయని చెప్పారు. మరోవైపు చాలా ఏళ్ల క్రితమే 580 ఎకరాలకు పైగా ఐటీకి కేటాయించామని, ఇందులో సగభూమి కూడా అభివృద్ధికి నోచుకోలేదని, అభివృద్ధి చేసినది కూడా పూర్తిగా వినియోగంలోకి రాలేదని ప్రస్తుత ఐటీ రంగ దుస్థితిని నివేదిక ఎత్తిచూపింది. ఇప్పుడు మరో 1500 ఎకరాల కేటాయింపునకు ప్రతిపాదన చేశారు.

కోనసీమ, కాకినాడ, తూర్పు గోదావరి జిల్లాల పరిధిలో వ్యవసాయ రంగం మొత్తాన్ని వాణిజ్య ఎగుమతుల పంటల వైపు మార్చాలనేది మరొక వ్యూహం. పౌల్ట్రీ ఉత్పత్తులు 5 రెట్లు, చేపలు, రొయ్యల సాగును లక్ష నుండి 2.45 లక్షల ఎకరాలకు పెంచాలని, సముద్ర చేపల ఉత్పత్తి పెంచటానికి బడా డీప్ సీ వెసల్స్‌కు అనుమతి ఇవ్వాలని ప్రతిపాదించారు. పామాయిల్ సాగు లక్షా 80 వేల నుంచి 3.80 లక్షల ఎకరాలకు; అరటి, కొబ్బరి, జీడి పంటల విస్తీర్ణాన్ని రెట్టింపు చేయాలనేది లక్ష్యం. తద్వారా దేశానికే ధాన్యాగారంగా ఉన్న గోదావరి జిల్లాల్లో ఆహార పంటలకు స్థానమే లేకుండా చేయబోతున్నారు.

అల్లూరి జిల్లాలో కాఫీ పంటను 2.5 లక్షల నుంచి 3.5 లక్షల ఎకరాలకు పెంచాలని, ఉత్పాదకత పెంచటానికి అదనపు పెట్టుబడులు పెట్టాలని, ఎగుమతి బాధ్యత బడా కంపెనీలకు అప్పజెప్పాలని భావించారు.

టూరిజాన్ని బడా పెట్టుబడులతో అభివద్ధి చేయాలని, పెద్ద పెద్ద స్టార్ హోటల్స్, రిసార్ట్స్, సర్వీస్ అపార్ట్మెంట్స్, క్రూస్ టూరిజం, థీమ్ పార్కులు, డిస్నీ వరల్డ్ వంటివి నిర్మించాలని పేర్కొన్నారు. ఈ పేరుతో చిన్న, సన్నకారు రైతులను, సముద్ర తీరం పొడవునా ఉన్న లక్షలాది మంది మత్స్యకారులను తరిమి వేయనున్నారు. గిరిజన ప్రాంతంలో కూడా చట్టాలన్నింటి ధిక్కరించి టూరిజాన్ని విస్తరించాలని భావిస్తున్నారు.

> **రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను బడా కార్పొరేట్ శక్తుల ఆధిపత్యంలోకి తీసుకెళ్లడంలో భాగంగానే నీతి ఆయోగ్ విశాఖ రీజియన్ ఆర్థిక అభివృద్ధి ప్రణాళికను రూపొందించినట్లు అర్థమవుతోంది. త్వరలో ఇదే నమూనాలో అమరావతి, తిరుపతి ప్రాంతీయ ఆర్థిక ప్రణాళికలు తయారు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ప్రజల భూములను, ప్రభుత్వ పెట్టుబడులతో నిర్మించిన మౌలిక సదుపాయాలను, పరిశ్రమలను, శ్రమశక్తిని కొల్లగొట్టడంద్వారా దేశ, రాష్ట్ర కేంద్రీకత స్థూల ఉత్పత్తిని పెంచాలనేది తెలుగుదేశ కూటమి - కేంద్ర బీజేపీ సర్కార్ వ్యూహం. ఇది రాష్ట్రానికి పెనుముప్ప కలిగిస్తుంది. ఈ కార్పొరేట్ దోపిడీ వ్యూహాన్ని వెనక్కి కొట్టడమే ప్రజల ముందున్న కర్తవ్యం.**

పట్టణీకరణను, రియల్ ఎస్టేట్ రంగాన్ని పెద్దఎత్తున పెంచాలనేది మరొక వ్యూహం. ఇందుకోసం 7 పారిశ్రామిక, 6 సర్వీస్ నగరాలను కొత్తగా నిర్మించాలని; అమెరికాలోని మియామీ బీచ్ కారిడార్, దుబాయిలోని జుమేరా తరహాలో వైజాగ్ బే సిటీ, వైజాగ్ 2.0... ఇలా 15 నగరాలను అత్యంత విలాసవంతమైన 7.5 లక్షల విల్లాలు, ఎత్తైన బహుళ అంతస్తుల భవనాలు నిర్మించాలని తలపెట్టారు. వీటికి అనుబంధంగా పెద్ద పెద్ద విద్యాసంస్థలు, స్టార్ హాస్పిటల్స్, క్రీడా మైదానాలు, లగ్జరీ మాల్స్ వంటి వాటిని ప్రణాళికలో పొందుపర్చారు.

రెండో వైపు ఈ రీజియన్ పరిధిలోని 5 మున్సిపల్ కార్పొరేషన్లలో రైల్వే, పోర్టు, రక్షణ, చెరువుల పక్కన... ప్రభుత్వ భూముల్లో లక్షా 30 వేలమంది నివాసితులు ఉన్నారని, వారిని వివిధ ప్రాంతాలకు తరలించి ఆ భూమిని వాణిజ్య అవసరాలకు వినియోగించాలని, అనువుగా లేని చోట 50 శాతం భూమిని ప్రైవేట్ సంస్థలకు ఇచ్చి మిగిలిన భూమిలో ప్రైవేట్ పెట్టుబడితో పేదలకు ఇళ్లు నిర్మించాలని పేర్కొన్నారు. ఈ విధంగా పెట్టుబడిదారుల కోసం పేదలను తరిమేయడానికి రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమైంది. దీనికోసం ప్రత్యేక మురికివాడల చట్టం తీసుకు రావాలని ప్రతిపాదించారు.

భూ సమీకరణ ప్రణాళిక చూస్తే... ఒక్క పరిశ్రమల కోసమే 55 వేల ఎకరాలు అవసరమని పేర్కొన్నారు. సంపన్నుల విల్లాలకు 20 వేల ఎకరాలు, ప్రైవేట్ పెట్టుబడుల మౌలిక సదుపాయాల కల్పనకోసం అవసరమైన నిధులు సమకూర్చుకోవటానికి మరో 20 వేల ఎకరాలు సేకరించి అమ్మేయడానికి ప్రతిపాదించారు. ఇలా అనేక రంగాల పేర రైతులనుంచి వేల ఎకరాల భూములు బలవంతంగా సేకరించనున్నారు.

ఈ ఆర్థిక ప్రణాళికలో పేర్కొన్న రీజియన్‌లో 38 వేల చదరపు కిలోమీటర్ల వైశాల్యంలో కోటి 65 లక్షల జనాభాతో, 5 మున్సిపల్ కార్పొరేషన్లు ఉన్నాయి. 520 కిలోమీటర్లు పొడవు గల సముద్ర తీరం ఉంది. బాక్సైట్, మైకా, క్వార్ట్ జైట్ వంటి అనేక ఖనిజ నిక్షేపాలకు తూర్పు కనుమలు నిలయం. రాష్ట్ర అటవీ ప్రాంతంలో సగభాగం ఈ ప్రాంతంలోనే ఉంది. అత్యధిక వర్షపాతం కలిగి అనేక జీవనదులతో, సకల పంటలకు అనువైన వాతావరణంతో సారవంతమైన భూములు కలిగి ఉంది. లక్షల ఎకరాల ప్రభుత్వ భూములు ఉన్నాయి. లక్ష కోట్ల విలువ గల ప్రభుత్వరంగ సంస్థలు, ప్రభుత్వ పెట్టుబడులతో అనేక రకాల మౌలిక సదుపాయాలు ఉన్నాయి. భారీ ఖనిజ సంపదకు నిలయంగా ఉన్న ఛత్తీస్‌ఘడ్, ఝార్ఖండ్, ఒడిషా రాష్ట్రాలకు ఈ రీజియన్ అత్యంత వ్యూహాత్మక ప్రాంతంగా ఉంది. స్థూలంగా చెప్పాలంటే ప్రైవేట్ పెట్టుబడిదారుల విపరీత లాభాలకు చాలా అనువైన ప్రాంతంగా ఉంది.


రెండో పార్శ్వం చూస్తే- ఇది అభివృద్ధిలో అట్టడుగున వున్న గిరిజనులు, సముద్ర తీరాన్నే నమ్ముకొని జీవిస్తున్న మత్స్యకారులు ఉన్న ప్రాంతం. నిరుపేదలు, చిన్న, సన్నకారు రైతులతో నిత్యం వలస దారి పడుతున్న ప్రాంతం. ఈ ప్రజల అభివృద్ధి కోసం పాలకులు ఈ ప్రణాళిక రూపొందించలేదనేది వాస్తవం. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను బడా కార్పొరేట్ శక్తుల ఆధిపత్యంలోకి తీసుకెళ్లడంలో భాగంగానే నీతి ఆయోగ్ విశాఖ రీజియన్ ఆర్థిక అభివృద్ధి ప్రణాళికను రూపొందించినట్టు అర్థమవుతోంది. త్వరలో ఇదే నమూనాలో అమరావతి, తిరుపతి కేంద్రాలుగా ప్రాంతీయ ఆర్థిక ప్రణాళికలు తయారు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ప్రజల ఆస్తులను, భూములను, ప్రభుత్వ పెట్టుబడులతో నిర్మించిన మౌలిక సదుపాయాలు, ప్రభుత్వ పరిశ్రమలు, శ్రమశక్తిని కొల్లగొట్టడం ద్వారా దేశ, రాష్ట్ర కేంద్రీకత స్థూల ఉత్పత్తిని పెంచాలనేది తెలుగుదేశ కూటమి - కేంద్ర బీజేపీ సర్కార్ వ్యూహం. ఇది రాష్ట్రానికి పెనుముప్పు కలిగిస్తుంది. ఈ కార్పొరేట్ దోపిడీ వ్యూహాన్ని వెనక్కి కొట్టడమే ప్రజల ముందున్న కర్తవ్యం.

రచయిత మొబైల్ నెంబరు : 94900 98792

C2+50 మద్దతు ధరల చట్టం చేయాలి

సరళీకరణ విధానాల మూలంగా వ్యవసాయ రంగం తీవ్రమైన సంక్షోభానికి గురైంది. రైతు పెట్టిన పెట్టుబడి కూడా తిరిగి రాక రైతాంగం రుణగ్రస్త మయ్యారు. అప్పుల బాధకు తాళలేని పేద, మధ్య తరగతి రైతులు, కౌలు రైతులు ఆత్మహత్యలకు పాల్పడి మతి చెందారు. జాతీయ నేర పరిశోధన బ్యూరో (NCRB) లెక్కల ప్రకారమే 1995 - 2023 మధ్యన 4 లక్షల మంది రైతులు ఆత్మహత్యల పాలయ్యారు.

1990 అనంతరం బ్యాంకులు పేద రైతులకు, కౌలు రైతులకు రుణాలు ఇవ్వడం తగ్గించి వేశాయి. ప్రైవేట్ వడ్డీ వ్యాపారులపై ఆధార పడాల్సి వచ్చింది. విత్తనాలు, ఎరువులు, క్రిమి సంహారకాలు, కలుపు మందుల ధరలు పెరుగుదల వల్ల వ్యవసాయ పెట్టుబడులు విపరీతంగా పెరిగిపోయాయి. ట్రాక్టర్లు, కోత నూర్పిడి యంత్రాలు, మైక్రో ఇరిగేషన్ పరికరాలు అద్దెలు పేద, మధ్య తరగతి రైతులకు భారంగా మారాయి.



వై.కేశవరావు

1990 అనంతరం వ్యవసాయ మార్కెట్ కమిటీలు, సహకార సంస్థలు, FCI, STC తదితర సంస్థలు కొనుగోళ్ళు తగ్గించి వేశాయి. కంపెనీల, వ్యాపారుల, మార్కెట్ దోపిడీ, వడ్డీ వ్యాపారుల దోపిడీ, విశృంఖలమైంది. వ్యవసాయంలో పంటల ఉత్పాదకత మూడింతలు పెరిగినా ఫలితం రైతులకు దక్కనీయకుండా దోపిడి వర్గాలు పాలయ్యింది. రైతులు ఏటా 3 లక్షల కోట్లు నష్టపోతున్నారని ఆర్థికవేత్తల అంచనా.

సరళీకరణ విధానాలు అమలు ఫలితంగా రైతాంగం వ్యవసాయరంగాన్ని వదిలివేస్తున్నారని ప్రభుత్వ లెక్కల్లోనే తేలింది. రైతు కుటుంబాలు 1991 నాటికి 11.07 కోట్లు ఉండగా, 2001 నాటికి 10.36 కోట్లకు, 2011 నాటికి 9.58 కోట్లకు తగ్గిపోయాయి. అప్పులు పాలైన రైతులు తమ భూములు కోల్పోయారు. ఇదే పరిస్థితి కొనసాగితే దేశ ఆహార భద్రతకు ప్రమాదం ఏర్పడుతుందని నిపుణులు చెప్తున్నారు.

ఈ స్థితిలో రైతాంగం జరిపిన పోరాటం ఫలితంగా యూపీఏ ప్రభుత్వం 2004లో డాక్టర్ స్వామినాథన్ చైర్మన్‌గా రైతుల జాతీయ కమిషన్ ఏర్పరిచింది. ఆ కమిషన్ 2006 అక్టోబర్‌లో నివేదిక ఇచ్చింది. అందులో ప్రధాన అంశం... ప్రభుత్వ జవాన్‌కు వచ్చే ఆదాయం రైతుకు కూడా కనీస ఆదాయంగా ఉండాలనేది. రైతు పెట్టిన సమగ్ర ఉత్పత్తి ఖర్చులకు అదనంగా 50 శాతం కలిపి మద్దతు ధరగా నిర్ణయించాలని చెప్పారు. దానినే C2+50 ఫార్ములాగా పేర్కొన్నారు.



పంట ఉత్పత్తి ఖర్చులపై అదనంగా 50 శాతం కలిపి రైతు ఇంటికి చేరాలి. కనీసం సాధారణ ప్రభుత్వ జవానుతో సమానమైన నికర ఆదాయం సాధారణ రైతు పొందగలగాలి. - డాక్టర్ ఎం.ఎస్ స్వామినాథన్

2014 ఎన్నికల్లో C2+50 ప్రకారం మద్దతు ధరల చట్టం తెస్తామని, రైతుల ఆదాయం రెట్టింపు చేస్తామని బిజెపి హామీ ఇచ్చింది. అధికారంలోకి వచ్చిన అనంతరం C2+50 ప్రకారం మద్దతు ధరలు చట్టం చేయడం సాధ్యం కాదని సుప్రీంకోర్టులో అఫిడవిట్ దాఖలు చేసి రైతాంగానికి తీరని ద్రోహం చేసింది. దేశంలో రైతాంగ ఉద్యమం తీవ్రమవడంతో A2+FL ఫార్ములాను అమలుపరుస్తానని ప్రకటించింది. దీని ప్రకారం పెట్టుబడులు కూడా రావు. వ్యవసాయ ధరల నిర్ణాయక కమిషన్ (సిఎసిపి) ఇప్పటికే 9 ఫార్ములాలు ప్రకటించింది. A2+FL ఫార్ములా 1985కు పూర్వం అమలులో ఉన్నదే! అప్పటినుండి యంత్ర పరికరాలు రావడం విత్తనాలు, ఎరువులు, క్రిమిసంహారకాలు తదితరాలు రావడంతో ఫార్ములాలు మారుతూ వచ్చాయి. A2+FL ఫార్ములా తరువాత బి1, బి2, సి1, సి2, సి3 ఫార్ములాలు మారుతూ వచ్చాయి. వీటన్నిటినీ పరిశీలించిన వ్యవసాయ కమిషన్ C2+50 ఫార్ములా రూపొందించింది.

రైతాంగం C2+50 ధరల విధానం కోసం పోరాడుతుండగా కేంద్ర ప్రభుత్వం అసలు మద్దతు ధరల విధానమే లేకుండా వ్యవసాయ నల్ల చట్టాలు రూపొందించింది. 13 మాసాల సుదీర్ఘ పోరాటం అనంతరం ఆ చట్టాలు వెనక్కి తీసుకుంది. ఆనాడు రాతపూర్వకంగా మద్దతు ధరల చట్టం చేస్తానని హామీ ఇచ్చిన కేంద్ర ప్రభుత్వం అమలు పరచకుండా రైతాంగానికి మరొకసారి ద్రోహం చేసింది.

రైతులు ఎంపీలు, ఎమ్మెల్యేలు తీసుకుంటున్న వేతనాల స్థాయి ఆదాయం అడగడం లేదు. అధికారుల వేతనాలతో సమానమైన ఆదాయం అడగడం లేదు. కనీసం C2+50 ఫార్ములా అమలు కోరుతున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అది కూడా అంగీకరించడం లేదు. వ్యవసాయ రంగాన్ని రైతాంగం మూల్గులు పీల్చే కార్పొరేట్ శక్తులకు, బడా వ్యాపారులకు అప్పగించజూస్తున్నారు.

కేరళ ప్రభుత్వం C2+50 ఫార్ములాను ధాన్యంతో పాటు పండ్లు, కూరగాయలు తదితర 14 పంటలకు అమలు పరుస్తోంది. ఈ ఫార్ములా ప్రకారం దేశంలో పంటల మద్దతు ధరల అమలు గ్యారంటీ చట్టం కోసం 540 సంఘాలు తిరిగి పోరాటం ప్రారంభించాయి. ఇకనైనా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు C2+50 మద్దతు ధరల అమలుకు హామీ చట్టం చేయాలి. ఎంఎస్‌పి లెక్కించడంలో ఉన్న లోపాలను సరిదిద్దాలి. దేశంలో 23 పంటలకు మాత్రమే ఎంఎస్‌పి ఉన్నది. దేశంలో పండే అన్ని పంటలకు C2+50 అమలు చేయాలి. ఈ డిమాండ్లపై రైతులంతా మరొకసారి పోరాటం చేయాల్సి ఉంది.

రచయిత ఎ.పి రైతుసంఘం పూర్వ అధ్యక్షులు

అమాయకుల ప్రాణాలతో
'మెడికల్ మాఫియా' చెలగాటం!



'వైద్యం వ్యాపారం కాకూడదు. అది మానవ సంక్షేమానికి పునాది కావాలి'.. 'ప్రతి మెడిసిన్ మనిషి కోసం తయారు కావాలి. కానీ మనుషులను బలితీసుకోవద్దు'... మెడికల్ ఎథిక్స్‌లో భాగంగా ప్రముఖ అంతర్జాతీయ వైద్య నిపుణులు చేసే వ్యాఖ్యలివి. కానీ, ప్రపంచ వ్యాప్తంగా దీనికి పూర్తి విరుద్ధంగా జరుగుతోంది. ఇటీవల కరీంనగర్‌లో వెలుగు చూసిన ఘటన తెలంగాణ - ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల ప్రజలను తీవ్ర ఆందోళనలోకి నెట్టింది. వైద్య శిబిరాల పేరుతో మెడికల్ క్లినికల్ ట్రయల్స్ మాఫియా అమాయకులను టార్గెట్‌గా చేసుకొని ప్రయోగాలు చేస్తూ.. వారి ప్రాణాలతో చెలగాటమాడుతుండడం ఆందోళనకు గురి చేస్తోంది. ఇలాంటి వాటిని నియంత్రించడంలో డీసీజీఐ వంటి సంస్థలు విఫలమవుతున్నాయి.

పర్యవేక్షణ లేకుండా పేదలపై ప్రయోగాలు

ఏదైనా ఔషధానికి సంబంధించి ట్రయల్స్‌ను ముందుగా జంతువులపై చేస్తారు. అక్కడ సక్సెస్ అయితే... తర్వాత తగిన పరిహార హామీతో, రోగి అంగీకారాన్ని తీసుకొని కఠిన నిబంధనలను అనుసరించి మనుషులపై చేస్తారు. అయితే అలాంటిదేమీ చేయకుండానే వైద్య శిబిరాలు, ఆర్థిక సాయం వంటి వాటితో మెడికల్ మాఫియా పేదలను టార్గెట్‌గా చేసుకొని డైరెక్ట్‌గా మనుషులపైనే ఔషధ ప్రయోగాలను అక్రమంగా, రహస్యంగా చేస్తున్నట్టు తెలుస్తోంది. గతంలో కరీంనగర్ లోని కొత్తపల్లికి చెందిన కొందరు యువకులు ఔషధ ప్రయోగాల్లో పాల్గొని తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. అందులో ఒకరు మతి స్థిమితం కోల్పోయినట్టు అతడి తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఇది 2017లో సంచలనం సష్టించింది. తాజాగా ఓ వ్యక్తి తనపై ఔషధ ప్రయోగాలు చేశారని పోలీసులను ఆశ్రయించడం చర్చనీయాంశంగా మారింది. ఇంకా వెలుగులోకి రాని ఘటనలు ఎన్నో ఉంటాయనే చర్చ ఉన్నది.

ప్రపంచవ్యాప్తంగానూ..

క్లినికల్ ట్రయల్స్ ద్వారా ఔషధాలు, టీకాలు కనుగొనడం మానవాళికి మేలు చేసినా, నైతిక నియమాలు పాటించకుండా చేసిన ప్రయోగాలు ఎంతో ప్రాణనష్టాన్ని, వైకల్యాలను మిగిల్చాయి. 2006లో లండన్‌లో ఆరుగురు ఆరోగ్యకరమైన వాలంటీర్లకు యాంటీబాడీ డ్రగ్ ఇచ్చిన కొన్ని నిమిషాల్లోనే వారి రోగనిరోధక వ్యవస్థను నాశనం అయింది. వీరంతా బతికినా, తీవ్రమైన శారీరక వైకల్యం, అవయవాల వైఫల్యానికి గురయ్యారు. 2016లో ఫ్రాన్స్‌లో జరిగిన న్యూరో డిజార్డర్ డ్రగ్ ట్రయల్‌లో ఆరుగురు వాలంటీర్లలో ఒకరు మరణించగా, మిగిలిన ఐదుగురూ మెదడు సంబంధిత రోగాలకు గురయ్యారు. ఇలా ప్రపంచవ్యాప్తంగా ప్రతి ఏడాది వేలాది మంది మరణిస్తూనే ఉన్నారు.

క్లినికల్ ట్రయల్స్ రాజధానిగా భారత్

భారతదేశం గ్లోబల్ క్లినికల్ ట్రయల్స్ రాజధానిగా మారుతున్నదనే ఆందోళన ఉంది. తక్కువ ఖర్చు, అధిక సంఖ్యలో పేద జనాభా, తగినంత అవగాహన లేమి దీనికి ప్రధాన కారణాలుగా చెబుతున్నారు. సెంట్రల్ డ్రగ్ స్టాండర్డ్స్ కంట్రోల్ ఆర్గనైజేషన్ (సీడీఎస్ సీఓ) డేటా ప్రకారం 2021 నుంచి 2025 జులై వరకు దేశవ్యాప్తంగా 1,705 మంది క్లినికల్ ట్రయల్స్‌లో మరణించారు. ఏడువేల మందికి పైగా తీవ్ర అస్వస్థతకు గురికాగా, చాలా మంది శాశ్వత వికలాంగులుగా మారారు. 2005 నుంచి 2012 మధ్య కాలంలో 2600 మందికి పైగా మరణించారు. సుమారు 12 వేల మంది తీవ్రమైన దుష్ప్రభావాలకు గురయ్యారు. వీటిలో 80 మరణాలు, 500కు పైగా తీవ్ర దుష్ప్రభావాలు నేరుగా మనవిషులపై ఔషధాలు ప్రయోగించడం కారణంగానే జరిగాయని తేలింది. 2005-2013 వరకు 2644 మంది మరణించగా, ఇందులో 17 మందికి మాత్రమే పరిహారం అందింది. 2010లో గుజరాత్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో 24 వేల మంది బాలికలపై హెచ్‌పీవీ వ్యాక్సిన్ ట్రయల్స్ జరగ్గా.. ఏడుగురు మరణించడం తీవ్రవివాదాన్ని సృష్టించింది. తల్లిదండ్రుల నుంచి సమ్మతి లేకుండా, నైతిక నిబంధనలను ఉల్లంఘించారనే ఆరోపణలు వచ్చాయి.

తీవ్ర పర్యవసానాలు

అక్రమ క్లినికల్ ట్రయల్స్ ప్రాణాలను బలి తీసుకోవడం, వైకల్యాలను మిగల్చడం మాత్రమే కాకుండా.. సమాజంపై తీవ్ర దుష్ప్రభావం చూపుతాయి. పేద, సాధారణ ప్రజలు వైద్యం చేయించుకోవడానికి కూడా భయపడే పరిస్థితి వస్తుంది. వైద్యులు, ఆస్పత్రులపై నమ్మకం పోతుంది. సరికొత్త ఔషధాలు, చికిత్సలు మానవాళికి అవసరం. కానీ వాటి కోసం చేసే ప్రయోగాలు నైతిక నియమాలు, మానవ హక్కుల పరిధిలోనే జరగాలి. అమాయకుల ప్రాణాలను పణంగా పెట్టి సంపాదించే లాభాల కంటే మానవత్వం, భద్రతకే అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలి. అక్రమాలకు పాల్పడే మెడికల్ మాఫియాను కఠినంగా శిక్షించడం, క్లినియర్ ట్రయల్స్ నియంత్రణను మరింత పటిష్టం చేయడం తక్షణ కర్తవ్యం.

- మహమ్మద్ ఆరిఫ్, 70131 47990

డబ్ల్యుటిసిలో 5వ స్థానానికి టీమిండియా

దుబాయ్: గౌహతిలో దక్షిణాఫ్రికాతో జరిగిన రెండో టెస్ట్‌లో భారత జట్టు ఘోర ఓటమిపాలైంది. సొంతగడ్డపై భారత్ 0-2 తేడాతో వైట్‌వాష్‌కు గురైంది. దాంతో ప్రపంచ టెస్ట్ చాంపియన్‌షిప్ పాయింట్ల పట్టికలో స్థానం దిగజారింది. దాయాది దేశం పాకిస్తాన్ జట్టు తర్వాత ఐదోస్థానానికి పడిపోయింది. గౌహతి టెస్ట్‌ను దక్షిణాఫ్రికా 408 పరుగుల తేడాతో గెలిచింది. రెండు మ్యాచుల టెస్ట్ సిరీస్‌లో భారత్‌ను వైట్‌వాష్ చేసింది. కోల్‌కతా టెస్ట్‌ను దక్షిణాఫ్రికా 30 పరుగుల తేడాతో గెలిచిన బావుమా నేతృత్వంలోని ప్రొటీస్ జట్టు.. గౌహతి టెస్టులోనూ 408 పరుగుల తేడాతో గెలిచి సిరీస్‌ను 2-0తో కైవసం చేసుకుంది. తాజాగా ప్రొటీస్ జట్టు చేతిలో ఓటమి ప్రపంచ టెస్ట్ పాయింట్ల పట్టికలో దారుణంగా ఐదోస్థానానికి చేరుకుంది.

సైన్యంలో సిబ్బంది కొరత

- అగ్నివీర్‌లతో భర్తీ?

న్యూఢిల్లీ : దేశ త్రివిధ దళాల్లో బలగాల కొరత తీవ్రంగా ఉంది. దీన్ని భర్తీ చేసేందుకు రానున్న రోజుల్లో నియామకాలను పెంచే యోచనలో కేంద్ర ప్రభుత్వం ఉంది. అయితే ఈ కొరతను అగ్నివీర్‌లతో భర్తీ చేయాలని ప్రభుత్వం భావిస్తుంది. ప్రస్తుతం ప్రతి ఏడాది 45 వేల నుంచి 50 వేల మందిని నియమించుకుంటుండగా.. ఈ సంఖ్యను లక్షకు పెంచే ఆలోచనలో ఉన్నట్లు జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి.కరోనా సమయంలో 2020, 2021లో దేశవ్యాప్తంగా సైన్యంలో నియామకాలు నిలిచిపోయాయి. అదే సమయంలో ఏడాదికి 60వేల నుంచి 65 వేల మంది సైనికులు పదవీవిరమణ చేశారు. ఆ తర్వాత నాలుగేళ్ల సమయానికి అంటే 2022లో అగ్నిపథ్ పథకం ప్రారంభమైంది. భారీ స్థాయిలో నియామకాలు చేపట్టేందుకు చర్యలు చేపట్టిన ప్రభుత్వం.. ఆ ఏడాది త్రివిధ దళాల్లో దాదాపు 46వేల ఖాళీలను భర్తీ చేసేందుకు ప్రయత్నాలు చేసింది. కేంద్ర ప్రభుత్వం గతంలో వెల్లడించిన వివరాలను పరిశీలిస్తే 2023లోనే త్రివిధ దళాల్లో 1.55లక్షల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. సైన్యంలో ఏటా పదవీ విరమణలు, నియామకాలకు మధ్య వ్యత్యాసం ఉండటంతో భారీ స్థాయిలో ఖాళీలు ఏర్పడుతున్నాయి. ఇటీవల ఏడాదికి దాదాపు 20 నుంచి 25 వేల ఖాళీలు ఉంటుండడంతో ప్రస్తుతానికి 1.8లక్ష ఖాళీలు ఏర్పడినట్లు అంచనా. అగ్నిపథ్ పథకం ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటివరకు 1.75లక్షల మంది అగ్నివీరులను నియమించుకున్నట్లు తెలిసింది. అయితే, అగ్నివీరుల నాలుగేళ్ల వ్యవధి వచ్చే ఏడాదితో పూర్తి కానుంది. వీరిలో అనేక మంది రెగ్యులర్ సైనికులు కూడా పదవీవిరమణ చేయాల్సి రానుండడంతో రానున్న రోజుల్లో ఖాళీలు భారీగా పెరుగుతాయి. వీటిని భర్తీ చేసేందుకు ఏడాదికి లక్ష మంది అగ్నివీరులను నియమించుకోవాలని ప్రభుత్వం యోచిస్తుందని మీడియా నివేదికలు తెలుపుతున్నాయి.



కీలక బిల్లులపై చర్చలు అనుమానమే..!

- శీతకాల సమావేశాల్లో తొమ్మిది బిల్లులు
- హడావిడిగా ఆమోదం పొందేందుకు మోడీ ప్రభుత్వం యత్నాలు

న్యూఢిల్లీ : పార్లమెంట్ శీతాకాల సమావేశాలు డిసెంబరు 1వ తేదీన ప్రారంభం కాబోతున్నాయి. 19వ తేదీ వరకూ ఇవి కొనసాగుతాయి. సెలువలు పోను కేవలం పదిహేను రోజులు మాత్రమే జరిగే ఈ సమావేశాలలో తొమ్మిది కీలక బిల్లులకు ఆమోదం పొందాలని నరేంద్ర మోడీ ప్రభుత్వం భావిస్తోంది. వీటిలో అణు విద్యుత్, మార్కెట్లు, ఉన్నత విద్య, మౌలిక సదుపాయాలకు సంబంధించిన బిల్లులు ప్రధానమైనవి. స్టాక్ మార్కెట్, కార్పొరేట్ చట్టం, బీమాకు సంబంధించిన బిల్లులు కూడా వీటిలో ఉన్నాయి. సమావేశాలు కేవలం పదిహేను రోజులు మాత్రమే జరుగుతుండడంతో ఇలాంటి ముఖ్యమైన బిల్లులపై చర్చకు పెద్దగా సమయం ఉండకపోవచ్చు. లోతైన చర్చకు అవకాశం ఇవ్వకుండానే వాటిని హడావిడిగా ఆమోదింపజేసుకోవడం ప్రభుత్వ ఉద్దేశంగా కన్పిస్తోంది. ప్రభుత్వం తీసుకురాబోయే బిల్లుల్లో అత్యంత కీలకమైనది అణు విద్యుత్ రంగానికి సంబంధించింది. ఇది రాజకీయంగా సున్నితమైన ప్రతిపాదన. అణు విద్యుత్ రంగాన్ని ప్రయువేటు శక్తులకు కట్టబెట్టడం దీని ఉద్దేశం. పది సంవత్సరాల క్రితం ఇది ఊహకు సైతం రాని ప్రతిపాదన. దేశంలోని అత్యంత శక్తివంతమైన ఆరు కార్పొరేట్ గ్రూపులు...అదానీ, అంబానీ, టాటాలు, వేదాంత, జేఎస్‌డబ్ల్యూ ఎనర్జీ, నవీన్ జిందాల్‌కు చెందిన జిందాల్ ఎనర్జీ...ప్రభుత్వం నుంచి గ్రీన్ సిగ్నల్ వచ్చిన మరుక్షణమే అణు రంగంలోకి ప్రవేశించాలని తహతహలాడుతున్నాయి. అయితే వారి భాగస్వామ్యం చిన్న చిన్న మాడ్యులర్ అణు రియాక్టర్లకు ఆర్థిక సాయం అందించడం, వాటిని నిర్మించడం వరకే పరిమితం. సంప్రదాయ అణు విద్యుత్ ప్లాంట్లను నిర్మించాలంటే అనేక బిలియన్ డాలర్లు ఖర్చవుతాయి. అంతేకాక వాటి నిర్మాణానికి దశాబ్దం లేదా అంతకంటే ఎక్కువ కాలమే పడుతుంది. అణు విద్యుత్ రంగాన్ని ప్రయువేటు సంస్థలకు అప్పగించడంపై నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రైవేటు సంస్థలు ఎప్పుడూ దీర్ఘకాలిక భద్రత, విశ్వసనీయతపై కంటే లాభాల పైనే దృష్టి పెడతాయని వారు గుర్తు చేశారు.

చండీఘర్‌ను కేంద్ర పాలిత ప్రాంతంగా మార్చేందుకు ఉద్దేశించిన బిల్లును ప్రభుత్వం ఈ సమావేశాల్లో ప్రవేశపెడుతుందా లేదా అనేది ఇంకా తెలియడం లేదు. దీనిపై పంజాబ్‌లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. రాష్ట్ర బీజేపీ కూడా దీనిని వ్యతిరేకిస్తోంది. చండీఘర్‌ను తన రాజధాని నగరంగా పంజాబ్ చెప్పుకుంటోందని, ఈ బిల్లు ఆ వాదనను పూర్తిగా కనుమరుగు చేస్తుందని శిరోమణి అకాలీదళ్ మండిపడింది. ఉన్నత విద్యలో సంస్కరణలు తీసుకొచ్చేందుకు ప్రభుత్వం మరోసారి ప్రయత్నిస్తోంది. యూజీసీ, మరో రెండు రెగ్యులేటరీ సంస్థల స్థానంలో వైద్య, న్యాయ అధ్యయనాలు మినహా మిగిలిన అన్ని విభాగాలనూ పర్యవేక్షించేందుకు ఒక ఉన్నత విద్యా కమిషన్‌ను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. కాగా శీతాకాల సమావేశాల్లో ప్రభుత్వం ప్రవేశపెట్టే మరో ముఖ్యమైన బిల్లు బీమా బిల్లు. భారతీయ బీమా వెంచర్లలో దేశీయ, విదేశీ సంస్థలకు వంద శాతం యాజమాన్యం కల్పించేందుకు ఈ బిల్లును ఉద్దేశించారు. కీలకమైన బిల్లులను బుల్‌డోజ్ చేసి హడావిడిగా ఆమోదింపజేసుకునేందుకు కేంద్రం ప్రయత్నిస్తోందని ప్రతిపక్షాలు విమర్శించాయి.

ఇమ్రాన్ ఖాన్ సోదరీమణులపై పోలీసుల దాడి

- అడియాలా జైలు వెలుపల దారుణంపై దర్యాప్తుకు డిమాండ్

లాహోర్ : గత వారంలో అడియాలా జైలు వెలుపల తమపై, తమ సోదరుడు, జైల్లో వున్న పాక్ మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ మద్దతుదారులపై దారుణంగా పోలీసులు దాడి జరిపారని, దీనిపై నిష్పాక్షికంగా దర్యాప్తు జరగాలని ఆయన సోదరీమణులు ముగ్గురు డిమాండ్ చేశారు. నెల రోజులుగా తమ సోదరుడిని కలుసుకునేందుకు అనుమతినివ్వడం లేదని విమర్శిస్తూ ఖాన్ సోదరీమణులు నూరీన్ నియాజి, అలీమా ఖాన్, డాక్టర్ ఉజ్మా ఖాన్‌లు అడియాలా జైలు వెలుపల మకాం వేశారు. వారితో పాటూ పాకిస్తాన్ తెహ్రీక్ ఇ ఇన్సాఫ్ కార్యకర్తలు కూడా వున్నారు. జైలు వెలుపల వారు కూర్చుని వుండగా, పోలీసు సిబ్బంది ఒక్కసారిగా వారిపై దాడికి దిగారు. ఇమ్రాన్ ఖాన్‌తో తమకు సమావేశం ఏర్పాటు చేయాలని అడగడమే తాము చేసిన నేరమా అని పార్టీ కార్యకర్తలు ప్రశ్నిస్తున్నారు. వారు ముగ్గురు పాక్ పంజాబ్ పోలీసు చీఫ్‌కు లేఖ కూడా రాశారు. తమపై జరిగిన దాడి, హింస అంతా ఒక పథకం ప్రకారం జరిగిందేనని, ఎలాంటి కవ్వింపు చర్యలు లేకుండానే వారు దాడికి దిగారని ఆ లేఖలో విమర్శించారు. ఇమ్రాన్ ఆరోగ్య పరిస్థితులపై తమకు ఆందోళనగా వుందని, అందుకే తాము శాంతియుతంగా నిరసన తెలియచేశామన్నారు. రహదారులను దిగ్బంధించలేదు, ప్రజల రాకపోకలకు ఇబ్బంది కలిగించలేదు. ఎలాంటి చట్టవ్యతిరేక చర్యలకు దిగలేదు. అయినా తమ పట్ల అత్యంత దారుణంగా వ్యవహరించారని, ఆ ఏరియాలో వీధిలైట్లు కావాలనే తొలగించారని, తర్వాత పోలీసులు దాడులకు దిగారని నూరీన్ నియాజి ఆ లేఖలో పేర్కొన్నారు. 71ఏళ్ళ వయస్సులో తన జుట్టు పట్టుకుని లాగుతూ నేలపై పడేసి తన్నారని చెప్పారు.

కబ్జాదారు బరితెగింపు

- వరహాల గెడ్డలో మళ్లీ కంచె నిర్మాణం
- మున్సిపల్ కమిషనర్‌కి టిడిపి ముఖ్యనేత వార్నింగ్
- ఆ స్థలంలోకి ఎందుకెళ్లారని బెదిరింపు

ప్రజాశక్తి- పార్వతీపురం

పార్వతీపురం పట్టణ నడిబొడ్డున సర్వే నంబర్ 410లో ఉన్న వరహాల గెడ్డ భూమి చుట్టూ కబ్జాదారు మళ్లీ కంచె నిర్మించాడు. అధికార పార్టీ ముఖ్య నేత అండదండలు పుష్కలంగా ఉన్నాయనే ధీమాతో ఆయన దర్జాగా ప్రభుత్వ భూమిని కలిపి ఇనుప కంచె వేయడం వివాదాస్పదమవుతోంది. కొద్దిరోజుల క్రితం మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరాజు, తహశీల్దార్ సురేష్ కలిసి వరహాల గెడ్డ భూమికి హద్దులు నిర్ణయించారు. వ్యాపారి కొత్తకోట ప్రసాద్‌కు చెందిన జిరాయితీ భూమి సర్వే నంబర్ 411-9లో ఉంది. వరహాల గెడ్డ, వ్యాపారి భూమి మధ్య హద్దు నిర్ణయించి ప్రభుత్వ భూమిలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. ఇది జరిగి పక్షం రోజులు కాకముందే వరహాల గెడ్డ ప్రభుత్వ భూమిపై కన్నేసిన వ్యాపారి కొత్తకోట ప్రసాద్ మళ్లీ కంచె నిర్మించారు. అధికార పార్టీ ముఖ్యనేత అండతోనే ఈ విధంగా చేశాడని చర్చ నడుస్తోంది. కొద్దిరోజుల క్రితం తహశీల్దార్ సురేష్‌తో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరాజు కలిసి సర్వే నెంబర్ 410లో ఉన్న వరహాల గెడ్డ ఆక్రమణలను తొలగించి హద్దు నిర్ధారించారు. ఈ విషయం తెలుసుకున్న టిడిపి ముఖ్యనేత కమిషనర్ శ్రీనివాసరాజును తీవ్రంగా మందలించినట్లు తెలిసింది. ఆ స్థలంలోకి ఎవరు వెళ్లమన్నారని వార్నింగ్ ఇచ్చారనే ప్రచారం జరుగుతోంది. ఇప్పటికే వరహాల గెడ్డ భూమిని ఆ వ్యాపారి సొంత స్థలంగా చూపించి రిజిస్ట్రేషన్ చేయించారు. దీంతో, సిపిఎం సహా ప్రజాసంఘాల నాయకులు ధర్నా చేసి సబ్‌కలెక్టర్ వైశాలికి వినతిపత్రం అందజేశారు. వరహాల గెడ్డ భూమి ఆక్రమణదారులందరికీ నోటీసులు జారీ చేశామని వామపక్ష, ప్రజాసంఘాల నాయకులతో సబ్ కలెక్టర్ చెప్పారు. రిజిస్ట్రేషన్ జరగలేదని వారితో చెప్పడం చర్చనీయాంశమవుతోంది.

కంచె తొలగింపు

పార్వతీపురం పట్టణంలోని వరహాల గెడ్డ ఆక్రమిత స్థలాన్ని ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని వామపక్షాలు, ప్రజాసంఘాలు ఇప్పటికే పలు దఫాలు ఆందోళనలు చేపట్టిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో రెవెన్యూ, మున్సిపల్ యంత్రాంగం ఇటీవల వరహాల గెడ్డలో కొంత భాగంలో ఆక్రమణలు తాత్కాలికంగా తొలగించి స్వాధీనం చేసుకుంది. ఈ స్థలంలో మళ్లీ కబ్జాదారు రెండు రోజుల క్రితం కంచె ఏర్పాటు చేసి ఆక్రమించడం పట్ల వామపక్ష నేతలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వరహాలగెడ్డ ఆక్రమిత స్థలంలో అక్రమార్కులు వేసిన కంచెను బుధవారం వామపక్ష, ప్రజా సంఘాల నాయకులు తొలగించారు. ఈ సందర్భంగా జరిగిన మీడియా ప్రతినిధుల సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి కొల్లి గంగునాయుడు మాట్లాడుతూ రాజకీయ నాయకులు, ముఖ్యంగా పార్వతీపురం ఎమ్మెల్యే ప్రోద్బలంతోనే పట్టణంలో ప్రభుత్వ స్థలాలు ఆక్రమణకు గురవుతున్నాయనే ప్రచారం సాగుతోందని చెప్పారు. వరహాల గెడ్డ ఆక్రమిత స్థలాల రిజిస్ట్రేషన్ విషయంలో కోట్లాది రూపాయలు ముడుపులు చేతులు మారాయని ప్రజలు భావిస్తున్నారని, దీనికి ఎమ్మెల్యే సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రజల, ప్రభుత్వ ఆస్తులను కాపాడాల్సిన వారే అధికారులపై ఒత్తిడి తెచ్చి అక్రమార్కులకు సహకరించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. వరహాల గెడ్డ పోరంబోకు స్థలాల అక్రమ రిజిస్ట్రేషన్లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు బివి.రమణ, గొర్లి వెంకటరమణ, బి.సూరిబాబు, సిపిఐ ఎంఎల్ నాయకులు పి.రమణి, పి.సంఘం, టి.జీవ, జి.సూరయ్య, గిరిజన సంక్షేమ సంఘం నాయకులు పి.రంజిత్ కుమార్, కాంగ్రెస్ పార్టీ నాయకులు వి.దాలినాయుడు తదితరులు పాల్గొన్నారు.



ఆంధ్ర శుభారంభం

డిస్పూర్(అస్సాం): సయ్యద్ ముస్తాక్ అలీ టి20 టోర్నమెంట్‌లో ఆంధ్రప్రదేశ్ జట్టు శుభారంభం చేసింది. బుధవారం జరిగిన ఎలైట్ గ్రూప్-ఎ స్టేజ్ మ్యాచ్‌లో ఆంధ్రప్రదేశ్ జట్టు 29పరుగుల తేడాతో అస్సాంపై ఘన విజయం సాధించింది. తొలిగా బ్యాటింగ్‌కు దిగిన ఆంధ్ర నిర్ణీత 20 ఓవర్లలో 9వికెట్ల నష్టానికి 143 పరుగులు చేయగా.. అనంతరం అస్సాంను 114 పరుగులకే కట్టడి చేసింది. ఆంధ్ర జట్టులో రికీ బుయ్(45), కెవి శశికాంత్(19), పెన్మెత్స రాజు(19) పరుగులు చేశారు. అస్సాం బౌలర్ ముస్కార్ నాలుగు వికెట్లు పడగొట్టాడు. ఛేదనలో అస్సాంను ఆంధ్ర బౌలర్లు 19.4ఓవర్లలో కేవలం 114పరుగులకే ఆలౌట్ చేశారు. సత్యనారాయణకు మూడు, పృథ్వీరాజ్, స్టీఫెన్‌కు రెండేసి వికెట్లు దక్కాయి. ఇక ఎలైట్ గ్రూప్-బిలో హైదరాబాద్ జట్టు ఐదు వికెట్ల తేడాతో మధ్యప్రదేశ్‌పై విజయం సాధించింది. మధ్యప్రదేశ్ నిర్దేశించిన 145 పరుగుల లక్ష్యాన్ని హైదరాబాద్ జట్టు 18.1ఓవర్లలో కేవలం 5 వికెట్లు కోల్పోయి సునాయాసంగా ఛేదించింది. రాహుల్ బుద్ధి (59నాటౌట్), అర్ఫాజ్ అహ్మద్ హైదరాబాద్ గెలుపులో కీలకపాత్ర పోషించారు.

మళ్లీ అగ్రస్థానంలో రోహిత్ శర్మ

- ఐసిసి వన్డే ర్యాంకింగ్స్ విడుదల

దుబాయ్: టీమిండియా స్టార్ బ్యాటర్ రోహిత్ శర్మ మరోసారి ఐసిసి వన్డే ర్యాంకింగ్స్‌లో టాప్‌లోకి ఎగబాకాడు. ఐసిసి బుధవారం ప్రకటించిన బ్యాటర్ల జాబితాలో రోహిత్ శర్మ 781 రేటింగ్ పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచాడు. గతవారం టాప్‌లో నిలిచిన న్యూజిలాండ్ ఆటగాడు డారిల్ మిచెల్(766) రెండో ర్యాంక్‌కు పడిపోయాడు. వెస్టిండీస్‌తో జరిగిన మూడు వన్డేల సిరీస్‌ను న్యూజిలాండ్ 3-0తో క్లీన్‌స్వీప్ చేసింది. అయితే, చివరి రెండు వన్డేల్లో డారిల్ మిచెల్ ఆడకపోవడంతో రేటింగ్ పాయింట్లను కోల్పోయాడు.

ఇళ్ల నిర్మాణం, స్థలాల సేకరణలో తప్పు చేస్తే క్రిమినల్ చర్యలు

- కొలుసు పార్థసారధి, మంత్రి

పేదలకు ఇళ్ల నిర్మాణంలో అవకతవకలకు పాల్పడి బిల్లులు తీసుకున్న కాంట్రాక్టర్లపై క్రిమినల్ కేసులు నమోదు చేసి, రెవెన్యూ రికవరీ చట్టం కింద వసూలు చేస్తాం. ప్రజల ప్రయివేట్ భూములను ఉద్దేశపూర్వకంగా కొంత మంది అధికారులు 22ఎ జాబితాలో చేర్చారు. అటువంటి అధికారులపై చర్యలు తీసుకోవాలి. పేదల ఇళ్ల కాలనీలకు విద్యుత్, నీరు, రహదారి సదుపాయాలు కల్పించాలి.

బోర్డు తిప్పేసిన 'ఎన్ఎస్ఎన్ ఇన్ఫోటెక్'

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నిరుద్యోగులకు నాణ్యమైన శిక్షణ ఇచ్చి ఉన్నతమైన ఉద్యోగాలు కల్పిస్తామని నిరుద్యోగుల నుంచి పెద్దమొత్తంలో డబ్బులు వసూలు చేసి బోర్డు తిప్పేసింది ఓ ఐటి కంపెనీ. తెలంగాణ రాష్ట్రం మాదాపూర్ కేంద్రంగా 400 మంది నిరుద్యోగులను నిలువునా ముంచిన ఎన్ఎస్ఎన్ ఇన్ఫోటెక్ సంస్థపై బుధవారం బాధితులు మాదాపూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సిఐ కృష్ణమోహన్ తెలిపిన వివరాల ప్రకారం.. ఎన్ఎస్ఎన్ ఇన్ఫోటెక్ అనే సంస్థ హైదరాబాద్ మాదాపూర్ కేంద్రంగా ఖానామెట్ గూగుల్ ఆఫీస్ బ్యాక్ సైడ్‌లో ఆఫీస్ నిర్వహిస్తూ కొద్ది సంవత్సరాలుగా నిరుద్యోగులకు శిక్షణ ఇచ్చింది. ఒక్కొక్కరి నుంచి రూ.3లక్షల చొప్పున 400 మంది వద్ద డబ్బులు వసూలు చేసినట్టు పోలీసులకు ఫిర్యాదు అందింది. కొన్ని రోజులు కోచింగ్ ఇచ్చిన అనంతరం నకిలీ ప్రతాలు ఇచ్చి ఉద్యోగం వచ్చినట్టు నిరుద్యోగులను నిర్వాహకులు నమ్మించారు. వర్క్ ఫ్రమ్ హోంగా చెప్తూ బాధితుల నుంచి ఎలాంటి సమస్య రాకుండా కొంతకాలం నడిపారు. అయితే జీతం పడకపోవడంతో నిలదీయడంతో చేతులెత్తేశారు. దాంతో బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ సంస్థ ఎండి స్వామినాయుడు, ఇతరులపై కేసు నమోదైంది. కేసు దర్యాప్తులో ఉంది.

వెలిగల్లు ఎత్తిపోతలకు కదలిక

- రూ.125 కోట్లతో ప్రతిపాదనలు
- 33 చెరువులకు జలకళ

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

ఎట్టకేలకు వెలిగల్లు ఎత్తిపోతల పనులకు కదలిక వచ్చింది. వైసిపి సర్కారు హయాంలో కాంట్రాక్టు బిల్లుల చెల్లింపుల ఆలస్యం నేపథ్యంలో రూ.100 కోట్ల విలువ కలిగిన వెలిగల్లు ఎత్తిపోతల పథకం పనులు కాంట్రాక్టు దక్కించుకున్న సంస్థ చేతులెత్తేసిన సంగతి తెలిసిందే. టిడిపి కూటమి సర్కారు ఎత్తిపోతల పథకం పనులపై దృష్టి సారించింది. సుమారు 12 కిలోమీటర్ల మేర మట్టి పనులు, పైపులు, విద్యుత్ సబ్‌స్టేషన్లు నిర్మించాల్సి ఉంది. పెరిగిన ఖర్చుల నేపథ్యంలో తాజా ఎస్ఎస్ఆర్ రేట్ల ప్రకారం రూ.125 కోట్లతో కూడిన ప్రతిపాదనలు ప్రభుత్వానికి అందజేయనుంది. ప్రభుత్వ ఆమోదం లభించిన అనంతరం వెలిగల్లు ఎత్తిపోతల పనులు చేపట్టడానికి కసరత్తు చేస్తోంది. వెలిగల్లు ఎత్తిపోతల పథకం కింద సుమారు 15 వేల ఎకరాల ఆయకట్టుకు సాగు నీరందించే అవకాశాలు ఉంది. రాయచోటి, గాలివీడు మండలాల పరిధిలోని 33 చెరువులు జలకళను సంతరించుకోనున్నాయి. రాయచోటి, గాలివీడు మండలాల పరిధిలోని చెరువులు నింపడం ద్వారా భూగర్భజలాలు పెరగడం ద్వారా సుమారు పది వేల మందికి తాగునీటి సదుపాయాన్ని అందించే అవకాశం ఉంది.



విద్యార్థులతో మాట్లాడుతున్న ఐషి ఘోష్

విద్యార్థుల మృతిపై ప్రభుత్వ తీరు దారుణం

- వెంటనే ఆశ్రమ పాఠశాలల్లో ఎఎన్ఎంలను నియమించాలి
- ఎస్ఎఫ్ఐ సహాయ కార్యదర్శి ఐషీ ఘోష్

ప్రజాశక్తి- కురుపాం, గుమ్మలక్ష్మీపురం (పార్వతీపురం మన్యం జిల్లా)

గిరిజన విద్యార్థుల మరణాలపై ప్రభుత్వం కనీసం స్పందించకపోవడం దారుణమని ఎస్ఎఫ్ఐ జాతీయ సహాయ కార్యదర్శి ఐషీ ఘోష్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్వతీపురం మన్యం జిల్లా కురుపాం, గుమ్మలక్ష్మీపురం మండలాల్లో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు పి.రామ్మోహన్‌తో కలిసి బుధవారం ఆమె పర్యటించారు. కురుపాం గిరిజన గురుకుల పాఠశాలను సందర్శించారు. మౌలిక వసతులు, భద్రతా చర్యలను పరిశీలించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులతో మాట్లాడి విద్యార్థుల మృతికి కారణాలపై ఆరా తీశారు. గురుకులంలో పదో తరగతి విద్యార్థినులు అంజలి, కల్పన మృతిపై విచారం వ్యక్తం చేశారు. అనంతరం భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులకు రాజ్యాంగం ఆవశ్యకత, ప్రజాస్వామ్యంలో యువత పాత్రపై అవగాహన కల్పించారు. విద్యార్థుల స్వగ్రామాలైన దండుసుర, కంబగూడ వెళ్లి వారి తల్లిదండ్రులతో మాట్లాడి మృతికి కారణాలను తెలుసుకున్నారు.

విద్యార్థులతో ర్యాలీ

జిల్లాలో ఉన్న ఆశ్రమ పాఠశాలలు, వసతిగృహాల్లో ఆరోగ్యం కార్యకర్తలను నియమించి, విద్యార్థులకు స్థానికంగా వైద్య సేవలు అందించాలని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థులు గుణుపూర్ కూడలి నుంచి గుమ్మలక్ష్మీపురం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎంపిడిఒ కార్యాలయం వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహానికి ఐషీ ఘోష్ పూలమాల వేసి నివాళులర్పించారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు సరైన వసతులు, తాగునీరు లేకపోవడంతో చనిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మరణించిన విద్యార్థులకు ఎక్స్‌గ్రేషియో ప్రకటించాలని, ఆశ్రమ పాఠశాలల్లో ఆరోగ్య కార్యకర్తలను నియమించాలని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారానికి పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు బి. అనిల్, నాయకులు ఎ.గంగారావు, ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఎం.శ్రీనివాసరావు, నాయకులు పి.తిరుపతిరావు, కె.సీతారాం తదితరులు పాల్గొన్నారు.

అమరావతిపై పార్లమెంట్‌లో చట్టం

సిపిఎం బైక్ ర్యాలీలో రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు డిమాండ్

ప్రజాశక్తి- తాడేపల్లి, తుళ్లూరు

ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి అని పార్లమెంట్‌లో సమగ్ర చట్టం చేయాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్ బాబూరావు డిమాండ్ చేశారు. రాజధాని నిర్మాణానికి నిధులతోపాటు కేంద్ర కార్యాలయాలన్నింటినీ కేంద్ర ప్రభుత్వమే నిర్మించాలని, విభజన చట్టంలోని హామీలను అమలు చేయాలని కోరారు. అమరావతిలో పలు బ్యాంకుల నిర్మాణానికి కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ శుక్రవారం శంకుస్థాపన చేయనున్న నేపథ్యంలో రాజధాని అంశాలపై సిపిఎం ఆధ్వర్యంలో బుధవారం బైక్ ర్యాలీ చేపట్టారు. గుంటూరు జిల్లా తాడేపల్లిలోని ఉండవల్లి సెంటర్ నుండి తుళ్లూరు మండలం రాయపూడిలోని సిఆర్‌డిఎ కార్యాలయం వరకు ర్యాలీ చేశారు. ఈ ర్యాలీని ఉండవల్లిలో బాబూరావు ప్రారంభించి మాట్లాడారు. కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు రెండూ అమరావతి గురించి పట్టించుకోకపోవడంతో రాజధాని దిక్కులేనిదిగా తయారైందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటి వరకు కేంద్ర ప్రభుత్వం రూ.1100 కోట్లే ఇచ్చిందని, రూ.1500 కోట్ల అప్పును గ్రాంట్‌గా మార్చాలని డిమాండ్ చేశారు. అమరావతే ఏకైక రాజధాని అని డిసెంబర్‌లో జరిగే పార్లమెంట్ సమావేశాల్లో చట్టం చేసి గెజిట్‌లో ప్రకటిస్తామని నిర్మలా సీతారామన్ స్పష్టం చేయాలని కోరారు. ర్యాలీ అనంతరం పలు అంశాలపై సిఆర్‌డిఎ కమిషనర్ కె.కన్నబాబు, మున్సిపల్ శాఖ కార్యాలయంలో అర్జీలు అందజేశారు. సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి వై.నేతాజీ, రాజధాని డివిజన్ కార్యదర్శి ఎం.రవి, నాయకులు బి.వెంకటేశ్వరరావు, ఎం.భాగ్యరాజు, వి.దుర్గారావు పాల్గొన్నారు.



బైక్ ర్యాలీలో సిహెచ్ బాబూరావు, ఇతర నాయకులు

విఆర్‌ఒలపై 'రియల్' వ్యాపారి దాడి

ప్రజాశక్తి - పలాస

పలాస తహశీల్దార్ కార్యాలయ పరిధిలో విధులు నిర్వహిస్తున్న కంబిరిగాం, లక్ష్మీపురం, చినంచల విఆర్‌ఒలు వెంకటరావు, వెంకటరమణ, చంద్రమోహన్‌పై రియల్ ఎస్టేట్ వ్యాపారి కోరాడ కోరాడ శ్రీనివాస్ బుధవారం దాడి చేశారు. దాడి అనంతరం తహశీల్దార్ కార్యాలయానికి వచ్చిన శ్రీను అక్కడ గందరగోళం సృష్టించాడు. విఆర్‌ఒలు తెలిపిన వివరాల ప్రకారం... కంబిరిగాం వద్ద రియల్ ఎస్టేట్‌కు భూములు కొన్నాడు. కంకరను తవ్వి రియల్ ఎస్టేట్ భూముల్లో వేయడం, ఆక్రమణలపై ఒక వ్యక్తి ప్రజా ఫిర్యాదుల విభాగంలో ఫిర్యాదు చేశాడు. దీనిపై మైన్స్, రెవెన్యూ అధికారులు బుధవారం ఆ భూములను పరిశీలించి కొలతలు వేశారు. ఇందుకు సంబంధించిన నోటీసును శ్రీనివాస్‌కు అందజేసేందుకు వెళ్లిన సమయంలో దాడికి పాల్పడ్డాడని విఆర్‌ఒలు తెలిపారు. దాడి అనంతరం తహశీల్దార్ కార్యాలయానికి వచ్చిన శ్రీనివాస్ అక్కడ చిందులు వేశాడు. తాను ఇంట్లోలేని సమయంలో నోటీసు అందజేయడానికి వచ్చిన విఆర్‌ఒలు తన భార్య పావనికి దురుసుగా ప్రవర్తించారని ఆరోపించాడు. ఈ ఘటనపై విఆర్‌ఒల సంఘం ఫిర్యాదు మేరకు విఆర్‌ఒలు శ్రీనివాస్‌పై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదుపై పోలీసులు చర్యలు తీసుకోకపోతే జిల్లాస్థాయిలో ఆందోళన చేపడతామని విఆర్‌ఒల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొర్ల శ్రావణ్ కుమార్, నాయకులు సంతోష్ హెచ్చరించారు.

కలుషిత ఆహారం తిని 20 మందికి అస్వస్థత

ప్రజాశక్తి - ఓబుళదేవరచెరువు

ఓబులదేవర చెరువు మండల పరిధిలోని బత్తినిపల్లిలో ఓ శుభకార్యంలో పాల్గొన్న వారు కలుషిత ఆహారం తిని అస్వస్థతకు గురయ్యారు. 20 మందికి విరేచనాలు అయ్యాయి. వారిలో ఆందోళనకరంగా ఉన్న ఏడుగురుని ఓడిచెరువు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మిగతా వారికి అక్కడే డాక్టర్ భాను ప్రకాష్ వైద్యం నిర్వహించారు. విషయం తెలుసుకున్న డిప్యూటీ డిఎంహెచ్ఒ సునీల్, డిపిఎమ్ఒ నాగేంద్ర నాయక్, బాధితులు వారి ఆరోగ్య పరిస్థితి పరీక్షించారు. సమాచారాన్ని తెలుసుకున్న పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర వైద్యులతో ఫోన్లో మాట్లాడారు. బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కమల్ రోహిత్, బాలాజీ నాయక్, సిబ్బంది పాల్గొన్నారు.

ధాన్యాన్ని పరిశీలిస్తున్న మంత్రి నాదెండ్ల మనోహర్



ధాన్యం ఏ మిల్లుకు తోలుతున్నారో చెప్పడం లేదు

- ధాన్యం సేకరణలో సమస్యలపై మంత్రి మనోహర్ ఎదుట వాపోయిన రైతులు
- రైతులు కోరిన మిల్లులకే ధాన్యం తోలాలి: మంత్రి నాదెండ్ల మనోహర్

ప్రజాశక్తి - ఉంగుటూరు

ధాన్యం సేకరణ లో రైతులకు ఎలాంటి ఇబ్బందులూ కలగకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంటే క్షేత్రస్థాయిలో ఇంకా లోపాలు, సమస్యలు కనిపిస్తున్నాయని రాష్ట్ర పౌరసరఫరాల శాఖామంత్రి నాదెండ్ల మనోహర్ అసహనం వ్యక్తం చేశారు. బుధవారం ఆయన ఉంగుటూరు చేబ్రోలు, నారాయణపురంలో ధాన్యం రాశుల వద్ద రైతులతో ఎంఎల్ఎ పత్సమట్ల ధర్మరాజు, ఆప్కాబ్ ఛైర్మన్ గన్ని వీరాంజనేయులతో కలిసి ముచ్చటించారు. ఈ సందర్భంగా ధాన్యం సేకరణలో సమస్యలను రైతులను అడిగి తెలుసుకున్నారు. చేబ్రోలుకు చెందిన ఓ రైతు మాట్లా డుతూ తనకు చేబ్రోలు ఆర్ఎస్‌కె-1, 2లో పొలం ఉందని, వేర్వేరుగా ఇకెవైసిలు చేయించామని తెలిపారు. రెండు ఆర్ఎస్‌కెల్లో ధాన్యాన్ని ఒకే లారీలో తోలమంటే సిబ్బంది ఇబ్బంది పెడుతున్నారని మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై మంత్రి వ్యవసాయ శాఖాధికారులు, ఆర్ఎస్‌కె సిబ్బందిని ప్రశ్నిస్తూ రైతులకు ఎలాంటి ఇబ్బందుల్లేకుండా ధాన్యం సేకరించాల్సిన కార్యాచరణపై సూచనలిచ్చారు. రైతుల నుంచి సేకరించిన ధాన్యాన్ని ఏ మిల్లుకు తోలుతున్నారో తమకు చెప్పడం లేదని, అయితే ధాన్యం తోలిన 24 గంటల్లోపే సొమ్ము జమవుతుందని చెప్పారు. రైతులు నచ్చిన మిల్లుకే ధాన్యాన్ని తోలుకునే వెసులుబాటు ఉందని, దాన్ని సద్వినియోగం చేసుకోవాలని మంత్రి తెలిపారు. ధాన్యం ఏ మిల్లుకు తోలుతున్నారో రైతులకు సమాచారం ఎందుకు ఇవ్వడం లేదని మంత్రి వ్యవసాయ శాఖాధికారులను నిలదీశారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్యాడీ అండ్ ప్రొక్యూర్‌మెంట్ విధానాన్ని రూపొందిస్తే క్షేత్రస్థాయిలో ఇంకా లోపాలుంటున్నాయని, అధికారులు ఏం చేస్తున్నారని ఒకింత అసహనం వ్యక్తం చేశారు. దీనిపై పరిశీలించాలని జాయింట్ కలెక్టర్ అభిషేక్‌గౌడను మంత్రి ఆదేశించారు.

నారాయణపురం ఆర్ఎస్‌కెలో ధాన్యం లారీలో లోడు చేసిన 48 గంటల వరకూ మిల్లులకు పంపలేదని రైతు అక్కిన వెంకటేశ్వరావు మంత్రికి ఫిర్యాదు చేశారు. సర్వర్ సమస్య కారణంగా ఆలస్యమైందని ఎఒ ప్రవీణ్‌కుమార్ వివరించారు. తుపాను కారణంగా రైతులు తమ ధాన్యం నిల్వ చేసుకునేందుకు ప్రభుత్వ స్థలాలు, ప్రాంగణాలను వినియోగించుకోవాలని మంత్రి సూచించారు. ధాన్యం సేకరణలో టార్గెట్లు విధిస్తున్నారని, దీంతో రైతులు నష్టపోయే అవకాశం ఉందని నారాయణపురం సొసైటీ అధ్యక్షుడు కడియాల రవిశంకర్ మంత్రికి వివరించారు. ఉంగుటూరు, నాచుగుంట ఆర్ఎస్‌కెలకు టార్గెట్లు లేకుండా సేకరించాలని అధికారులను మంత్రి ఆదేశించారు.

జోగి రమేష్ అనుచరుల అక్రమాలు

- టిడిపి గ్రీవెన్స్‌లో ఫిర్యాదు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

మాజీ మంత్రి జోగి రమేష్ అనుచరుల అక్రమాలకు పాల్పడుతున్నారంటూ మంగళగిరి టిడిపి కార్యాలయంలో బుధవారం నిర్వహించిన ప్రజా వినతుల స్వీకరణ కార్యక్రమంలో ఫిర్యాదులు అందాయి. ఇబ్రహీంపట్నానికి చెందిన ఎస్‌కె సుభాని అలియాస్ సోన అనే జోగి రమేష్ అనుచరుడు తనను ఆర్థిక మోసం చేసి చంపేస్తామని బెదిరిస్తున్నారని ఎన్‌టిఆర్ జిల్లా, విజయవాడకు చెందిన వేముల సత్యవాసవి ఫిర్యాదులో పేర్కొన్నారు. 2022లో స్నాప్టికా ఫొటోగ్రఫీ పేరుతో ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయం ఏర్పడగా, తాను ఒంటరిగా స్టాఫ్ జీతాల కోసం అవసరమని 460 గ్రాముల బంగారాన్ని రూ.14 లక్షలకు తాకట్టు పెట్టించి మరో వైపు ఇంటి అమ్మకం ద్వారా వచ్చిన రూ.38 లక్షలు తీసుకుని జోగి రమేష్ అనుచరులు అకౌంట్లకు పంపేలా ఒత్తిడి తెచ్చారని ఆమె ఫిర్యాదులో పేర్కొన్నారు. తర్వాత 467 చదరపు అడుగుల్లో ఉన్న స్థలాన్ని తాను పంపిన డబ్బుతోనే కొనుగోలు చేసినట్లు చూపుతూ తన వ్యక్తిగత అకౌంట్‌కే తిరిగి డబ్బు పంపించి విక్రయ నగదుగా భావించి రిజిస్ట్రేషన్ పూర్తి చేశారన్నారు. తమకు న్యాయం చేయాలని టిడిపి రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావుకు విజ్ఞప్తి చేశారు.


పోర్ట్ బ్లెయిర్‌లో నిరసన ప్రదర్శనలో మహిళా కార్మికులు, ఉద్యోగులు


మధ్యప్రదేశ్‌లోని భోపాల్‌లో జరిగిన ఆందోళన

లేబర్ కోడ్‌లపై శ్రామికాగ్రహం

దేశవ్యాప్తంగా 500లకు పైగా జిల్లాల్లో ఆందోళనలు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

దేశంలో కార్మికులు శ్రమను దోపిడి చేసేందుకు కేంద్రంలోని మోడీ ప్రభుత్వం అమల్లోకి తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్లపై కార్మిక, కర్షక లోకం భగ్గుమంది. ఈ కోడ్లకు వ్యతిరేకంగా దేశంలోని పది కేంద్ర కార్మిక సంఘాలు, సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కెఎం) పిలుపులో భాగంగా బుధవారం దేశవ్యాప్తంగా 500లకు పైగా జిల్లాల్లో భారీ ఆందోళనలు జరిగాయి. కాశ్మీర్ నుంచి కన్యకుమారి వరకు అన్ని రాష్ట్రాల్లో నిరసనలు హోరెత్తాయి. ప్రజాస్వామ్యబద్ధంగా ఆందోళన చేస్తోన్న కార్మికులు, రైతులపై బిజెపి పాలిత రాష్ట్రాల్లో నిర్బంధం విధించారు. అరెస్టుల పర్వం, దాడులు వంటి చర్యలకు పూనుకున్నారు. ఈ అణచివేత చర్యలను అధిగమించి కార్మికులు, కర్షకులు కదంతొక్కారు. వారి నినాదాలతో ఆందోళన ప్రాంతాలు దద్దరిల్లాయి. మొద్దు నిద్రలో ఉన్న మోడీ సర్కార్‌కు వినబడేలా తమ గొంతెలను హోరెత్తించారు. ప్రభుత్వం, ప్రభుత్వ రంగ సంస్థలు, పారిశ్రామిక ప్రాంతాల్లో ఈ ఆందోళనలు జరిగాయి. రాష్ట్ర స్థాయి నుంచి మండల, గ్రామ స్థాయి వరకు నిరసనలు జరిగాయి. అసంఘటిత రంగ కార్మికులు, వ్యవసాయ కార్మికులు, రైతులు, సాధారణ ప్రజల నుండి భారీ స్పందన లభించింది. అనేక రాష్ట్రాల్లో విద్యార్థులు, యువత భాగస్వామ్యం అయ్యారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు, కేరళ, ఒరిస్సా, రాజస్థాన్, పంజాబ్, హర్యానా, మధ్యప్రదేశ్, త్రిపుర, పశ్చిమ బెంగాల్, మహారాష్ట్ర, గుజరాత్, ఉత్తరాఖండ్, ఉత్తరప్రదేశ్, హిమాచల్ ప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, బీహార్, అస్సాం, జార్ఖండ్ తదితర రాష్ట్రాలు, ఢిల్లీ, జమ్మూకాశ్మీర్, పుదుచ్చేరి, అండమాన్ నికోబార్ దీవులు తదితర కేంద్ర పాలిత ప్రాంతాల్లో ఆందోళన జరిగాయి. పంజాబ్ లో జరిగిన ఆందోళనలో సిఐటియు అఖిల భారత అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.హేమలత, తపన్ సన్ తదితరులు పాల్గొన్నారు. ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద జరిగిన ఆందోళనలో కార్మిక, రైతు సంఘాల జాతీయ నాయకులు పాల్గొన్నారు. వివిధ ప్రాంతాల్లో స్థానిక అధికారులకు వినతి పత్రాలు సమర్పించారు. నార్త్ త్రిపుర జిల్లాలో బిజెపి గూండాలు కార్మిక, రైతు ప్రదర్శనపై దాడి చేయడాన్నికార్మిక సంఘాలు, ఎస్‌కెఎం తీవ్రంగా ఖండించాయి. సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షుడు అమితవ దత్తా, ఎఐకెఎస్ రాష్ట్ర కార్యదర్శి సభ్యుడు రతన్ రాయ్, మరో ఏడుగురు కార్యకర్తలపై దాడి జరిగింది. నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదల, పెరుగుతున్న నిరుద్యోగం, పెరుగుతున్న అసమానతలు, పెరిగిన క్యాజువల్ కార్మికులు, నిరుద్యోగ యువత ఆత్మహత్యలకు వ్యతిరేకంగా గొంతెత్తారు. దేశంలోని రెండు ఉత్పత్తి శక్తులైన కార్మికులు, రైతులు ఒకరికొకరు తమ సంఘీభావ మద్దతును బలోపేతం చేసుకోవడంతో పాటు ఐక్య పోరాటాలను బలోపేతం చేశారు. మోడీ ప్రభుత్వం గత పదేళ్లుగా ఇండియన్ లేబర్ కాన్ఫరెన్స్‌ను నిర్వహించడం లేదని, అంతర్జాతీయ కార్మిక ప్రమాణాలను ఉల్లంఘిస్తోందని కార్మిక నేతలు విమర్శించారు. కార్మిక ప్రయోజనాలకు విరుద్ధంగా నిర్ణయాలు తీసుకుంటుందని, యజమానులకు అనుకూలంగా నాలుగు కార్మిక కోడ్‌లను అకస్మాత్తుగా నోటిఫై చేసిందని ధ్వజమెత్తారు. ఈ కోడ్‌లు సమ్మె చేసే హక్కును నిరాకరిస్తాయని, యూనియన్ రిజిస్ట్రేషన్‌ను క్లిష్టతరం చేస్తాయని, యూనియన్ల గుర్తింపును రద్దు చేయడం సులభం చేస్తాయని పేర్కొన్నారు. లేబర్ కోర్టులను రద్దు చేస్తాయని, ట్రిబ్యునల్‌ను ప్రవేశపెడతాయని విమర్శించారు. ప్రతి కార్మికుడి భద్రతా హక్కును, కార్మికుల ఇతర హక్కులను పూర్తిగా ప్రమాదంలో పడేసేలా రూపొందించారని విమర్శించారు. యజమానులకు అవసరమైన వన్నీ సులభతరం చేయడానికి ఫెసిలిటేటర్‌లను తీసుకువస్తున్నారని దుయ్యబట్టారు.

కార్మిక చట్టాల పరిధి నుండి 70 శాతం పరిశ్రమలను ఈ కోడ్లు బయటకు నెట్టివేస్తాయని అన్నారు. యజమానులకు విస్తృత అధికారాలను ఇస్తున్నాయని విమర్శించారు. కార్మిక చట్ట రక్షణ లేదని, అపరిమిత అప్రెంటిస్‌షిప్ దోపిడీకి మరొక మార్గమని తెలిపారు. యజమానుల ఉల్లంఘనలను నేరరహితం చేస్తున్నారని, ట్రేడ్ యూనియన్ నాయకులను నేరస్థులుగా చేయడం జరుగుతోందని ధ్వజమెత్తారు. అన్ని ప్రభుత్వ విభాగాలు, ప్రభుత్వ రంగ సంస్థల్లో ఖాళీగా ఉన్న మంజూరు చేయబడిన పోస్టులను వెంటనే నియామకాలు చేపట్టాలని, పరిశ్రమలు, సేవల రంగాల్లో మరిన్ని ఉద్యోగాలను సృష్టించాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ కార్మికుల వేతనాలు పెంచాలని, పట్టణ ప్రాంతాలకు ఇలాంటి చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు.

మోడీ ప్రభుత్వం అధికారంలో కొనసాగడానికి మత ద్వేష, విభజన రాజకీయాలను ఉపయోగిస్తోందని ధ్వజమెత్తారు. శ్రామిక ప్రజలు, సామాన్య ప్రజలు ద్వేషపూరిత రాజకీయాలను తిరస్కరించాలని, వారి రోజువారీ జీవిత సమస్యలు, నాణ్యమైన ఉచిత విద్య, ఆరోగ్యం, నివాసం, స్వచ్ఛమైన తాగునీరు, పారిశుధ్యం, ఉపాధి, మంచి వేతనాలు, సామాజిక భద్రత, వృద్ధాప్య భద్రత వంటి ప్రయోజనాలను కాపాడుకోవడానికి ఉద్యమాలను బలోపేతం చేయాలని పిలుపు ఇచ్చారు. కార్పొరేట్ దోపిడీని ఆపడానికి, ప్రజలు, దేశ ప్రయోజనాల కోసం ప్రభుత్వ రంగం/ప్రజా సేవలు, జల్-జంగిల్-జమీన్ వంటి జాతీయ ఆస్తులుగా కాపాడుకోవడానికి ప్రజలు ఉద్యమాలను బలోపేతం చేయాలని పిలుపు ఇచ్చారు. దేశవ్యాప్తంగా నిరసనను విజయవంతం చేసిన లక్షలాది మంది కార్యకర్తలను కేంద్ర కార్మిక సంఘాలు, సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కెఎం) నేతలు అభినందించారు. ఇది కార్మిక వ్యతిరేక, రైతు వ్యతిరేక మోడీ ప్రభుత్వానికి హెచ్చరిక అని, తమ డిమాండ్లపై తక్షణ చర్య తీసుకోకపోతే భవిష్యత్తులో దేశవ్యాప్త పోరాటాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.



గుజరాత్‌లోని గాంధీనగర్‌లో గళమెత్తిన కార్మికులు



ఒడిషా రాజధాని భువనేశ్వర్‌లో ప్రధాని రహదారిపై ఆందోళన



ఘనంగా రాజ్యాంగ దినోత్సవం

న్యూఢిల్లీ : బుధవారం దేశవ్యాప్తంగా జాతీయ రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. దేశ రాజ్యాంగాన్ని ఆమోదించిన తేదీకి గుర్తుగా ప్రతీ ఏడాది నవంబరు 26న 'జాతీయ రాజ్యాంగ దినోత్సవం'గా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా బుధవారం సంవిధాన్ సదన్ (పాత పార్లమెంటు భవనం)లోని చారిత్రక సెంట్రల్ హాల్‌లో ఈ వార్షికోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్రపతి ద్రౌపదీ ముర్మ అధ్యక్షత వహించారు. ఉప రాష్ట్రపతి సిపి రాధాకృష్ణన్, ప్రధానమంత్రి మోడీ, లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, ఉభయసభల్లో ప్రతిపక్ష నేతలు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ తదితరులు ఈ వేడుకలో పాల్గొన్నారు. రాజ్యాంగ ప్రవేశిక సామూహిక పఠనాన్ని చేపట్టారు. తెలుగు, మలయాళం, మరాఠీ, నేపాలీ, పంజాబీ, బోడో, కశ్మీరీ, ఒడియా, అస్సామీ భాషల్లోకి అనువదించిన రాజ్యాంగ ప్రతులను విడుదల చేశారు. ఈసందర్భంగా రాష్ట్రపతి మాట్లాడారు. స్వాతంత్ర్యం అనంతరం వివిధ ప్రభుత్వాలు తీసుకున్న చర్యల గురించి ప్రస్తావించారు.

మద్యం కేసు విచారణ
ముగురు నిందితులకు 'సుప్రీం' మినహాయింపు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

మద్యం కేసులో లొంగిపోవాలని హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వుల నుంచి ముగ్గురు నిందితులకు సుప్రీం కోర్టు మినహాయింపు ఇచ్చింది. పది రోజుల్లో కౌంటర్ దాఖలు చేయాలని ఏపి ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఆ తరువాత ఐదు రోజుల్లో రిజాయిండర్ ఫైల్ చేయాలని నిందితులను ఆదేశించింది. మద్యం కేసులో డిఫాల్ట్ బెయిల్ రద్దు చేస్తూ ఇటీవల ఎపి హైకోర్టు ఉత్తర్వులు ఇచ్చింది. ఈ ఉత్తర్వులను నిందితులు బాలాజీ గోవిందప్ప, కృష్ణ మోహన్‌రెడ్డి, ధనుంజయ్‌రెడ్డిలు సుప్రీంకోర్టులో సవాలు చేశారు. ఈ ముగ్గురూ దాఖలు చేసిన వేర్వేరు పిటిషన్లను ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ ధర్మాసనం బుధవారం విచారణ జరిపింది. డిఫాల్ట్ బెయిల్ వ్యవహారంపై చర్చ జరగాల్సి ఉందని సిజెఐ అభిప్రాయం వ్యక్తం చేశారు.

అరటికి గిట్టుబాటు ధర కల్పించాలి

(మొదటి పేజీ తరువాయి)

తీసుకురాకపోవడం దారుణమన్నారు. ఎరువులను కూడా బ్లాక్‌లోకొనే పరిస్థితి రైతుకు తెచ్చిందని విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 18 నెలల్లో 16 సార్లు విపత్తులు వచ్చాయని, నష్టపోయిన రైతులకు పరిహారం అందలేదని అన్నారు. వైసిపి ప్రభుత్వంలో 84 లక్షల మందికి ఉచిత పంటల బీమా అమలు చేశామని తెలిపారు. కూటమి ప్రభుత్వం ఈ పథకాన్ని ఎత్తివేసిందని, రైతులే స్వచ్ఛందంగా బీమా చెల్లించాల్సి వస్తోందని, దీంతో, ఈ సంఖ్య 18 లక్షలకే పరిమితమైందని వివరించారు. పంటలకు ఇ-క్రాప్ చేసే పరిస్థితి కూడా లేదన్నారు. తమ ప్రభుత్వంలో రైతులకు ఏటా పెట్టుబడి సాయం అందించేవారమని, ఈ ప్రభుత్వం దీనిని అమలు చేయలేదని వివరించారు. వైసిపి ప్రభుత్వంలో అరటి పంటను అనంతపురం, తాడపత్రి నుంచి ఢిల్లీ, ముంబయి తదితర రాష్ట్రాలకు ఎగుమతులు చేశామని, గిట్టుబాటు ధర కల్పించామని అన్నారు. గతంలో అరటి పంటకు టన్ను రూ.30 వేలు వచ్చేదని, ప్రస్తుతం రూ.2 వేలు కూడా అడిగేవారు లేరని తెలిపారు. రైతులను ఆదుకోవడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో కడప ఎంపి వైఎస్ అవినాష్ రెడ్డి, వైసిపి ప్రధాన కార్యదర్శి ఎస్‌వి సతీష్ కుమార్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, వైస్ చైర్మన్ హఫీజ్, వైసిపి నాయకులు బలరాంరెడ్డి, కౌన్సిలర్లు కోడి రమణ, మహేశ్వర్ రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

సోషలిజంతోనే సమానత్వం

(మొదటి పేజీ తరువాయి)

గూడులేని వారు అక్కడా ఇప్పటికీ పది శాతం మందిపైగా ఉన్నారని తెలిపారు. ఈ సమస్యలను పరిష్కరించి ప్రత్యామ్నాయం చూపుతానని ముందుకొచ్చినందుకే ఆ దేశంలోని న్యూయార్క్ నగర మేయర్‌గా సోషలిస్టు మమ్దానీని ప్రజలు ఎన్నుకున్నారని, ఆయనను గెలవనీయకూడదని కార్పొరేట్లు, పెట్టుబడుదారులు చేసిన ప్రయత్నాలు ఫలించలేదని వివరించారు. మనదేశంలోనూ అసమానతలు, దోపిడీలేని సోషలిస్టు నిర్మాణం జరగాలని అనేక ఏళ్లుగా ఆకాంక్షిస్తున్నామన్నారు. దీనిని నిజం చేసుకోవాలంటే పేదలంతా ఐక్యమై పోరాడాల్సిన అవసరముందని పిలుపునిచ్చారు. నిరుద్యోగ సమస్యల పరిష్కారం కావాలన్నా, నాణ్యమైన విద్య, ఉపాధి అవకాశాలు కలగాలన్నా సోషలిజం ఒక్కటే మార్గమని వివరించారు.

సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.రాంభూపాల్ మాట్లాడుతూ దేశంలో ప్రజాసమస్యలను పాలకులు పట్టించుకునే పరిస్థితుల్లో లేరన్నారు. కార్పొరేట్ కంపెనీలకు ప్రజాసంపదను దోచిపెట్టే పనిలో నిమగ్నమయ్యారని వివరించారు. ప్రధాన మంత్రికి అత్యంత సన్నిహితమిత్రుడైన గౌతమ్ అదాని 2014కు ముందు వరకు దేశంలో వంద మంది సంపన్నుల జాబితాలో కూడా లేరని గుర్తు చేశారు. బిజెపి అధికారంలోకి వచ్చిన ఈ 11 సంవత్సరాల్లో ఆయన ప్రపంచంలోనే అత్యంత పదిమంది సంపన్నుల జాబితాలో చేరిపోయారని తెలిపారు. విమానాశ్రయాలు, ఓడరేవులతోపాటు, గనులు ఇలా పెద్ద ఎత్తున ప్రజా సంపదను అదానికి దోచిపెట్టారని వివరించారు. మరోవైపు తినడానికి తిండిలేని, గూడులేని సామాన్యులు తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారన్నారు. రాష్ట్రంలోనూ పెద్ద ఎత్తున భూ దోపిడీ జరుగుతోందని విమర్శించారు. వెనుకబడిన ఉత్తరాంధ్ర, రాయలసీమ జిల్లాల్లో పది లక్షల ఎకరాల భూమిని కార్పొరేట్ కంపెనీలకు దోచిపెట్టేందుకు ఈ ప్రభుత్వం సిద్ధమైందని తెలిపారు. పంటలకు గిట్టుబాటు ధర రాక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. సమస్యలు పరిష్కారం కావాలంటే పాలకులు మారితే సరిపోదని, ప్రభుత్వ విధానాలు మారాల్సిన అవసరముందని తెలిపారు. సిపిఎం జిల్లా కార్యదర్శి ఒ.నల్లప్ప, రాష్ట్ర నాయకులు జి.ఓబుళు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బాలరంగయ్య, నాగేంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.

లేబర్‌కోడ్‌లు రద్దు చేయండి

(మొదటి పేజీ తరువాయి)

పోరాటాలు నిరంతరం చేసి ప్రభుత్వం మెడలు వంచాలని పిలుపునిచ్చారు. రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు జి.ఈశ్వరయ్య మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నూతన విత్తన చట్టం ముసాయిదాను ప్రవేశపెట్టిందని, నూతన మార్కెట్ విధానం అమలు చేస్తుందన్నారు. ఈ విధానాలు రైతుల పాలిట ఉరితాళ్లుగా మారతాయని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులను ప్రోత్సహిస్తూ సబ్సిడీలు ఇవ్వాలని, అన్ని పంటలకు కనీసం మద్దతు ధర ప్రకటించాలని డిమాండ్ చేశారు. రైతులు, కౌలు రైతులు, వ్యవసాయ కూలీలు, చేతివృత్తిదారులు, మహిళల రుణాలు రద్దు చేయాలని కోరారు. ఎపి రైతు సంఘం సీనియర్ నాయకులు వై.కేశవరావు మాట్లాడుతూ.. రైతులకు మేలు చేయని ఏ ప్రభుత్వం ఎంతోకాలం మనుగడ సాగించలేదని పేర్కొన్నారు. ఇటీవల కాలంలో అతివృష్టి, అనావృష్టి, వరదలు, తుపానులు, పకృతి వైపరిత్యాలు కారణంగా నష్టపోయిన రైతాంగాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. రైతుల రుణాలను ఈ ఏడాది మాఫీ చేయాలని కోరారు. బలవంతపు భూసేకరణ ఆపాలని డిమాండ్ చేశారు. సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు ఎ.వి నాగేశ్వరరావు, ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి ఎస్.వెంకటసుబ్బయ్య, ఇఫ్టూ రాష్ట్ర అధ్యక్షులు కె.పోలారి, కిసాన్ సభ రాష్ట్ర అధ్యక్షులు డి.హరినాథ్, ఇఫ్టూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామకృష్ణ ఎఐకెఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎం.వెంకటరెడ్డి, ఎఐటియుసి రాష్ట్ర సుధీర్, యుటియుసి రాష్ట్ర అధ్యక్షులు జానకీరాములు, టియుసిఐ రాష్ట్ర అధ్యక్షులు మరీదు ప్రసాద్ బాబు, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు దడాల సుబ్బారావు, రైతు కూలీ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు యు.వీరబాబు, జన సాహితీ రాష్ట్ర అధ్యక్షులు దివికుమార్, సిఐటియు జిల్లా అధ్యక్షులు ఎ.వెంకటేశ్వరరావు, ఎపిడబ్ల్యుజెఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.వెంకట్రావు, జి.ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు. సభకు సిఐటియు జిల్లా కార్యదర్శి సిహెచ్.శ్రీనివాసరావు, ఎఐటియుసి నగర ప్రధాన కార్యదర్శి మూలి సాంబశివరావు, రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మల్నీడు యలమందరావులు అధ్యక్ష వర్గంగా వ్యవహరించారు. తొలుత తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం రాష్ట్రపతికి వినతి పత్రం పంపాలని కోరుతూ జిల్లా కలెక్టర్‌కు అందజేశారు.

యాంటీ-షిప్ బాలిస్టిక్ క్షిపణిని ప్రయోగించిన పాక్

ఇస్లామాబాద్ : యాంటీ-షిప్ బాలిస్టిక్ క్షిపణిని పాకిస్తాన్ విజయవంతంగా ప్రయోగించింది. ఈ విషయాన్ని ఆ దేశ మిలిటరీ విభాగం ఇంటర్ సర్వీసెస్ పబ్లిక్ రిలేషన్స్ వెల్లడించింది. భూమిపై, సముద్రంలోని లక్ష్యాలను అత్యంత కచ్చితత్వంతో ఛేదించగలదని వెల్లడించింది. దేశీయంగా అభివృద్ధి చేసిన ఈ క్షిపణిని.. షిప్‌పై నుంచి లాంచ్ చేసినట్లు తెలిపింది. ఈ ప్రయోగం నేపథ్యంలో శాస్త్రవేత్తలకు అధ్యక్షుడు ఆసిఫ్ అలీ జర్దారీ, ప్రధాన మంత్రి షెహబాజ్ షరీఫ్ అభినందనలు తెలియజేశారు.

ఇటీవల పాకిస్తాన్ తన రక్షణరంగ సామర్థ్యాలను బలోపేతం చేసుకునే దిశగా ముమ్మర ప్రయత్నాలు చేస్తోంది. ఇందులో భాగంగా సెప్టెంబర్‌లో కొత్తగా అభివృద్ధి చేసిన ఫతా-4 క్రూజ్ క్షిపణిని ప్రయోగాత్మకంగా పరీక్షించింది. దాని రేంజ్ 700 కి.మీ. అది క్షిపణి రక్షణ వ్యవస్థలను దాటుకొని, తక్కువ ఎత్తు లక్ష్యాలను ఛేదిస్తుందని అప్పట్లో పాక్ వెల్లడించింది.

హాంకాంగ్‌లో భారీ అగ్ని ప్రమాదం

- 36 మంది మృతి
- అగ్ని కీలల్లో వందలాది మంది?

హాంకాంగ్ : హాంకాంగ్‌లోని ఓ నివాస సముదాయంలో భారీ అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో 36 మంది మృతి చెందగా, 30 మంది గాయపడ్డారు. వీరిలో 10 మంది పరిస్థితి విషమంగా ఉంది. మరోవైపు ఈ ప్రమాదంతో సుమారు 300 మంది కనిపించకుండా పోయారు. థాయ్ పో జిల్లాలోని ఆకాశహర్మ్యాల్లో బుధవారం మంటలు చెలరేగాయి. దాంతో ఆ ప్రాంతమంతా దట్టమైన పొగ వ్యాపించింది. ఆ నివాస సముదాయంలో 2000 ఇళ్లు ఉన్నాయని, అందులో కొన్ని ఇంకా నిర్మాణ దశలో ఉన్నాయని స్థానిక మీడియా కథనాలు పేర్కొన్నాయి.హాంకాంగ్ స్థానిక కాలమానం ప్రకారం.. మధ్యాహ్నం 2.51 గంటల సమయంలో ఈ ఘటనపై సమాచారం అందిందని అగ్నిమాపక విభాగం వెల్లడించింది. సమాచారం తెలిసినవెంటనే సంఘటనా ప్రాంతానికి భారీ స్థాయిలో ఫైర్ ఇంజిన్లు, సిబ్బందిని తరిలించినట్లు తెలిపింది. బుధవారం రాత్రి తరువాత కూడా సహాయక కార్యక్రమాలు కొనసాగుతున్నాయని వెల్లడించింది.

రష్యా, ఉక్రెయిన్‌కు అమెరికా ప్రతినిధులు

వాషింగ్టన్ : ఉక్రెయిన్ యుద్ధానికి ముగింపు పలికేందుకు తాను ప్రతిపాదించిన ప్రణాళిక బాగా అమలవుతోందని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ చెప్పారు. చర్చల్లో మరింత పురోగతి కోసం తన ప్రతినిధి స్టీవ్ విట్‌కాఫ్‌ను రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ వద్దకు, రక్షణ (సైనిక) మంత్రి డాన్ డ్రిస్కాల్‌ను ఉక్రెయిన్‌కు పంపుతున్నానని ఆయన తెలిపారు. చర్చల్లో పురోగతి సాధించిన తర్వాతే పుతిన్, ఉక్రెయిన్ అధ్యక్షుడు వ్లాదిమిర్ జెలెన్‌స్కీలను కలుస్తానని స్పష్టం చేశారు. ఎయిర్ ఫోర్స్ వన్ విమానంలో ఆయన మంగళవారం సాయంత్రం విలేకరులతో మాట్లాడుతూ యుద్ధానికి పరిష్కారం సాధించడం కష్టమేనని అన్నారు.

విట్ భోపాల్ కేంపస్‌లో విద్యార్థుల నిరసనలు

- కలుషిత నీరు, ఆహారంపై ఆందోళన
- కేంపస్ ఆస్తుల విధ్వంసం, పలు వాహనాలకు నిప్పు

భోపాల్ : విట్ భోపాల్ కేంపస్‌లో కలుషితమైన నీరు, ఏ మాత్రమూ శుభ్రంగా వండని ఆహారం పెడుతున్నారని విద్యార్థులు తీవ్రంగా నిరసన వ్యక్తం చేస్తూ మంగళవారం రాత్రి విధ్వంసానికి దిగారు. కేంపస్ ఆస్తులను ధ్వంసం చేస్తూ పలు వాహనాలకు నిప్పంటించారు. బుధవారం ఉదయం వందలాదిమంది విద్యార్థులు తమ ఇళ్ళకు వెళ్లిపోవడానికి విట్ కేంపస్ వెలుపల వేచి వుండడం కనిపించింది. మధ్యప్రదేశ్‌లోని సెహోర్ జిల్లాలో గల విట్ కేంపస్‌లో మంగళవారం రాత్రి 3వేల మందికి పైగా విద్యార్థులు ఆందోళనలకు దిగారని పోలీసులు తెలిపారు. కలుషితమైన ఆహారం, నీరు తాగడంతో అనేకమంది విద్యార్థులు పచ్చ కామెర్లతో బాధపడుతున్నారు. దీంతో ఆగ్రహానికి గురైన విద్యార్థులు అంబులెన్సుకు, బస్సుకు, మూడు కార్లకు నిప్పంటించారు. హాస్టళ్ళను, ఛాన్సలర్ నివాసాన్ని, కేంపస్‌లోని ఇతర ప్రాంతాలను కూడా ధ్వంసం చేశారు. లేబరెటరీలు, సైన్స్ పరికరాలు, లిఫ్టులను, సిసిటివి కెమెరాలను, మెస్‌ను, ఆహారం స్టోరేజీ రూమ్‌లను కూడా విద్యార్థులు ధ్వంసం చేశారు. పరిస్థితి అదుపు తప్పడంతో సమీప ప్రాంతాల్లోని స్టేషన్ల నుండి పోలీసులు కేంపస్‌కు వచ్చి పరిస్థితిని అదుపులోకి తెచ్చారని అష్టా సబ్‌డివిజనల్ పోలీసు అధికారి అకాష్ అమల్కర్ మీడియాకు తెలిపారు. సబ్ డివిజనల్ మేజిస్ట్రేట్, ఇతర సీనియర్ అధికారులు విద్యార్థులతో వివరంగా మాట్లాడి వారి ఆందోళనలు తెలుసుకున్నారని చెప్పారు. త్వరలోనే వారి సమస్యలను పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని తెలిపారు. కేంపస్‌లో తగిన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఒక విద్యార్థి ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా దాడికి పాల్పడ్డారన్న ఆరోపణలపై వార్డెన్ ప్రశాంత్ కుమార్ పాండే, మరో ఐదుగురు సిబ్బందిపై ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు చెప్పారు. కొంతమంది విద్యార్థులను వారు కొడుతున్న వీడియో ఒకటి తమ చేతికందిందని అమల్కర్ తెలిపారు. చట్టపరమైన చర్యలు ప్రారంభించినట్లు తెలిపారు. హింసాత్మక నిరసనల నేపథ్యంలో డిసెంబరు 8 వరకు శలవులను యూనివర్శిటీ అడ్మినిస్ట్రేషన్ ప్రకటించింది. దీంతో విద్యార్థులు ఇంటి బాట పట్టారు. అయితే తరగతులు మాత్రమే రద్దు చేయబడ్డాయని, విద్యార్థులు కేంపస్‌ను ఖాళీ చేయనక్కరలేదని విట్ రిజిస్ట్రార్ కె.కె.నాయర్ తెలిపారు. గత నెల రోజుల్లో 33మంది విద్యార్థులు జాండీస్ బారిన పడ్డారని ఆయన చెప్పారు. తాము నెల రోజుల పైబడి ఆహారం, నీరు గురించి ఫిర్యాదు చేస్తున్నా యూనివర్శిటీ యంత్రాంగం పట్టించుకోలేదని, అందుకే తాము నిరసనలకు దిగాల్సి వచ్చిందని కొంతమంది విద్యార్థులు తెలిపారు. అలాగే అనారోగ్యం బారిన పడిన విద్యార్థుల సంఖ్య గురించి కూడా వారు తప్పు చెబుతున్నారని, 200మందికి పైగా విద్యార్థులు ఇటీవలి వారాల్లో జాండీస్ బారిన పడ్డారని సీనియర్ విద్యార్థి ఒకరు తెలిపారు. పైగా ఫిర్యాదు చేసిన విద్యార్థులపై క్రమశిక్షణా చర్యలు తీసుకుంటామని బెదిరిస్తున్నారని చెప్పారు.

వెనిజులా చమురుపై ట్రంప్ కన్ను

- అందుకే మదురోతో సమావేశం

హూస్టన్ : వెనిజులాలోని అపార చమురు నిక్షేపాలపై అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ కన్నేశారు. వెనిజులా అధ్యక్షుడు నికొలస్ మదురోను ఎలాగైనా దారికి తెచ్చుకొని ఆ నిక్షేపాలను సొంతం చేసుకోవాలని ఆయన ఎత్తుగడ పన్నారు. వెనిజులా ప్రస్తుతం తన ముడి చమురులో ఎక్కువ భాగాన్ని చైనాకు విక్రయిస్తోంది. మదురోతో చర్చలు జరుపుతానని చెబుతున్న ట్రంప్, ఆ సందర్భంగా చమురు కొనుగోలు వ్యవహారాన్ని ముందుకు తెస్తారని పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు. కరేబియన్ ప్రాంతంలో ఓ వైపు సైనిక దళాలను మోహరిస్తూనే మరోవైపు మదురోతో చర్చలకు సిద్ధమేనని అమెరికా చెబుతోంది. దేశంలోని చమురు క్షేత్రాలలో విదేశీ పెట్టుబడులను ఆకర్షించేందుకు వెనిజులా చేస్తున్న ప్రయత్నాలు పెద్దగా ఫలించడం లేదు. అమెరికా ఇప్పటికే విధించిన ఆంక్షలే దీనికి కారణం.

ఒపెక్ సభ్యదేశమైన వెనిజులా చమురు ఉత్పత్తి ఈ ఏడాది రోజుకు సగటున 1.1 మిలియన్ బ్యారల్స్ వద్ద స్థిరంగా ఉంది.జూన్-అక్టోబర్ మధ్యకాలంలో ఇందులో 80 శాతానికి పైగా ఎగుమతులు చైనాకే వెళ్లాయి. అపారమైన ముడి చమురు నిల్వలు ఉన్నందునే అమెరికా తమను లక్ష్యంగా చేసుకున్నదని వెనిజులా చమురు శాఖ మంత్రి డెల్సీ రోడ్రిగుజ్ చెప్పారు. ఎలాంటి ధర చెల్లించకుండా వెనిజులా చమురు, సహజ వాయువు నిల్వలను సొంతం చేసుకోవాలని అమెరికా భావిస్తోందని ఆమె విమర్శించారు.

ఐరాసకు జిన్‌పింగ్ అభినందనలు

- పాలస్తీనా సంఘీభావ దినోత్సవం సందర్భంగా సందేశం



బీజింగ్ : పాలస్తీనా ప్రజలకు సంఘీభావం తెలుపుతూ పాటించే అంతర్జాతీయ దినోత్సవాన్ని పురస్కరించుకొని సమావేశం నిర్వహించిన నేపథ్యంలో ఐక్యరాజ్యసమితికి చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ అభినందనలు తెలిపారు. పాలస్తీనా సమస్య మధ్యప్రాచ్య ఘర్షణకు కేంద్ర బిందువుగా ఉన్నదని, అది అంతర్జాతీయ నిష్పాక్షికతను, న్యాయాన్ని, ప్రాంతీయ స్థిరత్వాన్ని ప్రభావితం చేస్తుందని ఐరాసకు పంపిన సందేశంలో ఆయన వివరించారు. ప్రస్తుత పరిస్థితులలో అంతర్జాతీయ సమాజం ఏకాభిప్రాయాన్ని కలిగి ఉండాలని, గాజాలో సమగ్రమైన, శాశ్వత కాల్పుల విరమణ కోసం క్రియాశీలక చర్యలు చేపట్టాలని సూచించారు. ఘర్షణలు తిరిగి తలెత్తకుండా చూడాలని కోరారు.

పాలస్తీనా ప్రజల ఆకాంక్షలను గౌరవించాలని, గాజాలో పరిస్థితులను త్వరగా మెరుగుపరచాలని, పాలస్తీనియన్ల ఇబ్బందులను తొలగించాలని జిన్‌పింగ్ తన సందేశంలో పిలుపునిచ్చారు. ముఖ్యంగా పాలస్తీనా సమస్యకు సాధ్యమైనంత త్వరగా రాజకీయ పరిష్కారం సాధించాల్సిన అవసరం ఉన్నదని నొక్కి చెప్పారు. పాలస్తీనా సమస్య అంతర్జాతీయ పాలనా వ్యవస్థ సమర్ధతకు ఓ పరీక్ష అని తెలిపారు. సమస్య మూలాలను గుర్తించి దానిని పరిష్కరించాల్సి ఉంటుందని, అందుకోసం పటిష్టమైన చర్యలు తీసుకోవాలని, చారిత్రక అన్యాయాలను సరిదిద్దాలని, న్యాయాన్ని నిలబెట్టాలని అంతర్జాతీయ సమాజాన్ని కోరారు.

పాలస్తీనా ప్రజలు తమ చట్టబద్ధమైన హక్కులను పునరుద్ధరించుకోవడానికి భద్రతా మండలిలో శాశ్వత సభ్య దేశంగా చైనా దృఢమైన మద్దతు ఇస్తుందని జిన్‌పింగ్ తెలిపారు. పాలస్తీనా సమస్యకు సమగ్రమైన, న్యాయమైన, శాశ్వత పరిష్కారం సాధించడానికి అంతర్జాతీయ సమాజంతో కలిసి పనిచేస్తూనే ఉంటామని ఆయన చెప్పారు.

ఐఐఎఫ్‌సిఎల్‌లో 25 శాతం ఉపసంహరణ

- వచ్చే ఏడాదిలో విక్రయం
- కేంద్రం ప్రణాళిక

న్యూఢిల్లీ : దీర్ఘకాలిక మౌలిక సదుపాయాల ఫైనాన్సింగ్ దిగ్గజం, ప్రభుత్వ రంగ రుణదాత అయిన ఇండియా ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్ (ఐఐఎఫ్‌సిఎల్)లో మోడి సర్కార్ 25 శాతం వరకు వాటాలను ఉపసంహరిచుకోవాలని యోచిస్తోంది. వాటాల విక్రయాన్ని పర్యవేక్షించే మంత్రుల కమిటీ తుది ఇన్షియల్ పబ్లిక్ ఆఫర్ పరిమాణాన్ని నిర్ణయిస్తుందని అధికారులు తెలిపినట్లు ఫైనాన్సియల్ ఎక్స్‌ప్రెస్ ఓ కథనంలో వెల్లడించింది. సెబీ పబ్లిక్ వాటా నిబంధనలను చేరుకోవడానికి ఈ వాటాల ఉపసంహరణను చేపడుతోన్నట్లు కేంద్రం ఓ సాకుగా పేర్కొంటుంది. వచ్చే ఆర్థిక సంవత్సరం 2026-27లో ఐఐఎఫ్‌సిఎల్‌లోని 25 శాతం వాటాలను విక్రయించడానికి చురుకుగా కసరత్తు జరుగుతోంది.

ఈ ఇష్యూలో మూలధన పెట్టుబడి కోసం పది శాతం, తాజా ఈక్విటీ, ప్రభుత్వం ద్వారా మరో 15 శాతం వాటాల విక్రయం ఉండవచ్చు. అదే జరిగితే ఇటీవల కాలంలో ప్రభుత్వం చేపట్టే మరో ప్రధాన డిజిన్వెస్ట్‌మెంట్‌గా నిలిచిపోనుంది.

ఐఐఎఫ్‌సిఎల్ లిస్టింగ్ ప్రతిపాదనకు కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలిపిందనిఆ వర్గాలు తెలిపాయి. డిజిన్వెస్ట్‌మెంట్ సన్నాహక పనులు పూర్తయిన తర్వాత 2026-27 ఆర్థిక సంవత్సరంలో ఐపిఒ ఉండే అవకాశం ఉంది. ఈ సంస్థలో కార్పొరేట్ గవర్నెన్స్‌ను బలోపేతం చేయడం, బడ్జెట్ మద్దతుపై ఆధారపడకుండా విస్తరణ కోసం తాజా మూలధనాన్ని సేకరించేందుకు వీలు కల్పించాలనే లక్ష్యంతో వాటాల ఉపసంహరణ చేపడుతోన్నట్లు ఆ వర్గాలు పేర్కొన్నాయి. పూర్తిగా కేంద్ర ప్రభుత్వ యాజమాన్యంలో ఉన్న ఐఐఎఫ్‌సిఎల్, రవాణా, ఇంధనం, నీరు, పారిశుధ్యం, పట్టణ రంగాలలో మౌలిక సదుపాయాల ప్రాజెక్టులకు దీర్ఘకాలిక ఆర్థిక సహాయాన్ని అందించడానికి 2006లో స్థాపించారు.

మెరుగైన ఆర్థిక పనితీరు..

గత ఐదేళ్లలో ఐఐఎఫ్‌సిఎల్ స్థిరమైన వృద్ధిని సాధించింది. ఆర్థిక సంవత్సరం 2019-20లో రూ.9,337 కోట్ల వార్షిక రుణాలను జారీ చేయగా.. 2024-25 నాటికి రూ.51,124 కోట్లకు చేరింది. మొత్తంగా 2025 మార్చి 31 నాటికి రూ.3.06 లక్షల కోట్ల రుణాలు జారీ చేసింది. గడిచిన ఐదేళ్లలో లాభాల్లోనూ భారీ వృద్ధిని సాధించింది. 2019-20లో రూ.51 కోట్ల నికర లాభాలను నమోదు చేయగా.. 2024-25లో ఏకంగా రూ.2,165 కోట్ల లాభాలు ప్రకటించింది. ఇదే సమయంలో ఆ సంస్థ స్థూల నిరర్థక ఆస్తులు 19.7 శాతం నుంచి ఏకంగా 1.11 శాతానికి పడిపోయాయి. నికర ఎన్‌పిఎలు 9.75 శాతం నుంచి 0.35 శాతానికి తగ్గాయి.



జీవన సౌరభం

పని చెయ్యాలనుకునే వారికి దారి దొరుకుతుంది. చెయ్యొద్దనుకునే వారికి సాకు దొరుకుతుంది.

మీకోసం

గోరువెచ్చని నీళ్లల్లో కొద్దిగా నిమ్మకాయ రసం పిండి, సర్ఫ్ వేసి బాగా కలపాలి. ఈ నీటిలో స్పాంజీ గానీ, మెత్తని వస్త్రాన్ని గానీ ముంచి గోడలపై ఉన్న పెన్సిళ్లు, స్కెచ్ మరకలను రుద్దితే మరకలు పోతాయి.



ప్రోత్సాహం



మల్లంపల్లి గ్రామ పాఠశాలలో ఏడవ తరగతి చదివే విద్యార్థులు రాము, సునీత ఎనిమిదవ తరగతి చదివే రజనీ, శివ చాలా అల్లరి పిల్లలు. వీళ్ళ కొంటె పనులని భరించలేని ఉపాధ్యాయులు ప్రధానోపాధ్యాయులకి ఫిర్యాదు చేశారు. మరుసటి రోజు ప్రిన్సిపాల్, పిల్లలని తన కార్యాలయానికి రమ్మని పిలిపించారు.


నలుగురు పిల్లలు భయంభయంగా ప్రిన్సిపాల్ రూమ్‌కి వెళ్లారు. కోపంతో దండిస్తారనుకున్న ప్రిన్సిపాల్, పిల్లలతో నవ్వుతూ మాట్లాడారు. రాబోయే పాఠశాల వార్షికోత్సవంలో 'మీ నలుగురూ కలిసికట్టుగా పనిచేయాల'ని వారికి బాధ్యతలు కూడా అప్పగించారు. సునీత, రజనీ పూలు కోసుకుని దండలు అల్లుకొని వచ్చి ద్వారాలను, ఫొటోలను అలంకరించాలని, రాము శివ కార్యక్రమ నిర్వహణ కోసం వేదికపై ఏర్పాట్లకు సహకరించాలని ఆదేశించారు.

మాస్టారు తమను దండించకపోగా, బడిలో చాలా మంది పిల్లలుండగా తమకే ప్రాధాన్యతనిచ్చి బాధ్యతలు అప్పగించారని పిల్లలు లోలోన ఎంతో సంతోషపడిపోయారు. ఇంతలో వార్షికోత్సవం రానే వచ్చింది. ఆ రోజు ఉదయమే నలుగురు పిల్లలు తమకి అప్పగించిన పనులని చక్కగా చేశారు. కార్యక్రమం ముగిసిన తరువాత 'నలుగురు పిల్లల చొరవతోనే ఇది విజయవంతం అయింద'ని ప్రిన్సిపాల్ ప్రకటించారు. ఉపాధ్యాయులు వాళ్లకి పుస్తకాలు, పెన్నులు బహుమతులుగా ఇచ్చారు. అప్పుడు వేదిక కింద ఉన్న పిల్లలు చప్పట్లతో తమ అభినందనలు చెప్పారు.

ఇదంతా చూస్తున్న పిల్లల కళ్ళు ఆనందంతో మెరిసిపోయాయి. కొద్ది రోజులలోనే నలుగురు పిల్లల్లో ఊహించని విధంగా మార్పు వచ్చింది. అల్లరి, ఆకతాయి చేష్టలు మాని బుద్ధిగా చదువుకున్నారు.


– నాగరాజు కామర్సు,
92480 93580.

దారి చెప్పండి



పిల్లలూ, ఇక్కడ ఉన్న బాతు పిల్లలు కొలను దగ్గరకు చేరుకోవాలి. దారి చూపించరూ?

నేను గీసిన బొమ్మ





ధీరజ్ సాకరే,
8వ తరగతి,
అక్షర శ్రీ
పాఠశాల,ఆదోని,
కర్నూలు.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

వేడుకలు.. సంపద ప్రదర్శనలు కాకూడదని...





ప్రతీకాత్మక చిత్రాలు

'**పి**ల్ల పెళ్లి పెట్టుకున్నాం. నగలు చేయించాలి. పిల్లలు పెద్దవాళ్లు అవుతున్నారు. నగలు లేక నలుగురిలోకి వెళ్లాలంటే సిగ్గుగా ఉంది' అని అనుకోని పేద, మధ్య తరగతి కుటుంబాలు ఉండవు. అలా 'అవసరానికి' పనికివస్తాయి అని అవసరం ఉన్నా లేకున్నా అప్పు చేసి మరీ నగలు చేయించేవాళ్లు ఉంటారు. 'చుట్టాల పెళ్లిల్లో ఫలానా వాళ్లు నగలతో వచ్చారు.. ఈసారి ఫంక్షన్‌కి ఆ నగ మన పిల్లకి కూడా చేయించాలి' అని డాబులకి, దర్పాలకి పోయేవాళ్లూ కనిపిస్తారు. అయితే ఇటీవల ఉత్తరాఖండ్‌లోని మారుమూల పల్లెల్లో మహిళలు ధరించే నగలపై పరిమితులు విధించారు. 'చెవిదిద్దులు, ముక్కుపుడక, మంగళసూత్రం' తప్పితే మరే నగ ఆ గ్రామాల ఆడవాళ్లు ధరించకూడదని ఆదేశాలు జారీచేశారు. ఎవరైనా ఈ ఆంక్షలని మీరి ఎక్కువ నగలు చేయించుకుంటే రూ.50 వేల జరిమానా కూడా విధించారు. సాధారణంగా మహిళలు వేసుకునే దుస్తులు, నగలు వేసుకోవడంపై ఆంక్షలు పెట్టడం సమర్థించలేం. కానీ దీని వెనుక ఉన్న కారణాలు ఇప్పుడు సమాజంలో చర్చకు దారితీస్తున్నాయి.

ఉత్తరాఖండ్‌లోని డెహ్రాడూన్ జిల్లా కాందార్, ఇంద్రాణి గ్రామాల పంచాయతీ పెద్దలు ఇటీవల ఈ తీర్మానం చేశారు. దీని వెనుక ఉన్న కారణాన్ని వాళ్లు ఇలా వివరించారు. 'ప్రస్తుతం బంగారం ధరలు ఎక్కువగా ఉన్నాయి. ఈ పరిస్థితుల్లో పెళ్లిళ్లకి, పండగలకి గ్రామస్తులు అప్పులు చేసి మరీ బంగారం కొంటున్నట్లు మా దృష్టికి వచ్చింది. ఈ ఆర్థిక భారాన్ని తగ్గించేందుకు, అసమానతలు లేని సమాజం నిర్మించేందుకు ఈ కఠిన నిర్ణయం తీసుకున్నాం' అని చెప్పారు.

ఆడంబరాల సంస్కృతి

ఆలోచించి చూస్తే.. వాళ్లు చెప్పిన మాటల్లో నిజం ఉంది. ఒకప్పుడు సంస్కృతి, సాంప్రదాయ వేడుకల్లో లేని ఆడంబరాల సంస్కృతి రానురాను సమాజంలో విస్తరిస్తోంది. ఎవరో ఏదో చేశారని, ఎక్కడో ఏదో జరిగిందని 'మన ఇంటి వేడుక'లో కూడా అలాంటివి చేయాలని సామాన్యులు సైతం తలకిమించిన భారాలు నెత్తిమీద వేసుకుంటున్నారు. దీనిపైన అక్కడ పంచాయతి పెద్దలు ఇలా వ్యాఖ్యానించారు.

'పెరుగుతున్న బంగారం ధర పేద కుటుంబాలకి పెనుభారం తెచ్చిపెట్టింది. ధనవంతులని అనుకరించడం వల్ల తరచూ ఈ కుటుంబాలు అప్పుల్లో కూరుకుపోతున్నాయి. లేదా వారు దాచుకున్న కాస్తోకూస్తో డబ్బు కరిగిపోతోంది. అందుకే ఈ నిర్ణయం చేశాం' అని చెప్పారు.

సంపద ప్రదర్శనగా ...

పెళ్లి ఒకప్పుడు ఆచారంగా వుండేది. సంబంధాల వేడుకలా జరిగేది. కానీ నేడు అది సంపద ప్రదర్శనగా మారింది. 'ధనిక, పేద తారతమ్యం లేకుండా సమానత్వం రావాలంటే ఈ ప్రదర్శన గోడలని కూల్చేయాల'ని ఆ గ్రామస్తులు నమ్ముతున్నారు. అలా చేస్తే క్రమంగా 'అనవసరమైన ఖర్చు తగ్గుతుంది. సామాజిక ఐక్యత పెరుగుతుంద'ని వారు ఆశిస్తున్నారు.

'మహిళలు మూడు బంగారు నగలు మాత్రమే ధరించాల'ని ఈ గ్రామాలు తీసుకున్న ఈ నిర్ణయం కొత్త వివాహ మార్గదర్శకాలకి దారితీస్తున్నాయి. నగలపైనే కాదు, పెళ్లి వేడుకలో మద్యపానాన్ని కూడా చుట్టుపక్కల కొన్ని గ్రామాలు నిషేధించాయి.

ఇప్పుడు అదంతా మారిపోతోంది ఆదివాసీలు ఎక్కువగా నివసించే ఈ కొండగ్రామాల్లో ఇంట్లో పెద్ద కొడుకు పెళ్లికి ముందు మహిళలని సహపంక్తి భోజనాలకి ఆహ్వానించడం ఆనవాయితీగా ఉంది. అప్పుడు అక్కడికి రకరకాల కుటుంబాలకి చెందిన వారంతా హాజరవుతారు. అలాంటప్పుడు జరిగే ఒక తంతుని లికోదేవీ అనే గ్రామస్తురాలు ఇలా చెప్పింది. 'భోజనానికి వచ్చే మహిళల్లో ఒకరు వేసుకున్న నగలు చూసి మరొకరు ప్రభావితమవ్వడం సాధారణంగా జరిగేది. పేద కుటుంబాల మహిళలకి అది చాలా భారంగా ఉండేది. కానీ ఇప్పుడు అదంతా మారిపోతోంది' అని ఆమె సంతోషం వ్యక్తం చేసింది.

వేడుకల్లో మద్యం వద్దని...

వేడుకల్లో మద్యపానంపై నిషేధం విధించిన ఉత్తరకాశీకి చెందిన దుండా బ్లాక్ లోద్రా గ్రామ పంచాయతీ పెద్దలు ఈ నిర్ణయంపై ఇలా చెప్పారు. 'మా గ్రామంలో జరిగే పెళ్లి వేడుకల్లోనే కాదు, పక్క గ్రామాల్లో మద్యం పంపిణీ చేసే వేడుకలకి కూడా మా గ్రామస్తులు హాజరవ్వకూడదని ఆంక్షలు పెట్టాం. దీనివల్ల యువత, మహిళలు ఒత్తిడి నుండి దూరమవుతారు' అని వారు చెప్పారు.

ఒత్తిడి తగ్గించాలని..

వేడుక ఏదైనా నగలు, దుస్తులు, భోజనాలు, పానీయాలు ఎంత గొప్పగా వున్నాయన్న సంస్కృతే ఇప్పుడు ఎక్కడ చూసినా కనిపిస్తోంది. దీనిపై లోద్రా గ్రామ పెద్ద ఇలా చెప్పారు. 'పెళ్లి పెట్టుకున్న పేద కుటుంబాలకి చెందిన తల్లిదండ్రులు ఈ ఖర్చుని ఎలా భరించాలా? అని ఆందోళనపడుతున్నారు. వారిపై ఈ ఒత్తిడి తగ్గించాలనే మేము ఈ నిర్ణయం తీసుకున్నాం' అంటున్నారు.

అందరూ సమానంగా ఉండాలని...

నగలు ధరించడంపై పంచాయతీలో తీసుకున్న నిర్ణయంపై గ్రామపెద్ద చెప్పిన కారణం సర్వత్రా చర్చనీయం. 'పెళ్ళిళ్లు, వేడుకలప్పుడు గ్రామంలో పేద కుటుంబాలు ధనిక కుటుంబాల దగ్గర అప్పులు చేసి మరీ బంగారం కొంటున్నారు. ఆ తరువాత వారికి అది పెద్ద భారంగా మారుతోంది. ఇదివారిని క్రమంగా మరింత పేదలుగా మారుస్తోంది. ఇలా జరగడం మాకు ఇష్టం లేదు. మా గ్రామంలో ప్రజలందరూ సమానంగా ఉండాలి అని భావించాం. అందుకే ఇలా చేశాం' అని వారు అంటున్నారు.

రాజధాని డెహ్రాడూన్‌కి ఉత్తరాన 85 కిలోమీటర్ల దూరంలో ఉన్న కందర్ గ్రామం చాలా చిన్నది. కేవలం 270 మందే అక్కడ నివసిస్తున్నారు. కొండపై మంచుతో కప్పబడి ఉన్న ఈ గ్రామం ఎంతో సుందరమైనదని పేరు. ట్రెక్కింగ్, స్కీయింగ్‌ని ఇష్టపడే పర్యాటకులు తరచూ ఇక్కడికి వస్తుంటారు. పైన చెప్పుకున్న గ్రామాల భౌగోళిక పరిస్థితులు కూడా ఇంచుమించూ అలాగే ఉంటాయి. ఇప్పుడు ఆ సుందర గ్రామాలు తీసుకున్న ఈ నిర్ణయాలు సమాజంలో పెరుగుతున్న ఆడంబర సంస్కృతికి అందమైన ధిక్కారాలు.

దక్షిణాఫ్రికా చేతిలోనూ వైట్‌వాష్

సఫారీ జట్టు 25ఏళ్ల మరోసారి.. తొలిసారి టెస్ట్ సిరీస్ క్లీన్‌స్వీప్

స్వదేశంలో టెస్ట్‌ల్లో టీమిండియాకు అస్సలు కలిసిరావడం లేదు. సరిగ్గా ఏడాది క్రితం న్యూజిలాండ్ చేతిలో మూడు టెస్ట్ మ్యాచ్‌ల సిరీస్‌ను 0-3తో వైట్‌వాష్‌కు గురైన టీమిండియా.. సరిగ్గా ఏడాది తర్వాత స్వదేశంలోనే దక్షిణాఫ్రికా చేతిలో రెండు టెస్ట్ మ్యాచ్‌ల సిరీస్‌ను 0-2తో కోల్పోయి మరోసారి వైట్‌వాష్‌కు గురైంది. విదేశీ గడ్డపై చెలరేగి ఆడే భారత ఆటగాళ్లు.. స్వదేశంలో చతికిలపడుతున్నారు. స్వదేశీ పిచ్‌లపై భారత ఆటగాళ్లు క్రీజ్‌లో నిలదొక్కుకోలేక పోతున్నారు. స్పిన్నర్లకు స్వర్గధామమైన మన పిచ్‌లపై విదేశీ స్పిన్నర్లు చెలరేగితే.. మన స్పిన్నర్లు తేలిపోతున్నారు. ఎందుకిలా జరుగుతుందా..? అని ప్రతి క్రీడాభిమాని మదనపడుతున్నాడు.



గౌహతి: రెండో టెస్టులో టీమిండియా 408 పరుగుల తేడాతో ఘోర పరాజయం పాలైంది. చివరి రోజు భారత ఆటగాళ్లు కనీస పోరాట పటిమ కూడా కనబరచలేకపోయారు. సొంతగడ్డపై ఇంతటి భారీ ఓటమిని అభిమానులు జీర్ణించుకోలేకపోతున్నారు. రెండో టెస్ట్ ప్రారంభం నుంచి సఫారీలు ఆధిపత్యం కనబరిచారు. తొలి ఇన్నింగ్స్‌లో 489 పరుగుల భారీ స్కోరు సాధించిన ప్రొటీస్ జట్టు.. అనంతరం టీమిండియాను 201 పరుగులకే ఆలౌట్ చేసింది. పేసర్ మార్కో యాన్సెన్ ఆరు వికెట్లతో సత్తా చాటి.. సౌతాఫ్రికాకు 288 పరుగుల భారీ ఆధిక్యం లభించడంలో కీలక పాత్ర పోషించాడు. ఆ తర్వాత టీమిండియాను ఫాలో ఆన్ ఆడించకుండా తామే మళ్లీ బ్యాటింగ్ చేసిన సఫారీలు.. నాలుగో రోజు ఆఖరి సెషన్ వరకు ఇన్నింగ్స్ డిక్లేర్ చేయలేదు. ఐదు వికెట్ల నష్టానికి 260 పరుగులు చేసిన తర్వాత దక్షిణాఫ్రికా తమ ఇన్నింగ్స్ డిక్లేర్ చేసి.. టీమిండియాకు 549 పరుగుల భారీ లక్ష్యాన్ని నిర్దేశించింది. లక్ష్య ఛేదనకు దిగిన టీమిండియాకు ఆదిలోనే షాకులు తగిలాయి. ఓపెనర్లలో యశస్వి జైస్వాల్ (13)ను యాన్సెన్ వెనక్కి పంపగా.. కేఎల్ రాహుల్ (6)ను సైమన్ హార్మర్ అవుట్ చేశాడు. దీంతో మంగళవారం నాటి నాలుగోరోజు ఆట ముగిసే సరికి టీమిండియా రెండు వికెట్ల నష్టానికి కేవలం 27 పరుగులు చేసింది.

హార్మర్ విజృంభణ

ఓవర్‌నైట్ స్కోర్ 2 వికెట్ల నష్టానికి 27 పరుగులతో బుధవారం, ఆఖరి రోజు ఆటను కొనసాగించిన టీమిండియాకు సఫారీ స్పిన్నర్ సైమన్ హార్మర్ చుక్కలు చూపించాడు. నైట్ వాచ్‌మన్ కుల్దీప్ యాదవ్ (5)ను సైమన్ బౌల్డ్ చేయగా.. పట్టుదలగా క్రీజులో నిలబడ్డ సాయి సుదర్శన్ (14; 139 బంతుల్లో)ను సెనూరన్ ముత్తుస్వామి వెనక్కి పంపాడు. ఆ తర్వాత సైమన్ హార్మర్ తన వికెట్ల వేటను వేగవంతం చేశాడు. ధ్రువ్ జురెల్ (2), కెప్టెన్ రిషభ్ పంత్ (13), వాషింగ్టన్ సుందర్ (16), నితీశ్ కుమార్ రెడ్డి (0)లను అవుట్ చేసి.. భారత బ్యాటింగ్ ఆర్డర్‌ను కుదేలు చేశాడు. రవీంద్ర జడేజా (87 బంతుల్లో 54)ను వెనక్కి పంపిన మరో స్పిన్నర్ కేశవ్ మహరాజ్.. మొహమ్మద్ సిరాజ్ (0) ఆఖరి వికెట్‌గా వెనక్కి పంపాడు. సైమన్ హార్మర్ ఆరు వికెట్లతో చెలరేగగా.. కేశవ్ మహరాజ్ రెండు వికెట్లు దక్కాయి. దీంతో సౌతాఫ్రికా పాతికేళ్ల తర్వాత తొలిసారి భారత్‌లో టెస్టు సిరీస్ గెలవడమే కాదు.. వైట్‌వాష్ చేసింది. 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' యాన్సెన్, సిరీస్ హార్మర్‌కు దక్కాయి. ముత్తుస్వామి చెరో వికెట్ దక్కించుకున్నారు. స్వదేశంలో పరుగుల పరంగా భారత్‌కు అతిపెద్ద ఓటమి. గతంలో 2004లో నాగ్‌పూర్‌లో ఆస్ట్రేలియా చేతిలో టీమిండియా 342 పరుగుల తేడాతో ఓడిపోయింది.

స్కోర్‌బోర్డు...

దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్ : 489పరుగులు
భారత్ తొలి ఇన్నింగ్స్ : 201పరుగులు
దక్షిణాఫ్రికా రెండో ఇన్నింగ్స్: 260/5డిక్లేర్డ్

ఇండియా రెండో ఇన్నింగ్స్: జైస్వాల్ (సి)వెర్రెయనె (బి)యాన్సెన్ 13, కెఎల్ రాహుల్ (బి)హార్మర్ 6, సాయి సుదర్శన్ (సి)మార్క్రమ్ (బి)ముత్తుసామి 14, కుల్దీప్ (బి)హార్మర్ 5, జురెల్ (సి)మార్క్రమ్ (బి)హార్మర్ 2, పంత్ (సి)మార్క్రమ్ (బి)హార్మర్ 13, జడేజా (స్టంప్)వెర్రెయనె (బి)మహరాజ్ 54, సుందర్ (సి)మార్క్రమ్ (బి)హార్మర్ 16, నితీశ్ రెడ్డి (సి)వెర్రెయనె (బి)హార్మర్ 0, బుమ్రా (నాటౌట్) 1, సిరాజ్ (సి)జాన్సెన్ (బి)మహరాజ్ 0, అదనం 16. (63.5ఓవర్లలో ఆలౌట్)140 పరుగులు. **వికెట్ల పతనం:** 1/17, 2/21, 3/40, 4/42, 5/58, 6/95, 7/130, 8/138, 9/140, 10/140 **బౌలింగ్:** జాన్సెన్ 15-7-23-1, ముల్డర్ 4-1-6-0, హార్మర్ 23-6-37-6, మహరాజ్ 12.5-1-37-2, మార్క్రమ్ 2-0-2-0, ముత్తుసామి 7-1-21-1.

పెనాల్టీ స్టోక్‌తో మలేషియాపై భారత్ గెలుపు

సుల్తాన్ అజ్లాన్ షా హాకీ టోర్నీ


ఇపో(మలేషియా): సుల్తాన్ అజ్లాన్ షా హాకీ టోర్నమెంట్‌లో భారతజట్టు మరో విజయాన్ని సొంతం చేసుకుంది. బెల్జియం చేతిలో పోరాడి ఓడిన భారత్.. బుధవారం జరిగిన మూడో లీగ్ మ్యాచ్‌లో ఆతిథ్య మలేషియాపై 4-3గోల్స్ తేడాతో గెలిచి ఫైనల్ ఆశలు సజీవంగా నిలుపుకుంది. సుల్తాన్ అజ్లాన్ షా హాకీ స్టేడియంలో మలేషియాతో జరిగిన పోరులో చివరి క్వార్టర్‌కు ముందు ఇరుజట్లు 3-3గోల్స్‌తో సమంగా ఉన్నాయి. ఈ క్రమంలో మ్యాచ్ డ్రా అవుతుందనుకునే దశలో భారత్‌కు దక్కిన పెనాల్టీ స్టోక్‌ను సంజయ్ చేశాడు. భారత్ తరఫున సెల్వమ్(7వ ని.), సుఖ్‌జీత్ సింగ్(21), అమిత్ రోహిదాస్(39)కి తోడు సంజయ్ 53వ ని.లో గోల్స్ చేయగా.. మలేషియా తరఫున ఫైజల్(13), ఫిత్రి సారి(36), మర్వాన్(45) ఒక్కో గోల్ కొట్టారు. ప్రపంచ ర్యాంకింగ్స్‌లో భారత్ 7వ, మలేషియా 12వ ర్యాంక్‌లో ఉన్నాయి. తొలి లీగ్ మ్యాచ్‌లో కొరియాపై 1-0తో నెగ్గిన భారత్.. రెండో లీగ్ మ్యాచ్‌లో బెల్జియం చేతిలో 2-3గోల్స్ తేడాతో ఓటమిపాలైన విషయం తెలిసిందే. గురువారం జరిగే నాల్గో లీగ్ మ్యాచ్‌లో భారత హాకీ జట్టు న్యూజిలాండ్‌తో తలపడనుంది.

భారత్ వేదికగా 2030 కామన్వెల్త్ క్రీడలు



సిడ్నీ: 2030 కామన్వెల్త్ క్రీడల నిర్వహణ హక్కులు భారత్‌కు దక్కాయి. గ్లాస్గోలో బుధవారం జరిగిన కామన్వెల్త్ స్పోర్ట్ వార్షిక సర్వసభ్య సమావేశంలో అధికారికంగా ప్రకటించారు. 2010 క్రీడలకు భారత్ న్యూఢిల్లీలో తొలిసారి ఆతిథ్యమిచ్చింది. ఈసారి అహ్మదాబాద్ వేదికగా జరగనున్నాయి. 2036 ఒలింపిక్స్‌కు ఆతిథ్యమివ్వాలని భారత్ కోరుకుంటున్న తరుణంలో.. కామన్వెల్త్ గేమ్స్ ఆతిథ్య హక్కులు దక్కడం కీలక పరిణామం. ఈ క్రీడలకు 2030లో వందేళ్లు పూర్తి కానుండడం విశేషం. వీటి నిర్వహణ కోసం నైజీరియా నగరం అబుజా నుంచి పోటీ ఎదురైంది. కానీ ఎగ్జిక్యూటివ్ బోర్డు అహ్మదాబాద్ వైపే మొగ్గుచూపింది.

'ఎన్‌బికె-111' మొదలైంది




బాలకృష్ణ, గోపీచంద్ మలినేని కాంబోలో రాబోతున్న కొత్త సినిమా 'ఎన్‌బికె-111' బుధవారం ప్రారంభమైంది. రామానాయుడు స్టూడియోలో నిర్వహించిన ఈ వేడుకకు బాలకృష్ణతో పాటు దర్శకుడు బోయపాటి శ్రీను, నిర్మాత కేఎస్ రామారావు, దర్శకుడు బుచ్చిబాబు, దర్శకుడు బాబి కొల్లి తదితరులు హాజరయ్యారు. ముహూర్తపు సన్నివేశానికి బి. గోపాల్ క్లాప్ కొట్టారు. నయనతార ఈ చిత్రంలో హీరోయిన్‌గా నటిస్తున్నారు. వృద్ధి సినిమాస్ పతాకంపై వెంకట సతీష్ కిలారు ఈ ప్రాజెక్ట్‌ను నిర్మిస్తున్నారు. ఎస్.ఎస్. తమన్ సంగీతం అందిస్తున్నారు. డిసెంబర్ మూడో వారం నుంచి రెగ్యులర్ షూటింగ్ ప్రారంభంకానుంది.



నేడు 'ఆంధ్ర కింగ్ తాలూకా' సినిమా విడుదల

రామ్ పోతినేని, భాగ్యశ్రీ బోర్సే జోడీగా నటించిన చిత్రం 'ఆంధ్ర కింగ్ తాలూకా'. గురువారం ఈ సినిమా థియేటర్లలోకి విడుదల కానుంది. మైత్రీ మూవీ మేకర్స్ నిర్మించారు. ఈ సినిమా నుంచి విడుదలైన పోస్టర్లు, పాటలు, టీజర్లు ఇప్పటికే సామాజిక మాధ్యమాల్లో బాగా ట్రెండింగ్‌లో ఉన్నాయి. మైత్రి మూవీ మేకర్స్ ఈ సినిమాను నిర్మించారు. కథను దర్శకుడు మహేష్‌బాబు పి. తెరకెక్కించారు. ఉపేంద్ర కీలక పాత్రలో నటించారు మురళీ శర్మ, రావు రమేష్, సత్య, రాహుల్ రామకృష్ణ కీలకపాత్రల్లో నటించారు. వివేక్ మెర్విన్ సంగీతాన్ని అందించారు.

ఆన్‌లైన్ వేధింపులపై పోరాడడానికి



మహిళలపై పెరుగుతోన్న ఆన్‌లైన్ వేధింపులకు వ్యతిరేకంగా సమంత ఐక్యరాజ్యసమితితో కలిసి పనిచేయనున్నారు. 'మహిళల గౌరవాన్ని కాపాడటం అందరి బాధ్యత' అంటూ యూఎన్ విమెన్ ఇండియా నిర్వహించే కార్యక్రమంలో ఆమె తన స్వరాన్ని వినిపించనున్నారు. నవంబర్ 25 నుంచి డిసెంబర్ 10 వరకు 16 రోజుల పాటు జరగనున్న ఈ కార్యక్రమంలో తాను కూడా భాగమైనట్లు సమంత తెలిపారు. ఈ సందర్భంగా ఆన్‌లైన్ వేధింపుల విషయంలో తన అనుభవాలను ఆమె పంచుకున్నారు. 'నేను ఎన్నోసార్లు ఈ పరిస్థితిని అనుభవించాను. ఇలాంటి వాటిపై మహిళల్లో అవగాహన పెరగాలి. ఈ ప్రచార కార్యక్రమం లక్ష్యమదే' అని సమంత తెలిపారు.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68